www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

వెల (Price) : Rs. 6.50

శనివారం | 1-3-2025 | పేజీలు: 14

శనివారం శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: విదియ రా.12:10 తదుపరి తదియ, నక్షత్రం: పూర్వాభాద్ర ఉ.11:23 తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: రా.8:01-9:27, అమృతఘడియలు: తె.4:39-6:06, దుర్ముహూర్తం: ఉ.6:36-8:10, రాహుకాలం ఉ. 9:00-10:30; సూర్యోదయం: 6:36, సూర్యాస్తమయం: 6:18

సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 315 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మార్కెట్లకు ఫిబ్రవరీ




ట్రంప్ దెబ్బకు సూచీలు ధమాల్.. గత నెలంతా 'బేర్' పట్టు

సెన్సెక్స్ 4300 పతనం.. రూ. 85 లక్షల కోట్లు హాంఫట్

బ్లాక్ ఫ్రైడే.. సెన్సెక్స్ 1,414, నిఫ్టీ 420 పాయింట్లు డౌన్

ఒక్కరోజులోనే రూ.9 లక్షల కోట్ల సంపద ఆవిరి 9

అమెరికాలో కొనసాగుతున్న ఉద్యోగుల తొలగింపు 2




చంద్రబాబు 1990వ దశకంలోనే విజన్ 2020 డాక్యుమెంట్‌ను రూపొందించారు. అది సాకారమైంది. ఇప్పుడు... 2024లో 'స్వర్ణాంధ్ర 2047'కు శ్రీకారం చుట్టి రాష్ట్రాభివృద్ధికి మార్గనిర్దేశం చేశారు. స్థిరమైన వృద్ధిరేటు, తలసరి ఆదాయం పెంపు... అభివృద్ధి ఫలాలను అణగారిన వర్గాలకు అందించడం ద్వారా పేదరిక నిర్మూలనే దీని లక్ష్యం. స్వర్ణాంధ్ర-2047 సాధన దిశగా మా ప్రభుత్వం పనులు మొదలుపెట్టింది.

- పయ్యావుల కేశవ్, ఆర్థిక మంత్రి



అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెడుతున్న పయ్యావుల. శ్రద్ధగా చదువుతున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్



పండంటి ప్రగతికి పది సూత్రాలు!



'స్వర్ణాంధ్ర-2047' దిశగా తొలి అడుగు

దాని మేరకే బడ్జెట్‌లో కేటాయింపులు



బడ్జెట్ ప్రతులతో సభకు వస్తున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

రాష్ట్ర పునర్నిర్మాణం, ఆర్థిక వృద్ధి లక్ష్యం

రూ.3.22 లక్షల కోట్లతో వార్షిక బడ్జెట్

అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతుల్యం

మూలధన వ్యయానికి రెట్టింపు నిధులు

'సాగు' వృద్ధికి రూ.29 వేల కోట్లు

పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు, మౌలిక సదుపాయాలకు పెద్దపీట

'తల్లికి వందనం' కోసం 9,400 కోట్లు

'అన్నదాత సుఖీభవ'కు కేటాయింపులు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అభివృద్ధి... సంక్షేమం... ఏడాదికి కేటాయింపులు... దీర్ఘకాలిక లక్ష్యాలు! 'స్వర్ణాంధ్ర-2047' సాధన దిశగా అడుగులు! కూటమి సర్కారు ప్రవేశపెట్టిన తొలి పూర్తిస్థాయి బడ్జెట్‌కు ఇదే దిశా, దశ! రూ.3,22,359 కోట్ల భారీ మొత్తంతో 2025-26 వార్షిక బడ్జెట్ రూపుదిద్దుకుంది. పేరుకు ఇది.. ఒక్క ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జమా ఖర్చుల పద్దు! కానీ... 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధన దిశగా ఈ బడ్జెట్‌లో తొలి అడుగు వేశారు. అందుకు తగిన విధంగా లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. దీనికోసం

మిగతా 12వ పేజీలో...

మొత్తం బడ్జెట్	3,22,359
రెవెన్యూ వ్యయం	2,51,162
మూలధన వ్యయం	40,636
రెవెన్యూ లోటు	(-)33,186

(రూ.కోట్లలో..)

సంపన్న, ఆరోగ్య, సంతోషకర ఆంధ్రా కోసం దశ మార్గాలు

1) నైపుణ్యం, ఉపాధి కల్పన
2) జనాభా, మానవ వనరుల అభివృద్ధి
3) నీటి సంరక్షణ
4) వ్యవసాయం అభివృద్ధి
5) టెక్నాలజీ విస్తృత వినియోగం
6) స్వచ్ఛ ఆంధ్ర
7) అత్యుత్తమ నాణ్యమైన ఉత్పత్తుల తయారీ
8) చౌకగా ఇంధన ఉత్పత్తి
9) మెరుగైన రవాణా సదుపాయాలు
10) పేదరిక నిర్మూలన

బడ్జెట్ సమగ్ర కథనాలు 10, 11, 12, 13లో

సంక్షేమం.. అభివృద్ధి రెండు కళ్లుగా

బడ్జెట్ కేటాయింపుల్లో సమతుల్యం

పునర్నిర్మాణం సవాలే!

అయినా తక్కువ సమయంలోనే పురోగతి

బడ్జెట్ ప్రసంగంలో పయ్యావుల కేశవ్ ఉద్ఘాటన

రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాది

ఏపీ గతిని, స్థితిని మార్చే ప్రగతిశీల బడ్జెట్: సీఎం

సంక్షేమం, సుస్థిర అభివృద్ధే లక్ష్యం: పవన్

ఆరోగ్యానికి భరోసా

కుటుంబానికి 25 లక్షల ఆరోగ్య బీమా

బడ్జెట్‌లో వైద్య ఆరోగ్య శాఖకు 19,265 కోట్లు

ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు రూ.4 వేల కోట్లు

'అంచనాలు' అందేనా?

కేంద్ర గ్రాంట్లపై కొండంత ఆశ

పన్ను, పన్నేతర ఆదాయం లెక్కలూ ఎక్కువే!

ఈ ఏడాది నుంచే 'తల్లికి వందనం'

1 నుంచి ఇంటర్ వరకూ.. ప్రతి విద్యార్థికీ వర్తింపు

సూపర్-6 హామీ అమలుకు ప్రభుత్వం ముందడుగు

అన్నదాతా సుఖీభవ

ఒక్కో రైతుకు రూ.20 వేల చొప్పున లబ్ధి

కౌలు రైతులకూ అంతే మొత్తం వర్తింపు

ప్రాథమిక రంగంగా వ్యవసాయం.. గ్రోత్ ఇంజన్లుగా 11 పంటలు

వడివడిగా ప్రాజెక్టులు!

పోలవరానికి అత్యధికంగా 6,705 కోట్లు

మిగతా పథకాలకు 11,314 కోట్లు

వీటిలో హంద్రీ-నీవాకు రూ.3,243 కోట్లు

జల వనరులకు మొత్తంగా 18,019 కోట్లు



బడుగులకు గృహవరం

ఇళ్ల నిర్మాణానికి కూటమి సర్కారు అదనపు సాయం

ఎస్సీలు, బీసీలకు రూ.50 వేలు.. ఎస్టీలకు 75 వేలు

రూ.1.50 లక్షల రాయితీకి ఇది అదనం

13,600 కోట్ల విద్యుత్ సబ్సిడీ భరిస్తాం: సర్కారు

నెలాఖరులోగా పదవుల భర్తీ

ఆలయ కమిటీలు, ఏఎంసీల్లో నియామకాలు: చంద్రబాబు

పక్కన తిరిగేవారిని కాదు.. పనిచేసేవారిని సిఫారసు చేయండి

కేడర్‌తో అంతరం పెరుగుతోంది

కార్యకర్తలను కాపాడుకోవాలి

ఐదేళ్లు ఎన్ని హింసలు పెట్టినా, ప్రాణాలు తీసినా పార్టీతోనే ఉన్నారు

మహానాడుకల్లా పార్టీ కమిటీలు

సమస్యలుంటే అంతర్గతంగానే చర్చించాలి.. వీధినపడకూడదు

బడ్జెట్‌ను జనంలోకి తీసుకెళ్లాలి

వివేకా హత్య రాజకీయాలకు కేస్ స్టడీ

క్రిమినల్స్‌తో అప్రమత్తంగా ఉండాలి

ఇక ఎమ్మెల్యేలతో ముఖాముఖి: సీఎం



టీడీపీ శాసన సభా పక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, హాజరైన ప్రజా ప్రతినిధులు

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవులను మార్చి నెలాఖరులోగా భర్తీచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పార్టీ కమిటీల ఏర్పాటు ప్రక్రియ మే నెలలో జరిగే మహానాడు నాటికి పూర్తవుతుందన్నారు. నామినేటెడ్ పదవులకు తమ పక్కన తిరిగే వారిని కాకుండా పార్టీ కోసం కష్టపడే వారిని ఎంపిక చేయాలని శాసనసభ్యులకు సూచించారు. శుక్రవారం అసెంబ్లీ కమిటీ హాలులో టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల సమావేశం రెండు గంటలపాటు జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఆలయ కమిటీ చైర్మన్లు, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల (ఏఎంసీలు) పదవులను మార్చిలోగానే భర్తీ చేస్తామన్నారు. సమర్థులకే సహకార

మిగతా 10వ పేజీలో...



ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో క్షతగాత్రులను తరలిస్తున్న సైనిక సిబ్బంది

మంచులో 22 ప్రాణాలు!

ఉత్తరాఖండ్‌లో బీఆర్వో కార్మిక శిబిరంపై మంచు చరియలు

55 మంది కార్మికులు చిక్కుకోగా 33 మందిని రక్షించిన సైన్యం

మిగిలిన వారి కోసం కొనసాగుతున్న సహాయక చర్యలు

డెహ్రాడూన్, ఫిబ్రవరి 28: ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్ సమీపంలో ఘోర ప్రమాదం సంభవించింది. సరిహద్దు రహదారుల సంస్థ(బీఆర్‌వో)కు చెందిన ఓ కార్మిక శిబిరంపై శుక్రవారం ఉదయం ఏడున్నర గంటల సమయంలో మంచు చరియలు విరిగిపడ్డాయి. అప్పుడు ఆ శిబిరంలో ఉన్న 55 మంది కార్మికులు మంచులో చిక్కుకుపోయారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టిన భారత సైన్యం, బీఆర్‌వో బృందాలు కడపటి వార్తలందేసరికి 33 మందిని సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు. వీరిలో నలుగురి

మిగతా 2వ పేజీలో...

సొరంగంలో 5చోట్ల మెత్తని భాగాలు!

ఎస్ఎల్‌బీసీ ప్రమాద స్థలి వద్ద నయా టెక్నాలజీతో గుర్తింపు

అవి మృతదేహాలు కావొచ్చు, కాకపోవచ్చు

ఆ ప్రాంతాల్లో బురదమట్టిని తవ్వుతున్న మైనర్లు 2



వెలిగొండపై జగన్నాటకం!

ప్రాజెక్టు పూర్తయిందంటూ జాతికి అంకితం చేసిన ఘనుడు

ఇప్పుడు బడ్జెట్‌లో తక్కువ నిధులిచ్చారని యాగీ

ఆయన జమానాలో 2023-24లో కేటాయించింది రూ.26 కోట్లే

తాజా బడ్జెట్‌లో రూ.309 కోట్లు 10

ఈపీఎఫ్ వడ్డీ ఈసారీ 8.25 శాతమే

ఉద్యోగంలో చేరిన ఏడాదిలోపే మరణిస్తే కుటుంబానికి కనీస బీమా రూ.50 వేలు

ఉద్యోగం మారినప్పుడు 2 నెలల విరామం వచ్చినా పూర్తి కాలం సర్వీసుగానే..

కేంద్ర ట్రస్టీల బోర్డు నిర్ణయాలు 2

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ 14

అది సజ్జల స్క్రిప్ట్!

దాని ప్రకారమే నేను మాట్లాడాను.. భార్గవ్‌రెడ్డి దానిని వైరల్ చేశారు

పోలీసుల ముందు పోసాని అంగీకారం.. అన్నీ తెలిసే విద్వేషపూరిత వ్యాఖ్యలు

ఆయనపై మొత్తం 15 కేసులున్నాయి.. రిమాండ్ రిపోర్టులో పోలీసుల వెల్లడి

2 వారాలు కస్టడీ విధించిన కోర్టు.. రాజంపేట సబ్‌జైలుకు పోసాని తరలింపు

పోలీసులతో 'లవ్ యూ రాజా...' జడ్జిని 'అన్నా' అంటూ చిత్రాలు



పోసాని కృష్ణమురళిని అన్నమయ్య జిల్లా రాజంపేట సబ్‌జైలుకు తరలిస్తున్న పోలీసులు

14

వాతావరణ పరిశోధన కేంద్రం

దక్షిణ భారత డీడీజీఎంగా అముద

» కేంద్రానికి నేతృత్వం వహించనున్న తొలి మహిళ



చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిశోధన కేంద్రం దక్షిణభారత డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మేనేజర్ (డీడీజీఎం)గా డాక్టర్ బి.అముద నియమితులయ్యారు. ప్రస్తుతం డీడీజీఎంగా ఉన్న బాలచంద్రన్ శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. దీంతో శనివారం డాక్టర్ అముద ఉద్యోగ బాధ్యతలు స్వీకరించనున్నారు. 18వ శతాబ్దం చివరిలో చెన్నైలో దక్షిణభారత వాతావరణ పరిశోధనా కేంద్రం ఏర్పాటు కాగా, ఈ కేంద్రానికి నేతృత్వం వహించనున్న తొలి మహిళ డాక్టర్ అముద కావడం విశేషం. అంతేగాక ఆమె తమిళనాట స్థిరపడిన తెలుగు కుటుంబీకురాలు కావడం మరో విశేషం. హైదరాబాద్, బెంగళూరు, తిరువనంతపురం, అమరావతి పరిధిలో ఉన్న వాతావరణ కేంద్రాలన్నీ ఈ మండలం కిందకే వస్తాయి. డాక్టర్ అముద ఈశాన్య రుతుపవన ప్రభావిత వర్షాలపై విస్తృత పరిశోధనలు చేపట్టి డాక్టరేట్ పొందారు. 3 దశాబ్దాలుగా ఆమె వాతావరణశాఖలో సేవలందిస్తున్నారు.

సీబీఎస్ఈ పదో తరగతిలో ఇంగ్లీష్, హిందీ తప్పనిసరా?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: ఇక నుంచి ఏటా రెండు సార్లు పదో తరగతి పరీక్షలు నిర్వహించే విషయమై సీబీఎస్ఈ విడుదల చేసిన ముసాయిదా విధానంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీని ప్రకారం ప్రథమ భాషగా ఇంగ్లిష్, ద్వితీయ భాషగా హిందీ, ఐచ్ఛికభాషలుగా ప్రాంతీయ, విదేశీ భాషలు ఉండనున్నాయి. దీన్ని చూస్తుంటే ఇంగ్లిష్, హిందీ తప్పనిసరి భాషలుగా చదవాల్సి ఉంటుందన్న అనుమానాలు కలుగుతున్నాయని పలువురు అంటున్నారు. ఇంగ్లిష్, హిందీ పరీక్షలకు నిర్దీత తేదీలను కూడా ప్రకటించారు. మిగిలిన అన్ని భాషలకు ఒక్క రోజే పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. దీని ప్రకారం హిందీ తప్పనిసరి అన్న అభిప్రాయం కలుగుతోంది. ప్రాంతీయ భాషల జాబితాలో పంజాబీ లేకపోవడాన్ని అక్కడి ప్రభుత్వం ఎత్తిచూపింది. ఈ సందర్భంగానే ఇంగ్లిష్, హిందీ తప్పనిసరి సబ్జెక్టులా అన్న చర్చ తలెత్తింది. దీనిపై సీబీఎస్ఈ వివరణ ఇస్తూ ఇది ఖరారు చేసిన జాబితా ఏమీ కాదని తెలిపింది. తుది జాబితాలో అన్ని భాషలకు చోటు ఉంటుందని పేర్కొంది. ఇంగ్లిష్‌ను ప్రథమ భాషగా, హిందీని ద్వితీయ భాషగా ఎందుకు పేర్కొన్నారనేదానిపై ఎలాంటి వివరణ ఇవ్వలేదు. ఈ ముసాయిదాపై మార్చి 9లోగా అభిప్రాయాలు చెప్పే అవకాశం ఉండడంతో మరికొన్ని రకాల సందేహాలు కూడా బోర్డు దృష్టికి వెళ్లే అవకాశం ఉంది.

రాష్ట్ర హక్కుల రక్షణ కోసం పోరాడదాం: స్టాలిన్

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం కేంద్రంపై పోరాటం సాగించాల్సిన సమయం ఆసన్నమైందని తమిళనాడు సీఎం స్టాలిన్ పిలుపునిచ్చారు. జాతీయ విద్యావిధానం పేరుతో నిర్బంధ హిందీ అమలు, నియోజకవర్గాల పునర్విభజన పేరిట లోక్‌సభ స్థానాలు తగ్గించేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందన్నారు. శనివారం తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పార్టీ కార్యకర్తలకు స్టాలిన్ బహిరంగ లేఖ రాశారు. పుట్టినరోజు వేడుకలను నిరాడంబరంగా జరుపుకోవటం తనకు అలవాటు అని.., అయితే ఈసారి హిందీ వ్యతిరేకోద్యమం దిశగా ప్రేరేపించాల్సిన అవసరమున్నందున పార్టీ శ్రేణులందరిని కలుసుకోవాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. అప్రమత్తంగా వ్యవహరించకపోతే రాష్ట్రంలో హిందీ రాజ్యమేలి తమిళభాష పత్తాలేకుండా పోతుందని స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు, త్రిభాషా విద్యావిధానం అత్యంత అవసరమని తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి అన్నారు.

కర్ణాటకలో బర్డ్ ఫ్లూ.. రాష్ట్రమంతా హై అలర్ట్

బెంగళూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకినట్టు నిర్ధారణ కావడంతో రాష్ట్రమంతటా హై అలర్ట్ ప్రకటించారు. బెంగళూరు నగరానికి సమీపంలో ఉండే చిక్కబళ్లాపుర తాలూకాలో ఇంతవరకు 36 కోళ్లు మృతి చెందాయి. బళ్లారి జిల్లా సండూరు, రాయచూరు జిల్లా మాన్వి తాలూకా పరిధిలో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకి మృత్యువాత పడుతున్నాయి. బెంగళూరులో శుక్రవారం వైద్యశాఖ అధికారుల ప్రత్యేక సమావేశం జరిగింది. రాష్ట్రమంతటా అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు సూచించారు. మనుషులకి ఎక్కడా బర్డ్ ఫ్లూ సోకిన దాఖలాలు లేవని అధికారులు స్పష్టం చేశారు.

నీ ఆట ముగిసింది!



విలేకరుల సమావేశంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాగ్వాదం. పక్కన ఉపాధ్యక్షుడు వాన్స్

» కోట్లాది ప్రాణాలతో చెలగాటమాడుతున్నావ్

» మూడో ప్రపంచ యుద్ధం వస్తే నీ వల్లే!

» జెలెన్‌స్కీపై భగ్గుమన్న ట్రంప్, వాన్స్

» శ్వేతసౌధంలో విలేకర్ల ముందు వాగ్వాదం

వాషింగ్టన్, ఫిబ్రవరి 28: అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మధ్య శ్వేతసౌధంలో తీవ్ర వాగ్యుద్ధం జరిగింది. శుక్రవారం ఇరువురు నేతలు ఓవల్ ఆఫీసులో 45 నిమిషాల పాటు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతల మధ్య మాటల యుద్ధం జరిగింది. ఒకదశలో జెలెన్‌స్కీపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీరు కోట్లాది మంది ప్రజల ప్రాణాలతో జూదం ఆడుతున్నారు' అంటూ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. అమెరికాను అగౌరవపరిచారని మండిపడ్డారు. అమెరికా శాంతి నిబంధనలకు అంగీకరించాలని ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వ్యాఖ్యలకు జెలెన్‌స్కీ సమాధానం ఇచ్చిన తర్వాత నేతల మధ్య గొడవ మొదలైంది. జెలెన్‌స్కీ సమాధానం ఇవ్వబోగా.. 'మీకు మాట్లాడడానికి అనుమతి లేదు' అని ట్రంప్ అన్నారు. దానికి యుద్ధం ప్రారంభమైనప్పుడు తాము ఒంటరిగానే ఉన్నామని జెలెన్‌స్కీ బదులిచ్చారు.

ఇద్దరు నేతల మధ్య సంభాషణ ఇలా..

ట్రంప్: మీ దగ్గర మా సైనిక సంపత్తి లేకపోతే ఈ యుద్ధం రెండు వారాల్లోనే ముగిసేది.

జెలెన్‌స్కీ: రష్యా అధ్యక్షుడు మూడు రోజుల్లోనే ముగిసేదన్నారు. ఇప్పుడు అది రెండు వారాలైంది.

ట్రంప్: మీ దేశం భారీ కష్టాల్లో ఉంది. ఈ యుద్ధం మీరు గెలవబోవడం లేదు. ఇప్పటికైనా బయటపడే అవకాశాలు ఉన్నాయంటే అది మా వల్లే.

వాన్స్: మీ దేశ వినాశనాన్ని అడ్డుకోవాలని మా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అమెరికా ఓవల్ ఆఫీసుకు వచ్చి మా ప్రభుత్వం మీద దాడి చేయడం గౌరవప్రదంగా ఉందని భావిస్తున్నావా? మేం చేస్తున్న ప్రయత్నాలకు కచ్చితంగా ధన్యవాదాలు తెలియజేయాలి.

జెలెన్‌స్కీ: నేను అమెరికా ప్రజలకు ధన్యవాదాలు చెప్పాను.

ట్రంప్: మీ దగ్గర ఆట కొనసాగించడానికి పేకల్లేవు. మా వల్లే ఇన్నాళ్లు ఆడగలిగావు. మీరు కోట్లాది మంది ప్రజల ప్రాణాలతో జూదం ఆడుతున్నారు. మూడో ప్రపంచ యుద్ధంతో జూదం ఆడుతున్నారు.

జెలెన్‌స్కీ: నేనే కార్డులూ ఆడడం లేదు.

ట్రంప్: మీరు అమెరికాను అగౌరవపరుస్తున్నారు. మీరు మాతో ఆడుకోలేరు. ఇప్పటికే చాలా మట్లాడారు. ఇక ఆపండి. ఇలా ఇరువురు నేతల మధ్య తీవ్ర వాగ్వాదంతో ప్రెస్‌మీట్ ముగిసింది. ఓవల్ ఆఫీసులో అమెరికా అధ్యక్షుడు, మరో దేశాధ్యక్షుడితో జరిగిన అతిపెద్ద వాగ్వాదం ఇదే కావడం విశేషం.

తొలుత సాదర ఆహ్వానం..


తొలుత శ్వేతసౌధంలో జెలెన్‌స్కీకి ఎదురెళ్లి మరీ ట్రంప్ ఆహ్వానం పలికారు. ఇద్దరూ కరచాలనం చేసుకొని లోనికి వెళ్లారు. రష్యాతో శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలంటే ఉక్రెయిన్ చాలా విషయాల్లో రాజీ పడాల్సి ఉంటుందని ట్రంప్ చెప్పారు. అనంతరం ఉక్రెయిన్‌లోని అరుదైన ఖనిజాలకు సంబంధించి ఇరు దేశాల మధ్య ఒప్పందం జరుగుతుందని ప్రకటించారు. ఇది ఇరుదేశాల ఆర్థిక వ్యవస్థలకు మేలు చేకూర్చుతుందన్నారు. ఇది అమెరికా చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. అయితే పుతిన్ ఓ హంతకుడని, ఆయనతో రాజీ పడే ప్రసక్తే లేదని జెలెన్‌స్కీ చెప్పారు. 'మా భూమి కోసం హంతకుడితో ఎలాంటి రాజీ పడబోం' అని జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. అధ్యక్షుడు ట్రంప్ తమవైపే ఉన్నారని విశ్వాసం వ్యక్తం చేశారు. ట్రంప్ స్పందిస్తూ.. తాను శాంతిదూతగా గుర్తిండిపోవాలని ఆశిస్తున్నానన్నారు. కాగా, ఓవల్ ఆఫీసులో తీవ్ర వాగ్వాదం అనంతరం జెలెన్‌స్కీ అరుదైన ఖనిజాల ఒప్పందంపై సంతకం చేయకుండానే వెళ్లిపోయారు.

జెలెన్‌స్కీని నియంత అన్నానా?

ఆయనంటే నాకు అత్యంత గౌరవం: ట్రంప్

వాషింగ్టన్, ఫిబ్రవరి 28: ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీని నెల రోజుల క్రితం ఎక్స్ పోస్టులో నియంతగా అభివర్ణించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజాగా మాట మార్చారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన్ను ఇదే అంశంపై ప్రశ్నించగా, "నేనలా అన్నానా? అలా అన్నానంటే నమ్మలేక పోతున్నా" అన్నారు. కొద్ది గంటల్లో జెలెన్‌స్కీతో సమావేశమవుతున్న తరుణంలో ట్రంప్ గొంతు మారిపోయింది. గతంలో ఆయనపై తాను చేసిన వ్యాఖ్య అంతగా పట్టించుకోవాల్సిన అంశం కాదని అభిప్రాయపడ్డారు. గురువారం బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ శ్వేతసౌధంలో ట్రంప్‌తో సమావేశమయ్యారు. అనంతరం ఇద్దరూ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగానే ట్రంప్ జెలెన్‌స్కీ గురించి పొడుగుతూ మాట్లాడారు. అతనంటే తనకు అత్యంత గౌరవమని అన్నారు. తాము ఆయుధాలు ఇచ్చి అండగా నిలిచినా జెలెన్‌స్కీ ధైర్యంగా నిలబడి రష్యా మీద పోరాడటం గొప్ప విషయమన్నారు.

లోకం తీరు



భార్య వేధింపులతో

మరో టెకీ ఆత్మహత్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: బెంగళూరులో అతుల్ సుభాష్ ఆత్మహత్య ఘటన మరవక ముందే.. భార్య వేధింపులతో ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో మరో టెకీ బలవన్మరణానికి పాల్పడ్డాడు. 'దయచేసి.. మగవాళ్ల గురించి కూడా ఆలోచించండి..' అంటూ ఆత్మహత్యకు ముందు అతడు తీసుకున్న సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. యూపీకి చెందిన 25 ఏళ్ల మానవ్ శర్మ ముంబైలోని టీసీఎస్‌లో మేనేజర్. ఏడాది క్రితం అతడికి వివాహమవ్వగా.. ఈనెల 24న తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య నికితా శర్మ తీవ్ర వేధింపుల కారణంగానే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు దాదాపు 7 నిమిషాల చివరి సెల్ఫీ వీడియోలో.. 'నా భార్య వేరొకరితో సంబంధం పెట్టుకొని నాపైనే కేసులు పెడతానంటూ హింసిస్తోంది. నన్నెప్పుడు ఓ మనిషిలా కూడా చూడలేదు.. దయచేసి మగవాళ్ల గురించి ఎవరైనా మాట్లాడండి' అని పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలోనే మానవ్ భార్య నికితా శర్మ స్పందించారు. 'మానవ్ మద్యానికి బానిసయ్యాడు. పలుమార్లు ఆత్మహత్యకు యత్నించాడు. 3సార్లు నేనే కాపాడాను' అని చెప్పారు.

మేలో స్కైప్ మూసివేత: మైక్రోసాఫ్ట్

వాషింగ్టన్, ఫిబ్రవరి 28: ప్రపంచానికి వీడియో కాన్ఫరెన్సింగ్ అనే సదుపాయాన్ని పరిచయం చేసిన తొలినాటి ప్లాట్‌ఫామ్‌లలో ఒకటైన 'స్కైప్' త్వరలో మూతబడనుంది. ఈ విషయాన్ని స్కైప్ యాజమాన్య సంస్థ మైక్రోసాఫ్ట్ తన అంతర్గత వేదిక అయిన ఎక్స్‌డీఏలో వెల్లడించింది. మే నెల నుంచి స్కైప్ అందుబాటులో ఉండదని తెలిపింది. స్కైప్ యూజర్లు.. టీమ్స్‌కు (ఇది కూడా మైక్రోసాఫ్ట్‌కు చెందినదే) బదిలీ కావచ్చని, ఇప్పటికే పలువురు టీమ్స్‌ను ఉపయోగించుకుంటున్నారని పేర్కొంది. 2003లో స్కైప్ ఆవిర్భవించింది. 2011లో ఆ ప్లాట్‌ఫాంను మైక్రోసాఫ్ట్ కొనుగోలు చేసింది.

అమెరికా వాతావరణ విభాగాల్లో వందలాది ఉద్యోగుల తొలగింపు

» నేషనల్ వెదర్ సర్వీస్‌లో 375 మంది

» ఎన్‌వోఏఏలో ఐదు వందల మంది

» ఫెడరల్ ఉద్యోగుల తొలగింపుపై ట్రంప్ ఆదేశాలు చట్ట విరుద్ధమన్న ఫెడరల్ జడ్జి

వాషింగ్టన్, ఫిబ్రవరి 28: అమెరికా వాతావరణ విభాగాల్లోని వందలాది మంది ఉద్యోగులను విధుల నుంచి తొలగించారు. ఫెడరల్ విభాగాల్లో ఉద్యోగుల సంఖ్యను తగ్గించి ఖర్చులను ఆదా చేయాలన్న డోజ్ విభాగం సూచనల మేరకు ఈ చర్యకు పూనుకొన్నారు. దీంతో పాటు, నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్(ఎన్‌వోఏఏ) విభాగంలోనూ వందలాది మందిని తొలగించారు. అయితే, వాతావరణ అంచనాల విభాగంలో(ఎన్‌డబ్ల్యూఎస్) తొలగించిన ఉద్యోగులంతా(375 మంది) ప్రొబేషనరీ ఉద్యోగులు. ఇక, ఎన్‌వోఏఏలో దాదాపు ఐదు వందల మందిని తొలగించారు. ఈ విభాగంలో మళ్లీ తొలగింపులు ఉంటాయని, తర్వాతి రౌండ్‌లో 800మంది ఉద్యోగులను తొలగించే అవకాశం ఉందని ఓ అధికారి తెలిపారు. ఇదిలా ఉండగా, అమెరికాలోని సామాజిక భద్రతా(సోషల్ సెక్యూరిటీ) విభాగంలో పనిచేస్తున్న 7వేల మందిని సెలవులపై పంపేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ విభాగంలో 60వేల మంది పనిచేస్తున్నారు. ఇందులో దాదాపు 50% సిబ్బందిని తొలగించే అవకాశం ఉందని అందులో పనిచేసే ఓ అధికారి చెప్పారు. డోజ్ సూచనలతో ఇప్పటికే పలు ఫెడరల్ విభాగాల్లో వేలాది మంది ఉద్యోగులను తొలగించారు.

ట్రంప్ ఆదేశాల నిలిపివేత

పలు విభాగాల్లో ఫెడరల్ ఉద్యోగులను తొలగిస్తూ ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని శాన్‌ఫ్రాన్సిస్కో డిస్ట్రిక్ట్ జడ్జి(ఫెడరల్) అల్సప్ అడ్డుకున్నారు. ట్రంప్ నిర్ణయాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అన్ని ఫెడరల్ విభాగాల్లోని ఉద్యోగులను తొలగించే అధికారం పర్సనల్ మేనేజ్‌మెంట్ కార్యాలయానికి లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇతర విభాగాల్లోని ప్రొబేషనరీ ఉద్యోగులను సైతం అది తొలగించలేదన్నారు.

ఈపీఎఫ్ వడ్డీ 8.25 శాతమే

ఉద్యోగంలో చేరిన ఏడాదిలోపే మరణిస్తే ఉద్యోగి కుటుంబానికి కనీస బీమా రూ.50వేలు

» సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సమావేశంలో నిర్ణయాలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) నిల్వలపై 2024-25 ఆర్థిక సంవత్సరానికి 8.25శాతం వడ్డీ రేటునే కొనసాగించాలని ఈపీఎఫ్ బోర్డు ఆఫ్ ట్రస్టీస్(సీబీటీ) సమావేశం నిర్ణయించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే వడ్డీ రేటు అమలైంది. ఈ ఏడాదీ ఇదే రేటును కొనసాగించాలన్న సీబీటీ నిర్ణయాన్ని కేంద్ర ఆర్థిక శాఖకు పంపనున్నారు. ప్రభుత్వ ఆమోదం తర్వాత వడ్డీ రేటును ఈపీఎఫ్‌వో నోటిఫై చేయనుంది. కేంద్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో వడ్డీరేటు ఖరారుతోపాటు పలు కీలక అంశాలకు బోర్డు ఆమోదం తెలిపింది. ఉద్యోగుల డిపాజిట్లకు అనుబంధంగా ఉన్న బీమా(ఈడీఎల్ఐ) పథకం కింద అందుతున్న ప్రయోజనాలను పెంచాలని సమావేశంలో నిర్ణయించారు. ఉద్యోగంలో చేరిన ఏడాదిలోపు ఈపీఎఫ్ సభ్యులు మరణిస్తే.. వారి కుటుంబాలకు కనీస జీవిత బీమా ప్రయోజనం కింద రూ.50వేలు అందించాలన్న ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ లభించింది. అలాగే, చివరిగా చందా చెల్లించిన ఆరు నెలల్లోగా సభ్యుడు మరణిస్తే.. ఈడీఎల్ఐ ప్రయోజనాలను అమలు చేయాలని సమావేశం నిర్ణయించింది. కాగా, ఉద్యోగం మానేసి మరో ఉద్యోగంలో చేరినప్పుడు ఈపీఎఫ్ సర్వీసుకు ఒక్క రోజు విఘాతం ఉన్నా.. ప్రస్తుతం ఈడీఐఎల్ ప్రయోనాలు అందించడం లేదు. ఇకపై.. రెండు నెలల వ్యవధి వచ్చినా వారు నిరంతరం సర్వీసులో ఉన్నట్టే పరిగణించనున్నారు. అలాంటి ఉద్యోగులు మరణిస్తే.. ఆయా కుటుంబాలకు కనీస బీమా కింద రూ.2.5లక్షలు అందించాలని నిర్ణయించారు. ఈ నిర్ణయాల మూలంగా ఏటా 20 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని ఈపీఎఫ్‌వో వర్గాలు తెలిపాయి. కాగా, తాము వడ్డీరేటును 8.30 శాతానికి పెంచాలని కోరగా, 8.25 శాతానికే సీబీటీ అంగీకరించిందని ట్రేడ్ యూనియన్ కో ఆర్డినేషన్ కమిటీ తెలిపింది. ఉద్యోగంలో చేరిన ఏడాదిలోపు మరణించిన వారికీ.. ఈడీఎల్ఐ పథకాన్ని వర్తింపజేయడం చరిత్రాత్మకమని ప్రశంసించింది. ఈపీఎఫ్ చందా కట్టడం మానేసిన తర్వాత ఆరు నెలల్లోపు మరణిస్తే ప్రయోజనాలు చేకూర్చాలని నిర్ణయించడం, రెండు నెలల్లోపు కొత్త ఉద్యోగంలో చేరితే పూర్తికాలం ఉద్యోగంలో ఉన్నట్టే భావించి ప్రయోజనాలు సమకూర్చడం చెప్పుకోదగ్గ నిర్ణయాలని పీయూసీసీ ప్రధాన కార్యదర్శి తివారీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బంగ్లా విముక్తి పోరాటంలో

భారత్ పాత్రను తగ్గించేశారు!

» బంగ్లాదేశ్ పాఠ్యపుస్తకాల్లో సమూల మార్పులు

ఢాకా, ఫిబ్రవరి 28: బంగ్లాదేశ్ విముక్తి పోరాటంలో భారతదేశ పాత్రను తగ్గిస్తూ ఆ దేశం మధ్యంతర ప్రభుత్వం పాఠ్యపుస్తకాల్లో మార్పులు చేసింది. పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్‌కు విముక్తి కల్పించడంలో కీలక పాత్ర పోషించిన ముజీబుర్ రెహ్మాన్, ఆయన కుమార్తె, మాజీ ప్రధాని షేక్ హసీనాల భాగస్వామ్యాన్ని కూడా పూర్తిగా తగ్గించి చూపేలా పుస్తకాలను మార్చేసింది. రానున్న విద్యా సంవత్సరం కోసం 40 కోట్ల కొత్త పాఠ్యపుస్తకాలను ముద్రించారు. అన్ని పాఠ్య పుస్తకాల నుంచి మాజీ ప్రధాని షేక్ హసీనా పేరును పూర్తిగా తొలగించారు. దీంతో పాటు బంగబంధు షేక్ ముజీబుర్ రెహ్మాన్, భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రాలను కూడా తొలగించడం గమనార్హం. కాగా, బంగ్లాదేశ్‌ను స్వతంత్ర దేశంగా తొలుత భారత్ 1971, డిసెంబరు 6న గుర్తించినట్లుగా గతంలో పేర్కొన్నారు. తాజాగా, తొలుత భూటాన్ (1971, డిసెంబరు 3న) బంగ్లాను స్వతంత్ర దేశంగా గుర్తించినట్లు మార్పులు చేయనున్నారు.

కేరళ కాంగ్రెస్ నేతల భేటీకి థరూర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కేరళలో కాంగ్రెస్ నేతలంతా కలిసికట్టుగా పనిచేసి వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయానికి తోడ్పడాలని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. శుక్రవారం ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎంపీలతో పాటు కేరళ సీనియర్ నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి శశిథరూర్ కూడా హాజరయ్యారు. థరూర్ కాంగ్రెస్‌ను వీడుతారన్న ఊహాగానాల నేపథ్యంలో ఇది ప్రాధాన్యం సంతరించుకొంది. కాగా, పార్టీ విధానాలకు వ్యతిరేకంగా బహిరంగ ప్రకటనలు చేయరాదని ఖర్గే ఈ సందర్భంగా పరోక్షంగా శశిథరూర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

సొరంగంలో ఐదు చోట్ల మెత్తని భాగాలు!

» అవి మృతదేహాలు కావొచ్చు, కాకపోవచ్చు: కలెక్టర్

మహబూబ్‌నగర్/నాగర్‌కర్నూలు/దోమలపెంట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం ప్రమాదంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఆక్వా ఐ సోనార్ టెక్నాలజీ, గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్(జీపీఆర్)తో టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికులను గుర్తించేందుకు అధికారులు ప్రయత్నించారు. ఈ క్రమంలో బురదలో ఐదు చోట్ల 13.500 కిలోమీటర్ల నుంచి 80-100 మీటర్ల పరిధిలో 6 అడుగుల లోతులో కొన్ని మెత్తని భాగాలను ఎన్‌జీఆర్ఐ బృందాలు గుర్తించినట్లు తెలుస్తోంది. ఆ ప్రాంతాలను మార్కింగ్ చేసి, సింగరేణి మైనర్స్‌తో తవ్విస్తున్నారు. ఆ ప్రదేశాల్లో 4 మీటర్ల మేర మట్టి, బురద ఉందని, డీవాటరింగ్ చేస్తున్నా నీటి ఊట వస్తూనే ఉందని సమాచారం. ఆ ఐదు ప్రాంతాల్లో తవ్వుతున్న బృందాలకు దుర్వాసన కూడా వచ్చినట్లు సమాచారం. అవి మృతదేహాలు కావొచ్చు, కాకపోవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ విషయం మీడియాలో వైరల్‌గా మారడంతో నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అది ఫేక్ న్యూస్ అని చెప్పారు. జీపీఆర్ ఆధారంగా ఎన్‌జీఆర్ఐ అధికారులు కొంత సమాచారం ఇచ్చారని, దాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. మీడియాలో, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న విషయాలు వాస్తవం కాదన్నారు. సహాయక చర్యల్లో భాగంగా ప్రస్తుతం బురద తొలగింపు, టీబీఎం కటింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయని, కార్మికుల గుర్తింపును మొదటి ప్రాధాన్యంగా తీసుకొని పనిచేస్తున్నామని, ఎలాంటి ప్రగతి ఉన్నా మీడియాకు తెలియజేస్తామని చెప్పారు. అప్పటివరకు ఫేక్ న్యూస్ ప్రచారం చేయకుండా, సహకరించాలని సూచించారు.



టన్నెల్ బోరింగ్ మిషన్‌ను గ్యాస్ కట్టర్లతో వేరు చేస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

మంచులో 22 ప్రాణాలు!

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితి విషమంగా ఉంది. మరో 22 మంది మంచులోనే ఉండగా వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. భారత్- టిబెట్ సరిహద్దులో చివరి గ్రామం, సముద్రమట్టానికి 3,200 మీటర్ల ఎత్తులో, బద్రీనాథ్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మనా అనే గ్రామంలో ఈ శిబిరం ఉంది. ఈ ప్రాంతంలో కొద్దిరోజులుగా మంచు విపరీతంగా కురుస్తుంది. అయితే, భారత్-టిబెట్ సరిహద్దు మార్గంలో సైనిక కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా ఉండేందుకు.. బీఆర్‌వోకు చెందిన కార్మికులు కొద్ది రోజులుగా అక్కడ పని చేస్తున్నారు. రహదారిపై పేరుకుపోయిన మంచును తొలగిస్తున్నారు. ఈ క్రమంలో వారు బస చేసిన శిబిరంపై మంచు చరియలు విరిగి పడడంతో మంచు కింద ఉండిపోయారు. ఆ శిబిరంలో మూడు కంటెయినర్లు, ఓ షెడ్ ఉన్నాయని ఆర్మీ అధికారులు పేర్కొన్నారు. నిరంతరాయంగా మంచు కురుస్తుండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. కాగా, ఉత్తరాఖండ్‌లోని ఛమోలీ, ఉత్తర్‌కాశీ, రుద్రప్రయాగ్ జిల్లాల్లో 2,400 మీటర్లకు పైగా ఎత్తులో ఉన్న ప్రాంతాల్లో మంచు చరియలు విరిగిపడే అవకాశముందని చండీగఢ్‌లోని డిఫెన్స్ జియో ఇన్ఫర్మేటిక్స్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్(డీజీఆర్ఈ) గురువారం సాయంత్రమే హెచ్చరికలు జారీ చేసింది. 3,500 మీటర్ల ఎత్తులో ఉన్న ప్రాంతాల్లో భారీ వర్షం, మంచు కురిసే అవకాశముందని డెహ్రాడూన్‌లోని వాతావరణ కేంద్రం శుక్రవారం ఉదయం హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినా ఉపయోగం లేకపోయింది.

భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

ఈ ఏడాది చివరి నాటికి పూర్తి

ఈయూ చీఫ్ ఉర్సులా వాన్ డేర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: భారత్‌తో సైనిక, రక్షణ ఒప్పందాలు కుదుర్చుకోవాలని భావిస్తున్నామని యూరోపియన్ యూనియన్(ఈయూ) చీఫ్ ఉర్సులా వాన్ డేర్ లెయెన్ అన్నారు. సైనిక సామర్థ్యాలు పెంచుకునే దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోందని కొనియాడారు. ఈ అంశంలో ఈయూ- భారత్ పరస్పరం చేదోడును అందించుకోగలవని నమ్ముతున్నానని, సైబర్ దాడులు, సీమాంతర ఉగ్రవాదం, సముద్ర భద్రత వంటి అంశాల్లో భారత్‌తో కలిసి పనిచేస్తామని చెప్పారు. శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీతో ఉర్సులా భేటీ అయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... మోదీతో సమావేశం సందర్భంగా 6జీ, ఏఐ, సెమీకండక్టర్లు తదితర అంశాలపై పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ మేరకు ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది చివరి నాటికి భారత్ ఈయూ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జరిగితే ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఒప్పందంగా నిలుస్తుందని అని ఉర్సులా భేటీకి ముందు పేర్కొన్నారు.

మహిళా జడ్జిల సంఖ్య పెరగాలి

అప్పుడే స్త్రీల కేసుల్లో పరిష్కారం సులువవుతుంది : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): న్యాయవ్యవస్థలో మహిళా న్యాయమూర్తుల భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉందని, దీనివల్ల మహిళలకు సంబంధించిన కేసుల్లో పరిష్కారం సులభమవుతుందని సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది. మధ్యప్రదేశ్‌లో పనితీరు సరిగా లేదన్న కారణంతో ఇద్దరు మహిళా న్యాయాధికారులను తొలగించిన కేసుపై విచారణను జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం కొనసాగించింది. తొలగించిన ఆ న్యాయాధికారులను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించింది. ఈ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న కీలక వ్యాఖ్యలు చేశారు. పని తీరుకు లింగబేధానికి సంబంధం లేదని, అయితే మహిళల ప్రత్యేక సమస్యలను అర్థం చేసుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. తొలగింపునకు గురైన ఒక న్యాయాధికారి.. గర్భస్రావంతో ఇబ్బంది పడుతున్నారని, ఫలితంగా తీవ్రమైన శారీరక నొప్పే కాకుండా, మానసిక ఒత్తిడి కూడా ఉంటుందన్నారు. అదే సమయంలో ఆమె సోదరుడు బ్లడ్ క్యాన్సర్‌తో ఉన్నట్టు తేలిందని, అప్పుడే ఆమె కొవిడ్ బారిన పడ్డారని, ఇలా.. ఏకకాలంలో ఒక మహిళ ఎంతో వేదనకు గురయ్యారని, ఇవన్నీ పరిగణలోకి తీసుకోకుండా ఆమెను విధుల్లో నుంచి తొలగించడం సరి కాదన్నారు.

FORM IV

(Rule 8)

UNDER THE PRESS AND REGISTRATION OF BOOKS ACT, 1867 STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS ABOUT NEWSPAPER ANDHRA JYOTHI

1. Place of Publication	:	Hyderabad, Vijayawada, Visakhapatnam, Tirupathi, Karimnagar, Ananthapur, Tadepalligudem, Warangal, Guntur, Kurnool, Nellore, Srikakulam, Rajamahendravaram, Khammam, Kadapa, Ongole, Nalgonda, Nizamabad, Mahaboobnagar.
2. Periodicity of its Publication	:	DAILY
3. Printer's name	:	KOGANTI VENKATA SESHAGIRI RAO
1 (a) Whether a citizen of india	:	YES
(b) If a foreigner, The country of origin:		-
Address	:	Door No.: 8-2-293/82/J/68-B, Journalist Colony, Jubilee Hills, Hyderabad - 500 033, Telangana.
4. Publisher's Name	:	KOGANTI VENKATA SESHAGIRI RAO
1 (a) Whether a citizen of India	:	YES
(b) If a foreigner, The country of origin	:	-
Address	:	Door No.: 8-2-293/82/J/68-B,, Journalist Colony, Jubilee Hills, Hyderabad - 500 033, Telangana.
5. Editor's Name	:	N.RAHUL KUMAR
Nationality	:	INDIAN
1 (a) Whether a citizen of India	:	YES
(b) If a foreigner, the country of origin:		-
Address	:	Plot.no.540,2-105/111/540, Third Phase, Journalists Colony, AVN School, Gopanpally, Gachibowli, K.V.Rangareddy, Hyderabad - 500032, Telangana.
6. Name's and Addresses of individuals Who own the Newspaper and partners of Shareholding more than one percent of the total capital	:	
(a) Aamoda Publications Pvt. Ltd		Plot No.76, Road No.70, Ashwini Enclave, Huda Heights, Jubilee Hills, Hyderabad - 500 033.
(b) V.Radhakrishna		8-3-293/82/J III/211-1, Road No 76, Phase-III, Jubilee Hills Hyderabad - 500 033
(c) M.Prabhakara Rao		H.No. 8-2-293/82/A, Plot No.543, Road No.26, Jubilee Hills, Hyderabad - 500 033.
(d) D.Jai Ramesh		Plot No.173, Road No.13, Jubilee Hills, Hyderabad - 500 033.
(e) V.Aditya		8-3-293/82/J III/211-1, Road No.76, Phase-III, Jubilee Hills, Hyderabad - 500 033.
(f) Ch.Shruthi Keerthi		8-3-293/82/J III/211-1, Road No.76, Phase-III, Jubilee Hills, Hyderabad - 500 033.
(g) M/s Active Power Corporation Pvt Ltd		Plot No.76, Road No.70, Ashwini Enclave, Huda Heights, Jubilee Hills, Hyderabad - 500 033.
(h) Vemuri Anusha		8-3-293/82/J III/211-1, Road No.76, Phase-III, Jubilee Hills, Hyderabad - 500 033.

I, KOGANTI VENKATA SESHAGIRI RAO, here by declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
KOGANTI VENKATA SESHAGIRI RAO
Publisher

Date: 28.02.2025




శోభాయమానంగా మహానందీశ్వరుడి రథోత్సవం

మహానంది, ఫిబ్రవరి 28(ఆంధ్ర జ్యోతి): కర్నూలు జిల్లా మహానందిలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం మహానందీశ్వరస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. రథోత్సవానికి ముందు మహానందీశ్వర స్వామి, కామేశ్వరి అమ్మ వారి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.



శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం తెల్లవారు జామున నిర్వహించే ఆది దంపతుల కల్యాణానికి టీటీడీ తరపున ఈవో శ్యామలరావు శుక్రవారం పట్టువస్త్రాలు అందజేశారు.

- ఆంధ్రజ్యోతి, శ్రీకాళహస్తి





వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో జాతీయ సైన్స్ దినోత్సవంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎం.జగదీశ్

వీఐటీ-ఏపీలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. "వికసిత్ భారత్-2047 కోసం సైన్స్, ఆవిష్కరణల్లో ప్రపంచ నాయకత్వం కోసం భారత యువతకు సాధికారత" అనే ఇతివృత్తంతో నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా అమరరాజా అడ్వాన్స్ సెల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఎం.జగదీశ్ హాజరయ్యారు. దేశీయ బ్యాటరీ పరిశ్రమకు మెకానికల్, కెమికల్, ఎలక్ట్రికల్-ఎలక్ట్రానిక్స్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ ప్రధాన రంగాల్లో నిపుణులు చాలా అవసరమని ఆయన తెలిపారు. వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయ ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ చొరవతో అమరరాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సహా ప్రసిద్ధ బ్యాంకులతో ఏడు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామని విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఎస్.వి.కోటారెడ్డి తెలిపారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పునర్విభజన లొల్లి

దక్షిణాది మెడమీద పునర్విభజన కత్తివేలాడుతున్నదంటూ హెచ్చరిక చేసి తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ పెద్ద వివాదమే రేపారు. జనాభా నియంత్రణలో ఘన విజయాలు సాధించిన దక్షిణాది రాష్ట్రాలు ప్రతిఫలంగా పెద్దఎత్తున లోక్‌సభ సీట్లను కోల్పోబోతున్నాయని హెచ్చరించారాయన. కోయంబత్తూరులో మహాశివరాత్రినాడు ఒక ఆధ్యాత్మిక వేడుకలో పాల్గొనడానికి వచ్చిన హోంమంత్రి అమిత్ షా, ఏమిటీ అసత్యప్రచారాలంటూ స్టాలిన్ మీద విరుచుకుపడ్డారు. ప్రధాని మోదీ ఎప్పుడో ఇచ్చిన వాగ్దానం మేరకు దక్షిణ భారత రాష్ట్రాలకు ప్రోరేటా విధానంలో ఒక్క పార్లమెంట్ స్థానం కూడా తగ్గదని, దక్షిణాదికి అన్యాయం జరగబోదని అమిత్ జీ హామీ ఇచ్చారు. మార్చి ఐదున స్టాలిన్ ఓ విస్తృతస్థాయి సమావేశానికి సంకల్పిస్తున్న నేపథ్యంలో, అమిత్ షా తనకు తానుగా ఈ అంశాన్ని ప్రస్తావించి, హామీ ఇవ్వడం మంచిదే. అయితే, దక్షిణాదికి ఎందుకు అన్యాయం జరగదో, జరగకుండా తాము చేయబోతున్నదేమిటో ఆయన కాస్తంత వివరణగా చెప్పివుంటే, హామీ అనంతరం కూడా వెల్లువెత్తుతున్న అనుమానాలకు ఆస్కారమే ఉండేది కాదు.

దేశ భవిష్యత్తుకోసం జనాభా తగ్గించుకోండని ఐదుదశాబ్దాల క్రితం కేంద్రం చెబితే, చిన్న కుటుంబం చింతలు లేనిదనీ, మేమిద్దరం మాకిద్దరనీ, బడిలో ఒకరు ఒడిలో ఒకరనీ విభిన్నరీతుల్లో విస్తృతప్రచారం చేసి, భయపెట్టీ బతిమాలీ మొత్తానికి జనాభా నియంత్రణలో దక్షిణభారతం మంచివిజయాలు సాధించింది. వృద్ధిలో, విద్యలో ఉత్తరాది కన్నా ఓ మెట్టుపైనే ఉన్నందువల్ల ప్రభుత్వాల కృషి, పడుతున్న తాపత్రయం ప్రజలకు కూడా అర్థమైంది. ఎక్కువమందిని కంటే పోషించలేమనీ, రత్నాల్లాంటి బిడ్డలు ఒకరిద్దరు ఉంటే వారిని వృద్ధిలోకి తేవచ్చునని తమకు తాముగా సామాన్యజనం కూడా తెలుసుకున్నారు. చివరకు ఇద్దర్ని కూడా వద్దనుకొని, ఒక్కరే ముద్దు అన్న దశకు దక్షిణాది చేరుకుంటే, అవిద్య, పేదరికం అధికంగా ఉన్న ఉత్తరాదికి ఆ ఊసు పెద్దగా పట్టలేదు. జనాభానియంత్రణలోనూ, అభివృద్ధిలోనూ వెనకబడిన ఉత్తరాది రాష్ట్రాలకు వాటి వైఫల్యాలే అర్హతలుగా రకరకాల మేళ్ళు జరుగుతూండటం సహజంగానే దక్షిణరాష్ట్రాలకు ఆగ్రహం కలిగిస్తుంది. ఆకలి, దారిద్ర్యం, అభివృద్ధిలేమి కారణంగా వాటికి ఒనగూరే ప్రత్యేక కేటాయింపులు, రాయితీలు, పథకాలను దక్షిణాది అనాదిగా సహనంగా భరిస్తోంది, పరోక్షంగా పోషిస్తోంది.

తాము ఎదిగి, దేశాన్ని ప్రగతిపథంలో నిలిపిన దక్షిణాదికి సభా ప్రాతినిధ్యంలోనూ అన్యాయం జరగబోతోందన్న అనుమానాలు చాలాకాలంగా ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన జరిగే పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజనలో, తక్కువమంది సంతానాన్ని కన్న తమిళనాడుకు నష్టం జరగబోతోందని స్టాలిన్ వాదన. ఆయన స్వరాష్ట్రానికి సంబంధించిన లెక్కలు విప్పినప్పటికీ, ఇది దక్షిణాది బాధ. రెండేళ్ళక్రితం మహిళా రిజర్వేషన్ బిల్లు సందర్భంలోనే ఈ అంశాన్ని లేవనెత్తినప్పుడు దక్షిణాదికి అన్యాయం జరగనివ్వబోమని ప్రధాని నిండుసభలో కనిమొళికి హామీ ఇచ్చారు. ఇప్పుడు అమిత్ షా కూడా దానినే మరింత గట్టిగా పునరుద్ఘాటించారు.

నియోజకవర్గాల పునర్విభజన ఏ ప్రాతిపదికన, ఏ విధంగా జరిగితే తమకు ఏ మేరకు నష్టం వాటిల్లుతుందో దక్షిణాదిరాష్ట్రాలకు అవగాహన ఉంది. సీట్లు కోల్పోతామన్న అనుమానాలకు ఆధారాలున్నాయి. పునర్విభజన కసరత్తు ఫలితంగా మొత్తం స్థానాల సంఖ్య 543నుంచి మరో మూడువందలు హెచ్చినా, ఆ పెరుగుదలలో దక్షిణాదికి జరగబోయే అన్యాయం మీద కూడా అవగాహన ఉంది. 80 స్థానాలున్న ఉత్తర్‌ప్రదేశ్ అదనంగా మరో అరవైస్థానాలతో లాభపడుతుందని, బీమారు బిహార్ రెట్టింపు స్థానాలతో బాగుపడుతుందనీ వాదనలున్నాయి. ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకుండా, అవి ఉన్నవాటిని కోల్పోకుండా పునర్విభజన ఉంటుందని అమిత్ షా హామీ ఇచ్చినంతమాత్రాన దక్షిణాదికి న్యాయం చేసినట్టు కాదు. దక్షిణాదికి అన్యాయం జరగకుండా తాము ఏ ప్రాతిపదికలతో ముందుకు పోబోతున్నామో కేంద్రపాలకులు ఇప్పటికైనా స్పష్టంచేయాలి. ఎక్కువమంది పిల్లలను కనని పాపానికి దక్షిణాదిని శిక్షించి, బండెడు సంతానం ఉన్న ఉత్తరాదిని అత్యధిక ప్రాతినిధ్యంతో సత్కరిస్తే ఎవరూ ఊరుకోరు. ఉత్తరాది పార్టీగా ముద్రపడిన బీజేపీ, దక్షిణాదిలోనూ బలపడి విస్తరిస్తున్న తరుణంలో ఉత్తర, దక్షిణ విభేదాలకు తావివ్వకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

త్రిభాషా విద్యలో హిందీ తప్పనిసరా?

నిష్కారణ యుద్ధాలు ఒక ఉన్నత లక్ష్య సాధనకు సంకల్పించినవి కావు, కాబోవు. అవి పక్షపాత పూరితమైనవి అవడం కద్దు. తాము విశ్వసించే భావజాలానికి మద్దతుగా చేసే యుద్ధాలవి. భారతీయ జనతా పార్టీకి ఇటువంటి నిష్కారణ యుద్ధాలు ప్రారంభించే ప్రవృత్తి బాగా ఉన్నది. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) అందుకు మంచి ఉదాహరణలు. ఒక అవసరాన్ని తీర్చేందుకు ఉద్దేశించబడినవి కావు ఆ చట్టాలు. హిందువులు, హిందూయేతర మతస్థుల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టడం, విభేదాలు సృష్టించే లక్ష్యంతో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్– భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఆ చట్టాలకు ఎనలేని ప్రాధాన్యమిచ్చాయి.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

కేంద్ర ప్రభుత్వం మరో నిష్కారణ యుద్ధానికి శంఖారావం చేసింది. ఈ తాజా యుద్ధం భాషమీద. 'త్రిభాషాసూత్రం' (టీఎల్ఎఫ్) పేరున ఉన్న పాఠశాల విద్యా విధానాన్ని తొలుత రాధాకృష్ణన్ కమిటీ ప్రతిపాదించింది. ఏ రాష్ట్రమూ దానిని అంగీకరించలేదు, అమలుపరచలేదు. ప్రతిపాదన ప్రతిపాదనగానే ఉండిపోయింది. అందుకు చాలా కారణాలు ఉన్నాయి. స్వాతంత్ర్య తొలి సంవత్సరాలలో పాఠశాలల నిర్మాణానికి, ఉపాధ్యాయుల నియామకానికి ప్రభుత్వాలు సహజంగా ప్రథమ ప్రాధాన్యమిచ్చాయి. బాలలు అందరినీ బడులల్లో చేర్పించేందుకు, వారి విద్యాభ్యాసం పాఠశాల విద్య పూర్తయ్యే దాకా కొనసాగేలా చేసేందుకు ద్వితీయ ప్రాధాన్యమిచ్చారు. ఆ తరువాత, కేవలం భాషలు నేర్పడంలోనే కాకుండా గణితం, విజ్ఞానశాస్త్రం, చరిత్ర, భూగోళశాస్త్రం, సాంఘికశాస్త్రం మొదలైన విషయాలలో కూడ బోధన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు అధిక ప్రాధాన్యమిచ్చారు. స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు అయినా ఆ విద్యా కర్తవ్యాలు అసంపూర్ణంగా, అసఫలంగా మిగిలిపోలేదూ?

భాషా బోధన ఒక ప్రమాదకర అంశంగా పరిణమించింది. అందుకు కారణం విద్యా సంబంధితమైనది కాదు. రాజ్యాంగ అధికరణ 343 వల్ల ఆ సమస్య ఏర్పడింది హిందీ దేశ అధికార భాషగా ఉంటుందని, అయితే ఇంగ్లీషు 15 సంవత్సరాల వరకు పాలన, బోధనా భాషగా కొనసాగుతుందని ఆ అధికరణ పేర్కొంది. ఆ 15 సంవత్సరాల గడువు 1965లో ముగిసింది. ఆ నాటి కేంద్ర ప్రభుత్వం అనాలోచితంగా జనవరి 26, 1965 నుంచి హిందీ ఏకైక అధికార భాష అవుతుందని ప్రకటించింది. హిందీయేతర భాషల వారు తక్షణమే తీవ్రంగా ప్రతిస్పందించారు. నిరసించారు. ఉద్యమించారు. హిందీ వ్యతిరేకత దావానలమయింది. తమిళనాడు భగ్గుమంది. ఒక ద్రావిడ పార్టీ అధికార కేతనం ఎగురవేసింది. హిందీయేతర భాషాలవారు కోరుకున్నంతవరకు ఇంగ్లీషు సహ అధికార భాషగా కొనసాగుతుందని దేశ ప్రజలకు జవహర్‌లాల్ నెహ్రూ హామీ ఇచ్చారు. 1965లో అధికార భాషా సంక్షోభం ముమ్మరమయిన దశలో ఇందిరాగాంధీ, అవును ఆమె ఒక్కరు మాత్రమే, ధైర్యంగా, సాహసోపేతంగా హిందీ దురభిమానులను ధిక్కరించారు. విజ్ఞతతో వ్యవహరించారు. దేశ ప్రజలకు తన తండ్రి నెహ్రూ ఇచ్చిన హామీని గుర్తు చేశారు. ఆ హామీకి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. విజ్ఞత ఉన్న రాజనీతిజ్ఞత అది.

అది నెహ్రూ హామీయే అయినా అంతకంటే ఎక్కువగా, ముఖ్యంగా పరిపాలనా ఆవశ్యకతలు అధికారభాషలుగా హిందీ, ఇంగ్లీషుకు కట్టుబడి ఉండేలా చేశాయి. ఇతర భారతీయ భాషల వలే హిందీ కూడా సమగ్రంగా వికసించిన భాష కాదు. సైన్స్, న్యాయశాస్త్రం, ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలు, ఇంజినీరింగ్, విదేశీ సంబంధాలు, అంతర్జాతీయ వ్యవహారాలు మొదలైన వాటిని సమర్థంగా నిర్వహించేందుకు వెసులుబాటు లేని భాష. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా శాసన నిర్మాణానికి, పాలనా వ్యవహారాల నిర్వహణకు ఇంగ్లీషు మీదనే ఆధారపడ్డాయి.

ఇదిలావుండగా ప్రభావశీలమైన పర్యవసానాలు బహుముఖీనంగా ఉన్న మూడు పరిణామాలు సంభవించాయి. అవి: ఒకటి– 1975లో 'విద్య'ను రాష్ట్ర జాబితా నుంచి ఉమ్మడి జాబితాకు మార్చడం. దీనివల్ల పాఠశాల విద్యకు సంబంధించినంతరవకు రాష్ట్రాల స్వతంత్ర ప్రతిపత్తికి తీవ్ర విఘాతం కలిగింది; రెండు– 1991లో మన దేశం ఆర్థిక సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలను ఆమోదించి, అనుసరించడం; దీనివల్ల ఇంగ్లీష్ భాష ప్రాబల్యాన్ని అంగీకరించడం అనివార్యమయింది; మూడు– మరిన్ని ఆంగ్ల మాధ్యమ పాఠశాలల నేర్పాటు చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేయడం. ఈ డిమాండ్ మరింత అధికంగా ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.

సరే, ప్రస్తుత వివాదం నూతన విద్యా విధానం–2020 లోని వివిధ విషయాలకు, ముఖ్యంగా త్రిభాషా సూత్రంకు సంబంధించినది. ఈ త్రిభాషా సూత్రం ప్రకారం ప్రాంతీయ/ రాష్ట్ర భాషను పాఠశాలల్లో 'ప్రథమ' భాషగా బోధించాలి. ఇంగ్లీషు 'ద్వితీయ' భాష. అయితే 'మూడో' భాష ఏమిటి? కేంద్ర విద్యామంత్రి చిత్తశుద్ధి లేని వాగాడంబర వాదన ఒకటి చేశారు. నూతన విద్యా విధానం ఒక జాతీయ విధానం కనుక ప్రతి రాష్ట్రమూ ఆ విధానాన్ని అమలుపరచడం రాజ్యాంగ విహితమైన బాధ్యత అని ఆయన అన్నారు. అంతేకాకుండా పాఠశాల బాలలకు మూడో భాష కూడా బోధించాలని నూతన జాతీయ విద్యా విధానం నిర్దేశించిందని. అయితే ఆ మూడో భాష విధిగా హిందీ అని స్పష్టీకరించలేదని పేర్కొన్నారు. మరి తమిళనాడు జాతీయ విద్యా విధానాన్ని అమలుపరిచేందుకు, మూడో భాష బోధించేందుకు తమిళనాడు ఎందుకు వ్యతిరేకిస్తుందని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రశ్నించడంలో ఆయన చాలా అమాయకత్వాన్ని అభినయించారు.

ధర్మేంద్ర ప్రసాద్ ప్రశ్నకు సమాధానాలు స్పష్టమే: (1) నూతన విద్యా విధానం ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ విధానం మాత్రమే. అది రాజ్యాంగ నిర్దేశితమైనది కాదు; (2) తమిళనాడులో ప్రభుత్వాలు మొదటి నుంచి అనుసరిస్తున్న విధానం ప్రభుత్వ పాఠశాలల్లో రెండు భాషల బోధన, మూడు కాదు. రెండు భాషల బోధన మాత్రమే జరగాలని తమిళనాడు ప్రభుత్వాలే కాకుండా తమిళ పౌర సమాజమూ గట్టిగా కోరుతున్నది. అయితే ప్రైవేట్ పాఠశాలలు మూడో భాషగా హిందీ బోధించడం పట్ల తమిళనాడు ప్రభుత్వాలు ఎప్పుడూ ఎటువంటి అభ్యంతరం తెలుపలేదు. అవరోధమూ కల్పించలేదు.



త్రిభాషా సూత్రాన్ని అంగీకరించి అమలుపరచాలని తమిళనాడును కేంద్ర ప్రభుత్వం సతాయిస్తోంది. దక్షిణాది రాష్ట్రంపై ఇటువంటి ఒత్తిడి తెచ్చే ముందు కేంద్రం దేశ వ్యాప్తంగా రెండు భాషల (ప్రాంతీయ భాష, ఇంగ్లీషు) బోధనను పరిపూర్ణంగా విజయవంతం చేయాలి. రెండో భాషగా అంగీకృతమైన ఇంగ్లీషును ఉత్కృష్ట ప్రమాణాలతో నేర్పడంలో ఘోరంగా విఫలమయిన ప్రభుత్వం దేశవ్యాప్తంగా బాలలకు మూడో భాష నేర్పడంలో సంపూర్ణంగా సఫలమయ్యేందుకు ఎందుకు ఆరాటపడుతోంది?

తమిళనాడులో సీబీఎస్ఈ (642), ఐసీఎస్ఈ (77), ఐబీ(8)కి అనుబంధంగా ఉన్న అన్ని పాఠశాలల్లోను మూడో భాషగా హిందీ బోధిస్తున్నారు. వేలాది బాలలు హిందీ నేర్చుకుంటున్నారు. దక్షిణ్ భారత్ హిందీ ప్రచార్ సభ ఇత్యాది విద్యా సంస్థల ద్వారా లక్షలాది బాలలు హిందీ నేర్చుకోవడానికి తమిళనాడు ప్రభుత్వాలు ఏ విధంగాను అడ్డుపడడం లేదు.

నూతన విద్యా విధానం–2020లో మంచి అంశాలూ ఉన్నాయి, అంగీకారయోగ్యం కాని విషయాలూ ఉన్నాయి. ఎన్ఈపీలోని వివాదాస్పద విషయాలలో ఒకటి త్రిభాషా సూత్రం. దీన్ని హిందీ భాష మాట్లాడే రాష్ట్రాలలో అమలుపరచడం లేదు. అయితే హిందీయేతర భాషలు మాట్లాడే రాష్ట్రాలలో ఈ త్రిభాషా సూత్రాన్ని అమలుపరిచేందుకు ప్రయత్నిస్తున్నారు, కాదు, అమలు జరిపేలా ఒత్తిడి చేస్తున్నారు. ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, బిహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హర్యానా రాష్ట్రాలలోని ప్రభుత్వ పాఠశాలలలో హిందీ మాత్రమే బోధించే ఏక భాషా విధానాన్ని సార్థకంగా అనుసరిస్తున్నారని మరి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ ఉత్తరాది రాష్ట్రాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న బాలలు మరే ఇతర భాషను నేర్చుకోవడం లేదు. కారణమేమిటి? ఆంగ్లం బోధించే ఉపాధ్యాయులు కొద్ది మంది మాత్రమే ఉండగా హిందీయేతర భారతీయ భాషలను బోధించే ఉపాధ్యాయులు అసలు లేనేలేరని చెప్పడం సత్య దూరం కాదు. ప్రైవేట్ పాఠశాలలు సైతం సంతోషంగా ప్రభుత్వ పాఠశాలలనే అనుసరిస్తున్నాయి. హిందీ భాషను మాత్రమే బోధిస్తున్నాయి. ఆంగ్ల భాష బోధిస్తున్న ప్రైవేట్ పాఠశాలలు ఉన్నప్పటికీ అవేవీ బాలలకు మూడో భాషను నేర్పడం లేదు. మూడో భాష బోధిస్తున్న పాఠశాలలూ లేకపోలేదు. ఆ మూడో భాష ప్రతి చోటా నిశ్చయంగా సంస్కృతమే. పంజాబ్, గుజరాత్, మహారాష్ట్రలోని ప్రభుత్వ పాఠశాలల్లో మూడో భాషగా హిందీ బోధిస్తున్నారు. పంజాబీ, గుజరాతీ, మరాఠీ భాషలకు హిందీ సన్నిహిత బంధుత్వం ఉన్నదనే విషయం అందరికీ తెలిసిందే. సరే, ఈ విషయాలు అలా ఉంచితే ఆంగ్ల భాషా బోధన ప్రమాణాలు చాలా అధ్వాన్నంగా ఉన్నాయి. నాణ్యత పూర్తిగా కొరవడిన బోధనా పద్ధతులతో మన బాలలు ఆ అంతర్జాతీయ భాషను ప్రశస్తంగా నేర్చుకోవడం ఎలా సాధ్యమవుతుంది? ఇంగ్లీషు బోధిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలలు ఆంగ్ల భాషా తరగతి గది వెలుపల ఆ భాషను ఒక్క ముక్క కూడా మాట్లాడలేరు, చదవలేరు, అర్థం చేసుకోలేరు, రాయలేరు. ఇదొక కఠోర సత్యం. తమిళనాడుతో సహా అన్ని రాష్ట్రాలకూ ఈ సత్యం వర్తిస్తుంది.

త్రిభాషా సూత్రాన్ని అంగీకరించి అమలుపరచాలని తమిళనాడు ప్రభుత్వాన్ని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రసాద్ సతాయిస్తున్నారు. త్రిభాషా సూత్రం పేరిట మూడో భాషగా హిందీ నేర్పాలన్నదే ఆయన ఉద్దేశం, నిర్దేశం కూడా. దక్షిణాది రాష్ట్రంపై ఇటువంటి ఒత్తిడి తెచ్చే ముందు కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా రెండు భాషల (ప్రాంతీయ భాష, ఇంగ్లీషు) బోధనను పరిపూర్ణంగా విజయవంతం చేయాలి. మన సమాజంలో ఆంగ్ల భాషా ప్రావీణ్యాలు ప్రశస్తంగా ఉన్నవారు చాలా చాలా తక్కువ. వ్యవహారిక ఇంగ్లీషు మాట్లాడగలిగే వారే తక్కువ కాగా మంచి ఇంగ్లీషు మాట్లాడగలిగేవారు చాలా అరుదు. త్రిభాషా సూత్రం ప్రకారం రెండో భాషగా అంగీకృతమైన ఇంగ్లీషును ఉత్కృష్ట ప్రమాణాలతో బోధింపచేయడంలో ఘోరంగా విఫలమయిన ప్రభుత్వం దేశవ్యాప్తంగా బాలలకు మూడో భాష నేర్పడంలో సంపూర్ణంగా సఫలమయ్యేందుకు ఎందుకు ఆరాటపడుతోంది?

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

సిద్ధాంతం వేరు, సైన్స్ వేరు!

మార్క్స్ సిద్ధాంతాన్ని నమ్మి, దానిని సామాన్యులు సైతం సరళంగా అర్థం చేసుకోవడానికి వీలుగా మార్క్స్ రచనలను అనువదించి, కృషి చేసిన వారిలో రంగనాయకమ్మ ప్రథములు. ఎంతటి గొప్ప మేధావులైనా అప్పుడప్పుడూ తడబడతారు. 'కృత్రిమ మేధ: భ్రమలూ, వాస్తవాలు!' (ఫిబ్రవరి 20, -2025) అనే వ్యాసంలో ఇదే జరిగినట్లు అనిపించింది.

కృత్రిమమేధ ఎన్నో పనులు చేస్తూ పెట్టుబడిదారులకు, వ్యాపారులకు లాభాలను గడించి పెడుతుందంటూ ఒక పది రకాల పనులను ఉదాహరించారు రంగనాయకమ్మ. నిజమే, కృత్రిమమేధ అనేది సైన్స్‌కు చెందిన ప్రక్రియ. సైన్స్ ఎప్పుడు కఠినమైన ప్రక్రియలను సరళం చేస్తుంది. మార్క్స్ ఉత్పత్తి – లాభాలు అంశాన్ని మిగులువిలువ సిద్ధాంతం కోణంలో చూసినట్లు మనం సైన్స్‌ను సైన్స్ అప్‌గ్రేడేషన్ కోణంలో చూడాలి. అనేక సిద్ధాంతాలకు ప్రత్యామ్నాయ సిద్ధాంతాలు వచ్చాయి. కానీ ఉత్పత్తి ప్రక్రియలో మార్క్స్ వెలుగులోకి తెచ్చిన మిగులు విలువ సిద్ధాంతానికి ప్రత్యామ్నాయం లేదు, రాదు కూడా. సిద్ధాంతానికి ప్రత్యామ్నాయం రావచ్చు, రాకపోవచ్చు. సైన్స్‌కు మాత్రం ప్రత్యామ్నాయం ఉండదు, కేవలం అప్‌గ్రేడేషన్ మాత్రమే ఉంటుంది. అలా వచ్చిందే కృత్రిమమేధ.

కృత్రిమమేధపై పెట్టుబడి లాభం రంగనాయకమ్మ కోణంలో చూద్దాం. ఫ్రెంచ్ ఆర్థికవేత్త జెబి సే సూత్రం ప్రకారం– "సప్లయ్ తనకు తానే తన డిమాండ్ సృష్టించుకుంటుంది". ఈ సిద్ధాంతం ప్రకారం పెట్టుబడిదారుల విపరీత లాభాపేక్షతో ఉత్పత్తిలో యాంత్రీకరణ ప్రవేశపెట్టడం వల్ల ఉత్పత్తులు పెరిగి లాభాలు రావాలి. కానీ పారిశ్రామిక చరిత్రలో ఇలా జరగలేదు. యంత్రాల ద్వారా డిమాండ్‌ను మించి మిగులు ఉత్పత్తులు పెరగడంతో అమ్మకాలు లేవు. నష్టాలపాలైన పెట్టుబడిదారులు ఫ్యాక్టరీలను నడపకపోవడం వలన కార్మికులు ఉపాధి కోల్పోయారు. లాభాల ఆశతో విపరీత ఉత్పత్తితో పెట్టుబడిదారులకు లాభాలు వస్తాయనేది కూడా ఒక భ్రమ అని ప్రపంచవ్యాప్తంగా 1928–33 మధ్య వచ్చిన ఆర్థికమాంద్య పరిస్థితులు రుజువు చేసినవి. కార్ల్ మార్క్స్ యాంత్రీకరణ వల్ల ఉపాధి కోల్పోయిన కార్మికవర్గం పెట్టుబడిదారి వ్యవస్థపై తిరుగుబాటు చేస్తుందన్నారు. యాంత్రీకరణ వలన మిగులు ఉత్పత్తితో నష్టాల పాలైన పెట్టుబడిదారులు, వేతనాలు చెల్లించలేని స్థితిలో కార్మికులను ఉద్యోగాల నుండి తొలగించినప్పటికీ, ఎక్కడా మార్క్స్ చెప్పినట్టు కార్మికులు తిరుగుబాటు చేయలేదు. ఆనాటి ఆర్థికమాంద్య ఉపద్రవం నుండి పెట్టుబడిదారులను కాపాడి వారికి లాభాల మార్గం చూపి ఆర్థిక వ్యవస్థను బయటపడేయడానికి కృషిచేసిన వారిలో ఆర్థర్ సిసిల్ పిగూ ఒకరు. ఆయన చెప్పిన వేతనాల తగ్గింపు సిద్ధాంతం (వేజ్ కట్ పాలసీ), ఇటు లాభాలను గాని అటు డిమాండ్‌ను కానీ పెంచలేకపోయింది. ఇక్కడ ఆచరణలో జెబి సే, కార్ల్ మార్క్స్ ఆర్థర్ సిసిల్ పిగూ సిద్ధాంతాలు మూడూ విఫలం అయినాయి. ప్రపంచం తీవ్రమైన ఆర్థిక మాంద్యంతో కొట్టుమిట్టాడుతున్నప్పుడు బ్రిటిష్ ఆర్థికవేత్త జె.ఎమ్. కీన్స్ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం జోక్యం చేసుకొని పని సృష్టించాలని, తద్వారా ప్రజల్లో కొనుగోలుశక్తి పెరిగి వస్తువులకు డిమాండ్ ఏర్పడి పరిశ్రమలు పునఃప్రారంభం అవుతాయని, ఇందుకుగాను ప్రభుత్వాలు రాబడిని మించి వ్యయం చేయాలంటూ లోటుబడ్జెట్ విధానాన్ని సూచించాడు. నేటికీ అనేక దేశాలు రాబడికి మించి వ్యయం చేస్తున్నాయి. ఈ అంశాలను బట్టి ఒక సిద్ధాంతం విఫలమైనప్పుడు నష్టనివారణకు ప్రత్యామ్నాయ సిద్ధాంతం కూడా వస్తుంది అనేది రుజువైంది.



మొత్తం మానవ పరిణామ క్రమమంతా కఠినత్వం నుంచి సరళత్వం వైపు ప్రయాణం మాత్రమే. అందులో భాగమే పెట్టుబడి లాభం. పరిశోధనలన్నీ పెట్టుబడి లేకుండా జరగవు. పెట్టుబడి పెట్టేవారు లాభం తప్పక ఆశిస్తారు. ఆశలేకపోతే ప్రగతికి ఆస్కారం లేదు. కృత్రిమమేధ పనితీరు పట్ల అనుమానాలు, భయాలు అర్థరహితం.

భారతదేశంలో వ్యవసాయరంగంలో ట్రాక్టర్ లాంటి యంత్రాల వినియోగం లేకుంటే ఇప్పటి జనాభాకు సరిపడా ఆహారధాన్యాల ఉత్పత్తిలేక సగం మంది ఆకలితో చచ్చిపోయేవారు. జనాభా ఇంతగా పెరిగినా గ్రామాల్లో కూలీల కొరత స్పష్టంగా కనపడుతున్నది. యంత్రీకరణను వ్యతిరేకిస్తూ, శ్రామికులకు పనిలేదని వాపోయేవారు తెలంగాణ పల్లెలను చూస్తే బిహార్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాల నుండి వ్యవసాయకూలీల వలసలను గమనించవచ్చు. వ్యవసాయరంగంలో సాంకేతిక పరిజ్ఞానం సృష్టిస్తున్న ఉత్పత్తి ఫలాలు ఎన్నో ఉన్నాయి. మహారాష్ట్రలో బారామతి ప్రాంతంలో మైక్రోసాఫ్ట్ వ్యవసాయ పరిశోధనలు చేస్తున్నది. ఎలాంటి సౌకర్యాలు అందుబాటులో లేని, నీటిఎద్దడి కలిగిన మారుమూల పల్లెల్లో కృత్రిమమేధను ఉపయోగిస్తూ పంటలకు ఆశిస్తున్న తెగుళ్ళను గుర్తించి సకాలంలో నివారణ చర్యలను చేపట్టి వ్యవసాయ ఉత్పత్తులను పెంచుకొంటున్నారు. జన్యువుల రహస్యం ఛేదించి, కణనిర్మాణం గుట్టును పసిగట్టి, జీనోమ్ మ్యాప్ రూపుదిద్దిన మానవుడు, శిశువు పిండదశలో ఉన్నప్పుడే ఏ జన్యువు లోపంతో ఏ రకమైన వ్యాధులు వస్తాయో గుర్తించి జన్యులోపాలను సరిచేయగలుగుతున్నాడు.

ఇలా సైన్స్ సృష్టించిన అద్భుతాలు ఎన్నెన్నో ఉన్నాయి. సాధారణ మొబైల్ స్థానంలో ఆండ్రాయిడ్ మొబైల్ వచ్చిన తర్వాత వాచ్, కెమెరా, టేప్ రికార్డర్ వంటి ఎన్నో పరికరాల ఉపయోగం తగ్గింది. అంతమాత్రాన ఆండ్రాయిడ్ మొబైల్ నిరుద్యోగం సృష్టిస్తున్నదని దాని వాడకం నిలిపివేయలేం కదా. కృత్రిమమేధ వల్ల పెట్టుబడిదారులకు విపరీత లాభాలు వస్తాయనేది ఒక భ్రమ. కేవలం అది ఒక దశ మాత్రమే. మళ్ళీ దానిలో అప్‌గ్రేడేషన్ ఉండనే ఉంటుంది. మొత్తం మానవ పరిణామ క్రమమంతా కఠినత్వం నుంచి సరళత్వం వైపు ప్రయాణం మాత్రమే. అందులో భాగమే పెట్టుబడి లాభం. పరిశోధనలన్నీ పెట్టుబడి లేకుండా జరగవు. పెట్టుబడి పెట్టేవారు లాభం తప్పక ఆశిస్తారు. ఆశ లేకపోతే ప్రగతికి ఆస్కారం లేదు. సైన్స్ ఏ వర్గ ప్రయోజనాలకు ఉపయోగపడుతుందనే వాదన అర్థరహితం. సైన్స్ సార్వజనీనమైంది. కృత్రిమమేధ పనితీరు పట్ల అనుమానాలు, భయాలు అర్థరహితం.

• మామిడి నారాయణ
సెంటర్ ఫర్ బెటర్ ఇండియా రీసెర్చ్ ఫౌండేషన్

ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించని జమిలి!

దేశంలో జమిలి ఎన్నికలు జరపడానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. మాజీ రాష్ట్రపతి కోవింద్ నాయకత్వంలో ఒక కమిటీ వేసి, రిపోర్టు తెప్పించుకుంది. లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టబడి, జేపీసీ పరిశీలనలో ఉంది. బిల్లు ప్రస్తుత రూపంలో న్యాయస్థానాల్లో నిలబడదని, ఎన్నికలు జమిలిగా నిర్వహించే లక్ష్యంతో ఆయా అసెంబ్లీల కాలవ్యవధిని కుదించడమన్నది రాజ్యాంగ మౌలిక నిర్మాణానికి వ్యతిరేకమని భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యుయు లలిత్ ఇటీవల జేపీసీ ముందు తన అభిప్రాయాన్ని ప్రకటించినట్టుగా వార్తలు వచ్చాయి. ఫెడరల్ వ్యవస్థకు జమిలి ప్రమాదకరమని అనేక రాజకీయ పార్టీలు, సంస్థలు వ్యతిరేకిస్తున్నప్పటికీ, ఒకే దేశం–ఒకే ఎన్నిక విధానాన్ని ఎలాగైనా అమలులోకి తేవాలన్న కృతనిశ్చయంతో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నది.

రాజ్యాంగంలో ఐదేళ్ళకు ఒకసారి ఎన్నికలు జరగాలని ఉంది గానీ, ఎన్నికైన ప్రభుత్వం ఐదేళ్ల ఖచ్చితంగా అధికారంలో ఉండాలని ఎక్కడా పేర్కొనలేదు. ఆయా సభల ఆమోదం ఉన్నంత వరకు మాత్రమే ప్రజాస్వామ్యబద్ధంగా అధికారంలో ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రాలలో ఎన్నికైన ప్రభుత్వాలను కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 అధికరణకు అనుగుణంగా రద్దు చేసిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి.

జమిలి ఎన్నికలకై ప్రభుత్వం చేస్తున్న మూడు ప్రధాన వాదనలలో మొదటిది ఎన్నికల ఖర్చు తగ్గుతుందని. మన దేశంలో ఎన్నికల ఖర్చు రెండు రకాలుగా ఉంటోంది. ఒకటి ప్రభుత్వం పెట్టేది, రెండోది రాజకీయ పార్టీలు గానీ, పోటీ చేసే అభ్యర్థులు గానీ పెట్టేది. 2024లో జరిగిన ఎన్నికలలో 98 కోట్ల మంది ఓటర్లు, ఖర్చు సుమారు పది వేల కోట్ల రూపాయలని ఎన్నికల కమిషన్ పేర్కొంది. అంటే ఒక్కో ఓటరుకు ఐదేళ్ళకు వంద, సాలుకు ఇరవై రూపాయల ఖర్చు. జమిలి ఎన్నికల ద్వారా ఏటా ఐదు వేల కోట్ల రూపాయలు ఆదా అవుతాయని కోవింద్ కమిటీ తన నివేదికలో పేర్కొంది. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వార్షిక బడ్జెట్ సుమారు రూ.90లక్షల కోట్లు. అంటే ప్రతి ఏటా ఎన్నికలు జరిగినా ఖర్చు మొత్తం బడ్జెట్‌లో 0.0005 శాతం, అంటే వంద రూపాయలలో ఐదు పైసలు. ఇంత స్వల్ప మొత్తాన్ని ఒక పెద్ద ప్రజాస్వామ్య దేశం ఖర్చు పెట్టలేదనడం సముచితం కాదు. గత సంవత్సరం కార్పొరేట్ల 1.7 లక్షల కోట్ల రూపాయల బ్యాంకు ఋణాలను మోదీ ప్రభుత్వం మాఫీ చేసింది. దానితో పోలిస్తే ఈ ఖర్చు అసలు లెక్కే కాదు. అయినా ప్రజాస్వామ్యానికి గుండెకాయ లాంటి ఎన్నికలను డబ్బుతో కొలవడం సహేతుకం కూడా కాదు.

అదే సందర్భంలో 2024 ఎన్నికలలో లక్ష కోట్ల రూపాయలకు పైగా వివిధ రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఖర్చు పెట్టారని సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ అనే సంస్థ నివేదించింది. అంటే ప్రభుత్వ ఖర్చుకు పది రెట్లకు పైగా పార్టీలు ఖర్చు పెట్టాయి. ఒక్కో పార్లమెంటు అభ్యర్థి కనీసంగా వంద నుండి రెండు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఈ ఖర్చును వారు రాజకీయ వ్యాపారానికి పెట్టుబడిగా చూస్తున్నారు. ఎన్నికల ఖర్చు ప్రభుత్వానికి నామమాత్రమే గానీ, అభ్యర్థులకు, రాజకీయ పార్టీలకు మాత్రం భారీగానే ఉంటోంది.

ఎన్నికల సందర్భంలో అనేక మందికి ఉపాధి లభిస్తుంది. లేబర్ డిమాండు అధికంగా ఉంటుంది. ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుంది. ఇది ఒక రకంగా సంపద పునః పంపిణీ కింద లెక్క. ఎన్నికల ముందు ప్రభుత్వాలు ధరలను పెంచవు. అందువల్ల తరచూ ఎన్నికల వల్ల ప్రజలకు లాభమే. ఏ రకంగా చూసినా జమిలి ఎన్నికల ప్రతిపాదన వెనుక కార్పొరేట్, రాజకీయ ప్రయోజనాలే తప్ప, సామాన్యుల ప్రయోజనాలు కానరావు.



వాస్తవంగా ఎన్నికల సందర్భంలో పార్టీల ప్రచారం, ఇతరత్రా అనేక మందికి ఉపాధి లభిస్తుంది. లేబర్ డిమాండు అధికంగా ఉంటుంది. ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుంది. ఇది ఒక రకంగా సంపద పునః పంపిణీ కింద లెక్క. అలాంటప్పుడు సామాన్యులకెందుకు బాధ. ఇంకో రకంగా చూస్తే, ఎన్నికల ముందు ప్రభుత్వాలు ధరలను సాధారణంగా పెంచవు. 2024 ఎన్నికల ముందు మోదీ ప్రభుత్వం గ్యాస్ ధరను రెండు వందల రూపాయలు, పెట్రోల్ ధరను తగ్గించింది. అందువల్ల ఎలా చూసినా తరచూ ఎన్నికల వలన ప్రజలకు లాభమే కానీ నష్టమేమీ కాదు.

ఇక రెండో వాదన ఎన్నికల నియమావళి ప్రజలకు ఇబ్బంది కలగజేస్తోందనేది. వాస్తవంగా ఈ సమయంలో కూడా సాధారణ ప్రజలకు అసౌకర్యం ఏమీ ఏర్పడదు. వారి రోజువారీ జీవితం యథాతథంగానే సాగుతూ ఉంటుంది. ఇక్కడ కూడా ఇబ్బంది అధికార పార్టీలకే. ఎందువల్లనంటే ఎన్నికల ముందు ప్రజలపై భారాలు వేస్తే ఓడిపోతామనే భయంతో ధరలు పెంచడం, సౌకర్యాలను కుదించడం వంటి చర్యలు చేపట్టరు. భారాలకు భిన్నంగా సంక్షేమ చర్యలు సైతం చేబడతారు. దీనివల్ల కూడా ప్రజలకు లాభమే కదా. వాస్తవంగా ప్రతి ఏటా దేశంలో ఏదో రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతూ ఉంటేనే ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీగా ఉంటాయి.

మూడో వాదన ఎన్నికైన ప్రజాప్రతినిధులు తరచూ ఎన్నికల వలన అభివృద్ధిపై దృష్టి పెట్టలేకపోతున్నారన్నది. వాస్తవంగా గెలిచిన మరునాటి నుండే వచ్చే ఎన్నికలలో ఎలా గెలవాలన్నదే ప్రజాప్రతినిధులు ఆలోచిస్తూ ఉంటారు. ప్రజలను మంచి చేసుకుంటూ ఉంటారు. అందువల్ల ఎన్నికలు జరుగుతూ ఉంటేనే అభివృద్ధి చర్యలు చేపడతారు.


అలాగే జమిలి ఎన్నికల ప్రతిపాదనలో స్థానిక సంస్థల ఎన్నికలను కూడా జతచేశారు. మన దేశంలో ప్రజల ప్రాధాన్యతలు వేర్వేరు స్థాయి ఎన్నికలలో వేర్వేరుగా ఉంటాయి. ఉదాహరణకు స్థానిక సంస్థల ఎన్నికలలో వీధిలైట్లు, మంచి నీటి సరఫరా, పౌర సేవలు వంటివి ముఖ్య పాత్ర పోషిస్తాయి. ఇక్కడ దేశ సమస్యలు, ఆయా దేశ నాయకుల చరిష్మా వంటివి పని చేయవు. అలాగే అసెంబ్లీ ఎన్నికలలో కూడా ఆయా రాష్ట్రాలలోని శాంతి భద్రతలు, విద్య, వైద్యం, సంక్షేమం వంటి స్థానిక సమస్యలే ప్రధాన పాత్ర పోషిస్తాయి. పార్లమెంటు ఎన్నికలలో ఒక పార్టీ గెలిచి, వెంటనే జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మరో పార్టీ మహారాష్ట్ర, హర్యానా, కర్నాటక, ఢిల్లీ, కేరళ వంటి రాష్ట్రాలలో గెలవడం దీనికి నిదర్శనం. జమిలి ఎన్నికలలో కేంద్ర రాజకీయాలు ముందుకు వచ్చి, ఆచరణలో ప్రజల ఈ స్థానిక ఆకాంక్షలను ప్రతిబింబించవు. అందువల్ల జమిలి ఎన్నికల వలన మొట్టమొదట నష్టపోయేది ప్రాంతీయ పార్టీలే. దీనివల్ల అధికార కేంద్రీకరణ జరిగి ఫెడరలిజానికి విఘాతం కలుగుతుంది. నియంతృత్వానికి దారితీస్తుంది. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం.


వీటికితోడు, దీనికి అవసరమైన రాజ్యాంగ సవరణలు చేసే అంత బలం నేడు మోదీ ప్రభుత్వానికి ఉందా అన్నది ప్రధాన అంశం. రాజ్యాంగ సవరణలు జరగాలంటే పార్లమెంటు ఉభయ సభలలో 2/3 వంతు సభ్యుల ఆమోదం కావాలి. అలాగే సగం రాష్ట్రాలలో సవరణలు అదే రెండొంతుల మెజారిటీతో ఆమోదం పొందాలి. మన లోక్‌సభలో 543 సభ్యులలో 362 మంది సభ్యుల ఆమోదం అవసరం. కానీ ఎన్డీయే కూటమి బలం 293. అంటే 69 తక్కువ. అలాగే రాజ్యసభలో 245 సభ్యులలో ఎన్డీయే బలం 125 మాత్రమే. రాజ్యాంగ సవరణకు ఇంకా 39 మంది సభ్యులు అవసరం. ఈ మద్దతు ప్రభుత్వం ఎలా సంపాదిస్తుంది అన్నది ప్రశ్న.

వీటన్నింటికీ మించి అసలు ఒకేసారి ఎన్నికలు జరపగలిగేంత యంత్రాంగం ఎన్నికల కమిషన్ వద్ద ఉందా అన్నది పెద్ద ప్రశ్న. ఇటీవల వివిధ రాష్ట్రాలకు అనేక దశలలో ఎన్నికలు జరిపినప్పుడు ఒక సమాచారహక్కు ప్రశ్నకు సమాధానమిస్తూ, తమ వద్ద ఒకేసారి ఎన్నికలు జరపగలిగేంత పాలనాపర యంత్రాంగం, సెక్యూరిటీ, లాజిస్టిక్స్ వంటివి లేవని ఎన్నికల కమిషన్ తెలిపింది. ఒక్క రాష్ట్రంలోనే జరపలేనివారు, ఇక దేశమంతా ఒకేసారి ఎలా జరపగలరు?

ఇలా ఎన్నో అంశాలు, ఆటంకాలు ఉన్నా ఎందుకు మోదీ ప్రభుత్వం జమిలి ఎన్నికల అమలుకు అంత ఆరాటపడుతోందీ అంటే– వారనుకున్నంత స్పీడుగా నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమలుకు తరచూ ఎన్నికలు అవరోధంగా నిలుస్తున్నాయి. కార్పొరేట్ అనుకూల విధానాలు వారనుకున్న స్థాయిలో జరగడం లేదు. మతం పేరున ప్రజలను ఎంత రెచ్చగొట్టినా ఎన్నికలలో వారు ఆశించినంత ఫలితాలు రాలేదు. దీనితో ఇప్పుడు మరో కొత్తబాట పట్టారు. ఏ రకంగా చూసినా జమిలి ఎన్నికల ప్రతిపాదన వెనుక కార్పొరేట్, రాజకీయ ప్రయోజనాలే తప్ప, సామాన్యుల ప్రయోజనాలు ఇసుమంత కూడా కానరావు. ప్రభుత్వం ఇస్తున్న 'ఒకే దేశం- ఒకే ఎన్నిక' వంటి ఆకర్షణీయ నినాదం మాటున ఉన్న అసలు లక్ష్యాలను, ప్రమాదాన్ని ప్రజలు అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది.

■ ఎ. అజశర్మ





తొలి పద్దు పొడిచింది

రాష్ట్ర ఆర్థిక బడ్జెట్‌లో ఉమ్మడి కృష్ణాకు భారీ ఊరట

రాజధాని అమరావతి అభివృద్ధికి మ్యాచింగ్ గ్రాంట్

రూ.6 వేల కోట్ల నిధుల కేటాయింపుపై సర్వత్రా హర్షం



ఐదేళ్ల ఆశలకు తొలి'పద్దు' పొడిచింది. రాజధాని అమరావతి సహా ఉమ్మడి కృష్ణా జిల్లాకు భారీ ఊరట లభించింది. ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమం, మౌలికం జోడింపుగా బడ్జెట్ కేటాయింపులు జరపటంపై ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. విజయవాడ విమానాశ్రయం, బందరు పోర్టు, మెట్రోరైల్ ప్రాజెక్టుకు ఈ బడ్జెట్ ఊతం ఇవ్వగా, కృష్ణాడెల్టా ఆధునికీకరణకు తోడ్పాటునిచ్చింది. భూ సేకరణలకు కూడా కేటాయింపులు జరపటంతో అమరావతి నూతన రైల్వేలైన్, మెట్రో రైల్, జాతీయ రహదారి ప్రాజెక్టులు పరుగులు పెట్టనున్నాయి. ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు ఇన్సెంటివ్‌ల ప్రకటనతో స్టార్టప్స్‌కు బీజం పడనుంది.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

- విజయవాడ ఎయిర్‌పోర్టు పెండింగ్ బకాయిలకు మోక్షం
- మచిలీపట్నం పోర్టుకు మ్యాచింగ్ గ్రాంట్, మౌలికానికి నిధులు
- విజయవాడ మెట్రోరైల్ ప్రక్రియకు వీలుగా కేటాయింపులు
- కృష్ణాడెల్టా ఆధునికీకరణ పనులు, చింతలపూడికి సాంత్వన

తల్లికి వందనం ద్వారా ఇరు జిల్లాలకు రూ.900 కోట్ల లబ్ధి

అభివృద్ధి, సంక్షేమానికి ఊతం



రాష్ట్ర పునర్నిర్మాణం, అభివృద్ధి, సంక్షేమానికి ఊతమిచ్చేలా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, సామాజిక పింఛన్లకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. బీసీల సంక్షేమానికి రూ.47,456 కోట్లు, ఆదరణ పథకానికి రూ.1,000 కోట్లు కేటాయించడంతో కూటమి ప్రభుత్వం బీసీలకు అండగా ఉంటుందనే నమ్మకం కలిగింది. గృహ నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, అమరావతి, రహదారుల అభివృద్ధికి బడ్జెట్‌లో అధిక మొత్తంలో నిధులు కేటయించారు. బీసీ వర్గాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ముందుచూపుతో బడ్జెట్‌లో పెద్దమొత్తంలో నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు.

- కొల్లు రవీంద్ర, మంత్రి

జయహో అమరావతి

రూ.6 వేల కోట్ల కేటాయింపులు

రాజధాని అమరావతికి రూ.6 వేల కోట్ల నిధులు కేటాయించారు. రాజధానిలో రూ.41 వేల కోట్లతో ఏడీబీ, ప్రపంచబ్యాంకు, హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ వంటి ఆర్థిక సంస్థల అప్పుతో పనులు చేపడుతున్న విషయం తెలిసిందే. వీటికి అదనంగా రాజధాని ప్రాంత పరిధిలో చేపట్టాల్సిన పనులకు రూ.6వేల కోట్లు కేటాయించారు. అమరావతి అభివృద్ధి పనులకు తీసుకుంటున్న రుణం నేపథ్యంలో మ్యాచింగ్ గ్రాంట్‌గా కూడా కొంత రాష్ట్ర ప్రభుత్వం చూపాల్సి ఉంటుంది. అలాగే, అమృత్ సిటీలో భాగంగా అమరావతికి కేంద్రం ఇచ్చే మ్యాచింగ్ గ్రాంట్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా కొంత మ్యాచింగ్ గ్రాంట్‌ను కలపాల్సి ఉంటుంది. ఇవికాకుండా రాజధాని ప్రాంతంలో అవసరాల ప్రాతిపదికన చేపట్టాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులను వినియోగిస్తారు. అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్), ఇన్నర్ రింగ్‌రోడ్డు (ఐఆర్ఆర్)కు సంబంధించి అనుబంధంగా చేపట్టాల్సిన అనుసంధాన మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులను వినియోగించే అవకాశం ఉంది.

ఎయిర్‌పోర్టు, బందరు పోర్టు.. భలే సపోర్టు

బడ్జెట్‌లో గంపగుత్తగా కేటాయింపులు జరిపినప్పటికీ విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం, మచిలీపట్నం పోర్టుకు రూ.200 కోట్ల మేర ప్రయోజనం కలగనుంది విజయవాడ విమానాశ్రయానికి సంబంధించి ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో భాగంగా ఇళ్ల నిర్మాణానికి తొలి విడతగా ఇవ్వాల్సిన నిధులు, ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చిన రైతులకు కౌలు బకాయిలు, నిరాశ్రయులై అద్దె ఇళ్లలో ఉంటున్న వారికి అద్దె బకాయిలు, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన బకాయిల క్లియరెన్స్‌కు రూ.100 కోట్ల మేర కేటాయింపులు జరిపారు. దీంతో విజయవాడ ఎయిర్‌పోర్టుతో ముడిపడిన ఐదేళ్ల సమస్యలకు పరిష్కారం లభించింది. మచిలీపట్నం పోర్టు పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మిగతా 6లో..



	ప్రస్తుత టీడీపీ కూటమి బడ్జెట్‌లో కేటాయింపులు	గత ఏడాది వైసీపీ కేటాయింపులు
అమరావతి	రూ.6,000 కోట్లు	0
జేజేఎం	రూ.500 కోట్లు	రూ.120 కోట్లు
కృష్ణాడెల్టా	రూ.400 కోట్లు	0
చింతలపూడి	రూ.30 కోట్లు	0
విజయవాడ మెట్రో	రూ.50 కోట్లు	ఒక్క రూపాయి
మచిలీపట్నం పోర్టు	రూ.100 కోట్లు	రూ.1,080 కోట్లు (అప్పు)
విజయవాడ ఎయిర్‌పోర్టు	రూ.100 కోట్లు	0





మెట్రోకు రూ.50 కోట్లు

- కేంద్ర ప్రభుత్వమే నూరు శాతం భరించేలా ప్రతిపాదన
- స్పష్టత వస్తేనే కేటాయింపులకు అవకాశం
- అయినా మెట్రోకు నిధులు కేటాయించిన ప్రభుత్వం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ మెట్రోరైల్ ప్రాజెక్టుకు రూ.50 కోట్ల నిధులు కేటాయించారు. మెట్రో రైల్ ప్రాజెక్టుకు నూరుశాతం నిధులు మంజూరు చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ విజ్ఞప్తి చేసింది. సాధారణంగా మెట్రో ప్రాజెక్టులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం జాయింట్ వెంచర్ ప్రాతిపదికన మాత్రమే నిధులు కేటాయిస్తుంది. రాష్ట్ర పునర్విభజన చట్టం మేరకు, గతంలో కేంద్రం ఇచ్చిన హామీలను దృష్టిలో ఉంచుకుని నూరుశాతం ఈ ప్రాజెక్టు వ్యయాన్ని భరించాల్సిందిగా విజ్ఞప్తి చేసింది. ఈ ప్రతిపాదనపై కేంద్రస్థాయిలో చర్చ నడుస్తోంది. అయితే, కేంద్ర ప్రభుత్వం సానుకూలంగానే నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని మెట్రోరైల్ కార్పొరేషన్ అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మెట్రో ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించింది. మెట్రోకు కేంద్ర ప్రభుత్వం నూరుశాతం సహాయం చేస్తే కనుక.. రాష్ట్ర ప్రభుత్వంపై కేవలం భూ సేకరణ మాత్రమే చేయాల్సి ఉంటుంది. 100 ఎకరాల్లోపే అవసరం కాబట్టి రూ.300 కోట్లలోపు బడ్జెట్ సరిపోతుంది. ఒకవేళ భూ సేకరణ ఖర్చును కూడా కేంద్రం భరిస్తే ఆ మేర నిధులు కూడా ఖర్చు పెట్టాల్సిన అవసరం ఉండదు. కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాన్ని వెలువరించినా.. మెట్రో ప్రాజెక్టు పనులు ముందుకు సాగటానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.50 కోట్ల నిధులిచ్చింది.

అందరి బడ్జెట్!

వివిధ వర్గాల భిన్నస్వరాలు 6లో



డెల్టాకు దన్ను

బడ్జెట్‌లో రూ.400కోట్లు కేటాయింపు



స్నాతకోత్సవం

నగరంలోని సిద్దార్థ ప్రభుత్వ వైద్య కళాశాల 2019 బ్యాచ్ విద్యార్థుల స్నాతకోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సైన్స్, టెక్నాలజీ, మేధస్సు, శరీర శ్రమ కలిస్తే డాక్టర్ అవుతారని, వీటికి మానవత్వాన్ని జోడిస్తే మంచి వైద్యుడిగా మారతారని ఆయన విద్యార్థులకు హితవు పలికారు. 8లో

ఇంటర్‌కు సిద్ధం

నేటి నుంచి ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు

- సోమవారం నుంచి సెకండియర్
- ఉమ్మడి కృష్ణాజిల్లాలో 166 పరీక్షా కేంద్రాలు
- పటిష్ట బందోబస్తు నడుమ నిర్వహణ



నగరంలోని ఓ పరీక్షా కేంద్రానికి శుక్రవారం రాత్రే చేరుకుని హాల్ టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

విజయవాడ, ఆంధ్రజ్యోతి/మచిలీపట్నం టౌన్ : ఇంటర్ పరీక్షలకు సర్వంసిద్ధమైంది. శనివారం నుంచి మొదటి, సోమవారం నుంచి రెండో సంవత్సరం పరీక్షలు ప్రారంభంకానున్నాయి. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా అన్ని కేంద్రాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొదటి సంవత్సరం పరీక్షలకు 64,565 మంది, రెండో సంవత్సరం పరీక్షలకు 58,851 మంది హాజరుకానున్నారు. మొత్తం 166 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

ఎన్టీఆర్ జిల్లాలో... : మొదటి సంవత్సరం పరీక్షలకు 40,008 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 37,979 మంది హాజరుకానున్నారు. ఒకేషనల్ కోర్సులకు సంబంధించి మొదటి సంవత్సరం విద్యార్థులు 1,202 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1,083 మంది ఉన్నారు. జిల్లాలో పరీక్షల నిర్వహణకు 103 కేంద్రాలు సిద్ధం చేశారు. మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం నుంచి ఈనెల 14వ తేదీ వరకు జరుగుతాయి. 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను నియమించారు. గంపలగూడెంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని సమస్యాత్మకంగా గుర్తించారు. మొత్తం పరీక్షా కేంద్రాలను 13 జోన్లుగా విభజించారు. విజయవాడలో పరీక్షా కేంద్రాలను నాలుగు జోన్లుగా విభజించారు. ఇప్పటికే ప్రశ్నాపత్రాలు స్టోరేజ్ పాయింట్లకు చేరుకున్నాయి. జిల్లాలో 17 స్టోరేజ్ పాయింట్లు ఉన్నాయి. ఇందుకోసం 27 మంది కస్టోడియన్లను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా రెండు సిట్టింగ్ స్క్వాడ్‌లు, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు.

కృష్ణాజిల్లాలో.. : పరీక్షల నిర్వహణకు 63 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 40,060 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 24,557 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 20,879 మంది ఉన్నారు. పరీక్షా కేంద్రాలను 14 జోన్లుగా విభజించారు. 600 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. అత్యధికంగా పెనమలూరు జోన్‌లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. జిల్లాలో ఎలాంటి సమస్యాత్మక పరీక్షా కేంద్రాలు లేవు. పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయడానికి మూడు సిట్టింగ్, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను తాడేపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. పరీక్షా కేంద్రాల వద్ద బాలికల హాల్ టికెట్లను పరిశీలించేందుకు మహిళా పోలీసులను నియమించినట్టు ఇంటర్ జిల్లా అధికారి సాల్మన్‌రాజు తెలిపారు. అభ్యర్థులు ఉదయం 8.30 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. 9 గంటల నుంచి రానివ్వబోమని స్పష్టం చేశారు. ఆ కేంద్రాలకు సమీపంలోని ఫొటోస్టాట్ షాపులను తెరవొద్దని పోలీసులు ఇప్పటికే ఆంక్షలు విధించారు.

మల్లేశ్వరునికి ప్రత్యేక పూజలు



6లో

పింఛన్ల పంపిణీకి రూ.98.20 కోట్లు విడుదల

- జిల్లాలో 2,29,913 మందికి సజావుగా పంచండి
- అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ

8లో

అంతకుమించి..

ట్రాఫిక్ ఉల్లంఘనలకు నేటి నుంచి భారీ జరిమానాలు

- ఇప్పటివరకు హెల్మెట్ లేకపోతే రూ.135
- ఇకపై రూ.1,000.. వెనుక కూర్చున్న వారికీ తప్పనిసరి
- లైసెన్స్ లేకపోతే రూ.5 వేలు చెల్లించాల్సిందే..
- ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపితే రూ.1,500
- రెండోసారి పట్టుబడితే రూ.10 వేలు
- ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించండి : సీపీ



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : హెల్మెట్ డ్రైవ్ సత్ఫలితాలను ఇవ్వడంతో పోలీసులు జరిమానాల విషయంలో దూకుడు పెంచారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు రంగం సిద్ధం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన కొత్త మోటారు వెహికల్ చట్టంలో రూపొందించిన జరిమానాలను అమలు చేయడానికి సిద్ధమయ్యారు. శనివారం నుంచి పెరిగిన చార్జీలు అమలు చేయనున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

రూ.135 నుంచి రూ.1,000

ప్రస్తుతం నగరంలో హెల్మెట్ లేకుండా వాహనం నడిపిన వారికే జరిమానా విధిస్తున్నారు. కొత్తచట్టం ప్రకారం ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న ప్రయాణికుడికి హెల్మెట్ తప్పనిసరి. ప్రయాణికుడి హెల్మెట్ లేకపోయినా రూ.1,000 జరిమానా విధిస్తారు. దీన్ని ఇప్పటికిప్పుడు కాకుండా కొన్ని రోజుల తర్వాత అమలు చేయాలని పోలీసులు భావిస్తున్నారు. హెల్మెట్ ధరించని వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు ఇప్పటి వరకు రూ.135ను జరిమానాగా విధిస్తూ వచ్చారు. ఇతర ఉల్లంఘనలు ఉన్నప్పుడు ఆ జరిమానాను రూ.1,150 వరకు విధిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కొన్నాళ్ల క్రితమే కొత్తగా మోటారు వెహికల్ చట్టాన్ని తీసుకొచ్చింది. దీని ప్రకారం ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించిన జరిమానాలు హెచ్చుగా ఉన్నాయి. హెల్మెట్ లేకుండా వాహనం నడిపిన వారికి రూ.1,000 జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే రూ.10 వేలు విధిస్తారు. ఈ చట్టాన్ని రవాణా శాఖ అధికారులు మాత్రమే అమలు చేస్తున్నారు. అటు రవాణా శాఖ అధికారులు, ఇటు ట్రాఫిక్ పోలీసులు ఈ పరివాహన్ యాప్ ద్వారా ఈ జరిమానాలు విధిస్తున్నారు. అయితే, హెల్మెట్ లేని వాహనదారులకు రవాణా శాఖ అధికారులు రూ.1,000 జరిమానా విధిస్తుంటే, ట్రాఫిక్ పోలీసులు రూ.135 విధిస్తున్నారు. ఈ వ్యత్యాసం లేకుండా శనివారం నుంచి అధిక జరిమానాలే విధించాలని నిర్ణయించారు. విధించిన జరిమానాను 90 రోజుల్లోపు చెల్లించాలి. గడువు దాటిన, జరిమానాలు పెండింగ్‌లో ఉన్న 15 వేల వాహనాలను సీజ్ చేశారు. కాగా, పెరిగిన చార్జీలకు సంబంధించిన సమాచారాన్ని వాహనదారులకు తెలిసేలా కూడళ్లలో మైక్‌ల ద్వారా ప్రచారం చేస్తున్నారు.

ఉల్లంఘనలు	పెరిగిన జరిమానా
హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే..	రూ.1,000
వెనుక కూర్చున్న వ్యక్తికి హెల్మెట్ లేకపోతే..	రూ.1,000
బీమా లేకుండా వాహనం నడిపితే..	రూ.2,000 (మొదటిసారి) రూ.4,000 (రెండోసారి)
లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే..	రూ.5,000
కాలుష్య ధ్రువీకరణ పత్రం లేకపోతే..	రూ.1,500
ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపితే..	రూ.1,500 (మొదటిసారి) రూ.10,000 (రెండోసారి)
యూనిఫాం లేకుండా ఆటో నడిపితే..	రూ.150 (మొదటిసారి) రూ.300 (రెండోసారి)
సీటుబెల్టు ధరించకపోతే..	రూ.1,000 (డ్రైవర్‌కు) రూ.1,000 (కూర్చున్న వారికి)
ఫిట్‌నెస్, రిజిస్ట్రేషన్, రెన్యువల్ సర్టిఫికెట్ లేకపోతే..	రూ.2,000 (మొదటిసారి) రూ.5,000 (రెండోసారి)
అతివేగంగా వాహనం నడిపితే..	రూ.1,000
ట్రిపుల్ రైడింగ్‌కు..	రూ.1,000
రేసింగ్‌లు చేస్తే..	రూ.5,000 (మొదటిసారి) రూ.10,000 (రెండోసారి)





అందరి బడ్జెట్!

- ఆర్థిక ఇబ్బందులున్నా.. అభివృద్ధికి కేటాయింపులు
- మౌలిక రంగానికి ప్రాధాన్యతపై సంతృప్తి
- వ్యవసాయరంగానికి కేటాయింపులు
- కౌలు రైతుల సమస్యలు, ఉద్యోగుల బకాయిలపై స్పష్టత లేకపోవటంపై పలువురి అసంతృప్తి
- పారిశ్రామిక రంగం సంతృప్తి

ఆర్థిక ఇబ్బందులున్నా.. మౌలికం, వ్యవసాయ రంగాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపుల పట్ల హర్షం వ్యక్తమవుతోంది. అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలు దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయని వివిధ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. వ్యవసాయ బడ్జెట్‌పై అన్నదాతలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కౌలు రైతులు కొంత నిరుత్సాహంతో ఉన్నారు. పారిశ్రామిక విధానాలకు మద్దతుగా బడ్జెట్ కేటాయింపుపై ఆయా రంగాల ప్రముఖులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమలు నిలదొక్కుకోవటానికి సహాయపడుతుందని పారిశ్రామికవేత్తలు చెబుతున్నారు. చాలా తక్కువ సంఖ్యలో అసంతృప్తి ఉన్నప్పటికీ మొత్తంగా బడ్జెట్‌పై వివిధ వర్గాలు సంతృప్తి చెందుతున్నాయి.

పర్యాటకానికి భారీగా కేటాయింపులు



- ఆర్‌వీ స్వామి, ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

బడ్జెట్‌లో యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖకు రూ.469 కోట్లు కేటాయింపులు చేశారు. వీటిలో సగానికి పైగా నిధులు ఒక్క పర్యాటక రంగానికే కేటాయించారు. పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించారు. అఖండ గోదావరి, గండికోట వంటి ఐకానిక్ ప్రాజెక్టులు పర్యాటకరంగానికి అగ్రశ్రేణి గమ్యస్థానంగా రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపచేస్తున్నాయి. హోటల్స్ స్వచ్ఛతా ప్రమాణాలకు గ్రీన్ లీఫ్ రేటింగ్ లాడ్జీలు, ఇతర ఆతిధ్య సౌకర్యాలకు ర్యాంకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం, హోటల్స్‌కు జీఎస్టీ, విద్యుత్, రిజిస్ట్రేషన్ రుసుముల్లో రాయితీలు ఇచ్చేలా చర్యలు తీసుకోవడం, కొత్తగా ఏర్పాటు చేసే హోటల్స్‌కు రాయితీలు ఇచ్చే విధానం బాగున్నాయి.

అభివృద్ధి ఆధారిత బడ్జెట్

- పొట్లూరి భాస్కర్‌రావు, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు



సంక్షేమ కార్యక్రమాల కేటాయింపుతో అభివృద్ధి ఆధారిత బడ్జెట్. రాజధాని నిర్మాణానికి రూ.42,635 కోట్లు కేటాయించటాన్ని ఆహ్వానిస్తున్నాం. గడచిన నాలుగు సంవత్సరాలుగా మూలధనం వ్యయం రూ.40వేల కోట్లు కూడా లేదు. ఈ బడ్జెట్‌లో అమరావతి రాజధానికి, రూ.6,705 కోట్లు పోలవరానికి, రూ.3,165 కోట్లు పరిశ్రమలు, వాణిజ్యం కోసం, ఐటీ, ఎలక్ట్రానిక్ సంస్థల ప్రోత్సాహం కోసం రూ.300 కోట్లు, రహదారులకు రూ.4,620 కోట్లు, పోర్టులకు రూ.605 కోట్లు, విమానాశ్రయాలకు రూ2వేల కోట్లు, పీపీపీల కింద వయబులిటి గ్యాప్ ఫండింగ్ కోసం రూ.837 కోట్లు, పారిశ్రామిక కారిడార్‌లకు రూ13,600 కోట్లను కేటాయించటం ముదావహం. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి కార్యకాలపాలను ప్రోత్సహిస్తుంది.

అభివృద్ధి, సంక్షేమ రంగాలకు ప్రాధాన్యత

- గడ్డం బాల వెంకట రవికుమార్, విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు



రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ బడ్జెట్‌లో నిధులు కేటాయించటం అభినందనీయం. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అమరావతి పనులు పెద్దఎత్తున చేపడతామని చెప్పటం ముదావహం. కూటవి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి ఎంతో చిత్తశుద్ధితో బడ్జెట్‌ను రూపొందించింది.

అభివృద్ధికి ప్రాధాన్యత



- వక్కలగడ్డ భాస్కరరావు

అన్ని విధాలుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు జలవనరులు, రోడ్డు భవనాలు, పంచాయతీ, విద్యుత్, ఆరోగ్యం, వివిధ సంక్షేమ పథకాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం ముదావహం. వ్యాపార, వాణిజ్య, పారిశ్రామికాభివృద్ధికి రూ.3,196 కోట్లు కటాయించడం అభినందనీయం. అన్ని విధాలుగా మంచి, పెద్ద బడ్జెట్.

పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట

- మలినేని రాజయ్య, చైర్మన్, ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్



బడ్జెట్ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి పేద కుటుంబాన్ని పేదరికం నుంచి బయట పడేసేలా ఉంది. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన తదితర కేంద్ర ప్రభుత్వ రాయితీ పథకాలతో అనుసంధానం చేయడం ద్వారా ప్రజల జీవనోపాధి మెరుగుపడి తద్వారా రాష్ట్రం, దేశం ఆర్థిక పథంలో నడుస్తుంది. పెట్టుబడిదారులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడం ద్వారా వివిధ రంగాల్లో ఉపాధిని కల్పించే దిశగా ప్రభుత్వం దృష్టి సారించింది. దీనికోసం ప్రభుత్వం నూతన పారిశ్రామిక పాలసీ 4.0ను తీససుకొచ్చింది.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్

- ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు



రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ ప్రవేశపెట్టింది. వైసీపీ చేసిన విధ్వంసాల నుంచి వ్యవస్థలను పునరుద్దరిస్తూ అనేక సవాళ్లను, సంక్లిష్ట పరిస్థితులను అధిగమించి రాష్ట్రాన్ని పునర్నిర్మించేలా ప్రభుత్వం బడ్జెట్‌ను రూపొందించింది. వ్యవసాయ రంగంతో పాటు అన్ని రంగాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పించారు.

తలు అధిగమించేలా కేటాయింపులున్నాయి. వైసీపీ ప్రభుత్వం విధించిన పన్నులు తొలగిస్తూ కొత్త పన్నులు లేకుండా మంత్రి పెయ్యావుల బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు.

అన్ని వర్గాలకు సమన్యాయం

- బొండా ఉమామహేశ్వరరావు, సెంట్రల్ ఎమ్మెల్యే

దేశానికే ఆదర్శం

- తంగిరాల సౌమ్య, ఎమ్మెల్యే



కూటమి ప్రభుత్వ బడ్జెట్ దేశానికే ఆదర్శం. సంక్షేమం, అభివృద్ధి మేళవింపుతో బడ్జెట్ రూపొందించారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అద్భుతమైన బడ్జెట్ అందించారు. వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, బీసీ సంక్షేమం, ఎస్సీ సంక్షేమంకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. సూపర్ సిక్స్ హామీల అమలుకు ప్రభుత్వం సిద్ధమైంది.

చంద్రబాబు దూరదృష్టికి నిదర్శనం : కేశినేని చిన్ని



వన్‌టౌన్: రాష్ట్ర బడ్జెట్ ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థత, దూరదృష్టికి నిదర్శనమని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సిఎం చంద్రబాబు నాయకత్వంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ రూ.3.22 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన రాష్ట్ర వార్షిక బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉందన్నారు. గత అయిదేళ్లలో జరిగిన ఆర్థిక విధ్వంసం వల్ల అట్టడుగుకు వెళ్లిన రాష్ట్రాన్ని తిరిగి వేగంగా పునర్నిర్మాణం చేసే విధంగా అన్ని రంగాలకు రాష్ట్ర బడ్జెట్ 2025-2026లో కేటాయింపులు జరిగాయని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ తీర్చిదిద్దినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఆర్థిక మంత్రి పయ్యవుల కేశవ్, మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా రంజక బడ్జెట్

- వసంత కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే



ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ ఉంది. క్యాపిటల్ పేరుతో అభివృద్ధి పనులకు రూ.6 వేలకోట్లు కేటాయించారు. అన్నిరంగాలకు సమ ప్రాధాన్యతనిస్తూ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌తో అన్ని వర్గాలు పూర్తి సంతృప్తికరంగా ఉంటాయి. సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేలా బడ్జెట్ కేటాయింపులున్నాయి.

తెలుగుభాషాభివృద్ధికి పెద్దపీట

- మండలి బుద్ధప్రసాద్, ఎమ్మెల్యే



బడ్జెట్‌లో తెలుగుభాషాభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించటం హర్షణీయం. సూపర్ సిక్స్ హామీల అమలుకు నిధులు కేటాయించారు. బడ్జెట్‌లో పంచాయతీరాజ్, ఇరిగేషన్, విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యతనిచ్చారు. సంక్షేమంతోపాటు అభివృద్ధికి పెద్దపీట వేసింది. గత ప్రభుత్వ హయాంలో ధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే వినూత్న సృజనకు నాంది.

దూరదృష్టితో రూపొందించిన బడ్జెట్

- శ్రీరాం తాతయ్య, ఎమ్మెల్యే



బడ్జెట్‌ను పూర్తి దూరదృష్టితో రాష్ట్ర ప్రయోజనాలకు పెద్దపీట వేసి రూపొందించారు. అన్ని ముఖ్యశాఖలకు కేటాయింపులు ఉన్నాయి. అటు అభివృద్ధికి పెద్ద పీట వేస్తు ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చటానికి కేటాయింపులు జరిగాయి.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా

- గద్దె రామ్మోహన్, తూర్పు ఎమ్మెల్యే



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉంది. పేద, మధ్య తరగతి ప్రజలకు బడ్జెట్ ఊతం ఇస్తుంది. ప్రాంతీయ అసమాన



సంక్షేమం, అభివృద్ధి కలగలసిన బడ్జెట్. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేలా బడ్జెట్‌లో నిధులు కేటాయింపు ఉంది. ముఖ్యంగా సూపర్ సిక్స్ పథకాల అమలుకు బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి. మహిళలు, రైతులు, బీసీ వర్గాలతో పాటు సమాజంలో అన్ని వర్గాలతో పాటు రాజధాని అమరావతి అభివృద్ధికి కూడా సమన్యాయం చేసేలా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి.

వెనకబడిన వర్గాలకు ప్రాధాన్యం

- టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్



బడ్జెట్‌లో వెనకబడిన వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చింది. తల్లికి వందనం పథకం కింద ఎంత మంది పిల్లలు ఉన్నా ప్రతి ఒక్కరికీ రూ.15వేలు సంవత్సరానికి బడ్జెట్‌లో కేటాయించారు. బీసీల అభివృద్ధికి రూ.47,456 కోట్లు, మైనార్టీలకు రూ.5,434 కోట్లు, ఎస్సీలకు రూ.15వేల కోట్లు, ఎస్టీలకు రూ.8,159 కోట్లు కేటాయించటం అభినందనీయం.

రాష్ట్ర దశ దిశాను మార్చే బడ్జెట్

- నెట్టెం రఘురాం, విజయవాడ పార్లమెంట్ అధ్యక్షుడు



రాష్ట్ర దశదిశలను మార్చేదిలా రాష్ట్ర బడ్జెట్ ఉంది. పోలవరం పూర్తికి రూ. 6700 కోట్లు, తల్లికి వందనం కోసం రూ.9407 కోట్లు కేటాయించటం, ప్రతి ఒక్కరికి రూ.25 లక్షలు ఆరోగ్య బీమా వంటి విప్లవాత్మక పథకాలు ప్రగతిశీలంగా ఉన్నాయి.

అభివృద్ధి, సంక్షేమం..

- సామినేని ఉదయభాను

అభివృద్ధి సంక్షేమానికి రాష్ట్ర బడ్జెట్ పెద్ద పీట వేసింది. అన్నదాత సుఖీభవ కోసం రూ.6300కోట్లు, పీఎం కిసాన్ పథకం కోసం రూ.9400 కోట్లు, పంటల బీమా పథకానికి రూ.1023 కోట్లు, గ్రామీణాభివృద్ధికి రూ.18803 కోట్లు, అభివృద్ధి పథకాలకు నిధులతో పాటు, బీసీల సంక్షేమానికి రూ.47,456 కోట్లు, రూ.5,434 కోట్లు సూపర్ సిక్స్ పథకాల అమలుకు భారీగా కేటాయించటం హర్షణీయం.

సూక్ష్మ సేద్యంకు ప్రోత్సాహం



- కోట వీరబాబు, ఎన్ఎల్‌బీసీ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్

చంద్రబాబు దార్శినిక పాలనవల్ల దేశంలోనే తొలిసారి డ్రిప్ ఇరిగేషన్ రాష్ట్రంలోకి వచ్చింది. వైసీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. తిరిగి కూటమి ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రాధాన్యతనివ్వడం అభినందనీయం.

సాగుకు చేయూత..

- నెలకుదిటి నాగేశ్వరరావు, కృష్ణామిల్క్ యూనియన్ డైరెక్టర్



ఐదేళ్ల వైసీపీ పాలనలో అస్తవ్యస్త విధానాలతో కుదేలైన వ్యవసాయ రంగానికి కూటమి బడ్జెట్ ఊపిరి పోయనుంది. సాగుకు చేయూతనందించాలన్న ప్రభుత్వ లక్ష్యం ఈ బడ్జెట్‌లో ప్రతిబింబిస్తోంది. వ్యవసాయ రంగం పాధాన్యత చంద్రబాబుకు తెలిసినంతగా ఎవరికీ తెలియదు.

ప్రకటనలతో పరిమితం కారాదు

- చనుమోలు సైదులు, రైతు సంఘం నేత




వ్యవసాయ బడ్జెట్ అమలులో ప్రభుత్వం చిత్తశుద్ధిని చూపాలి. అన్నదాత సుఖీభవ పటిష్టంగా అమలు చేయాలి. ధరల స్థిరీకరణకు సాయం అందించాల్సి ఉంది. డ్రిప్ ఇరిగేషన్ తదితర ఆధునిక వ్యవసాయ పరికరాలపై సబ్సిడీని పెంచాలి.

డెల్టాకు దన్ను

- బడ్జెట్‌లో రూ.400కోట్లు కేటాయింపు
- ఆధునికీకరణను వదిలేసిన వైసీపీ
- ఐదేళ్లలో కేటాయింపులు శూన్యం
- తాజా కేటాయింపులతో రైతుల్లో హర్షం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఉమ్మడి ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందిస్తున్న కృష్ణా డెల్టా ఆధునికీకరణకు ప్రభుత్వం నిధులను కేటాయించింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో డెల్టా ఆధునికీకరణ అనాథలా మారింది. దానికి నిధులను కేటాయించడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కృష్ణా డెల్టాకు మొత్తం రూ.400 కోట్లు కేటాయించింది. ఇందులో ఆధునికీకరణకు రూ.300 కోట్లు కేటాయించగా, భూసేకరణ, ఆర్ అండ్ ఆర్‌కు మరో రూ.100 కోట్లు కేటాయించింది. 2014-17 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం డెల్టా ఆధునికీకరణపై



దృష్టి సారించింది. ఐదేళ్లపాటు నిధులు కేటాయించింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ సర్కారు జిల్లాలోని ప్రాజెక్టులను గాలికి వదిలేసింది. కనీసం నిర్వహణకు బడ్జెట్‌ను కేటాయించలేదు. కృష్ణా డెల్టా పరిధిలో 13.08లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. కృష్ణా జిల్లాలో 6.79లక్షల, గుంటూరు జిల్లాలో 4.99లక్షలు, ప్రకాశం జిల్లాలో 0.72లక్షలు, పశ్చిమగోదావరి జిల్లాలో 0.58లక్షల ఎకరాలు సాగులో ఉన్నాయి. బందరు కాల్వ కింద 1.51లక్షలు, కేఈబీ కింద 1.38లక్షలు, ఏలూరు కాల్వ కింద 57వేలు, పశ్చిమగోదావరి జిల్లాలో 58వేలు, రైవస్ కాల్వ కింద 3.33లక్షల ఎకరాలు సాగులో ఉన్నాయి. ప్రతి ఏడాది 152.95 టీఎంసీల సాగు, తాగునీరు అవసరమవుతోంది. తూర్పు డెల్టాకు 85.16, పశ్చిమ డెల్టాకు 67.78 టీఎంసీల నీరు అవసరమవుతోంది. ప్రకాశం బ్యారేజీకి అనుబంధం ఉన్న కాల్వలు, వాటి పరిధిలో ఉన్న మురుగునీటి కాల్వలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం రూ.400 కోట్లను కేటాయించడంతో ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు మేలు చేసేలా బడ్జెట్

- ఉయ్యూరు కాంతా రెడ్డి, రెడ్డిగూడెం(రైతు)



రైతులకు మేలు చేసేలా బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.48 వేలకోట్లు కేటాయించారు. పెట్టుబడి సాయంగా రూ.20 వేలు అన్నదాత సుఖీభవ పథకం కింద అందించాలనుకోవడం సంతోషం. రైతులకు ధాన్యం అమ్ముకుంటే 24 గంటల్లోపే రైతుల ఖాతాల్లో వేసిన ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని మరింత కేటాయింపులు చేసి రైతు పక్షపాతి ప్రభుత్వంగా మరోమారు నిరూపించుకుంది. **(ఆంధ్రజ్యోతి-విజయవాడ)**

ఆ న్యాయవాదులపై తొందరపాటు చర్యలొద్దు

- కేసు పూర్తి వివరాలు సమర్పించండి
- సోషల్ మీడియా అనుచిత పోస్టుల
- కేసులో పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతో పాటు పలువురిపై సోషల్ మీడియాలో అనుచిత, అసభ్యకర పోస్టులు పెట్టడంతో పాటు ఇతర గ్రూపులకు షేర్ చేశారన్న కేసులో వైసీపీకి చెందిన న్యాయవాదులు ఎం.మనోహర్‌రెడ్డి, పొనకా జనార్ధన్‌రెడ్డిపై రెండు వారాల పాటు ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. కేసు పూర్తి వివరాలు సమర్పించాలని పేర్కొంది. తదుపరి విచారణను మార్చి 10కి వాయిదా వేస్తూ న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. విజయవాడ పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ వైసీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు ఎం.మనోహర్‌రెడ్డి, లీగల్ సెల్‌లోని క్రియాశీలక న్యాయవాది జనార్ధన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాన్ని హైకోర్టు లంచ్‌మోషన్‌గా స్వీకరించి విచారణ జరిపింది. పిటిషనర్ల తరపున న్యాయవాది దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపించారు. అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో అరెస్టయిన నిందితుడు అవుతు శ్రీధర్‌రెడ్డి ఇచ్చిన నేరాంగీకార స్టేట్‌మెంట్ ఆధారంగా పిటిషనర్లను నిందితులుగా చేర్చారన్నారు. పిటిషనర్లు హైకోర్టులో న్యాయవాదులుగా ప్రాక్టీస్ చేస్తున్నారని, వారికి అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని కోరారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ స్పందిస్తూ.. సోషల్ మీడియాలో అసభ్యకర సందేశాలను పోస్ట్ చేయడమే కాక, ఇతర గ్రూపులకు పంపించారని పేర్కొన్నారు. పిటిషనర్లే అసభ్యకర పోస్టులను తయారు చేసి, వేరే వారికి షేర్ చేశారా? అనే దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

కోనేరు సత్యనారాయణకు హైకోర్టులో ఊరట

- న్యాక్ బృందానికి లంచం కేసులో
- షరతులతో ముందస్తు బెయిల్ మంజూరు

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): న్యాక్ బృందానికి లంచం కేసులో కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్(కేఎల్ఈఎఫ్) ప్రెసిడెంట్ కోనేరు సత్యనారాయణకు హైకోర్టులో ఊరట లభించింది. ఆయనకు షరతులతో ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రూ.50 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. దర్యాప్తునకు సహకరించాలని స్పష్టం చేసింది. ఈ కేసు సాక్ష్యలను బెదిరించడం, ప్రలోభపెట్టడం కానీ చేయడానికి వీల్లేదని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. కేఎల్ యూనివర్సిటీకి ఏ++ గుర్తింపు ఇచ్చేందుకు న్యాక్ బృందానికి లంచం ఇచ్చారని ఆరోపణలపై కోనేరు సత్యనారాయణతో పాటు యూనివర్సిటీ వీసీ, వైస్ ప్రెసిడెంట్, డైరెక్టర్, కొందరు న్యాక్ బృందం సభ్యులపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాదులు దుష్యంత్‌రెడ్డి, నర్రా శ్రీనివాస్ వాదనలు వినిపించారు. ఫోన్ రికార్డింగ్ సంభాషణలను ప్రాథమిక సాక్షాలుగా పరిగణించడానికి వీల్లేదన్నారు. యూనివర్సిటీ వ్యవహారాల్లో పిటిషనర్ క్రియాశీలకంగా లేరని పేర్కొన్నారు. పిటిషనర్ వయస్సు 70 ఏళ్ల పైగా ఉందని, ఆయన అనారోగ్య సమస్యల దృష్ట్యా ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. సీబీఐ తరఫున న్యాయవాది పీఎస్‌పీ సురేష్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. హోంశాఖ అనుమతితోనే పిటిషనర్, న్యాక్ సభ్యుల మధ్య ఫోన్ సంభాషణలు రికార్డు చేశామన్నారు. వివరాలను సీల్డ్ కవర్‌లో కోర్టు ముందు ఉంచామని, ఇప్పటికే అరెస్టయిన నిందితుల వాయిస్ నమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించామని తెలిపారు. న్యాక్ సభ్యులకు ఇచ్చిన ల్యాప్‌ట్యాప్‌లు, ఫోన్లు, బంగారు ఆభరణాలు యూనివర్సిటీ పేరు మీద కొనుగోలు చేశారన్నారు. పిటిషనర్ ప్రభావితం చేయడంతో విక్రయదారులు దర్యాప్తునకు సహకరించడం లేదని పేర్కొన్నారు. పిటిషనర్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తునకు ఆటంకం కలుగుతుందని, పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు.

మల్లేశ్వరునికి ప్రత్యేక పూజలు

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి పాంచాహ్నిక దీక్ష సేవలలో శుక్రవారం మండపారాధన, కలశారాధన, మూలమంత్ర హవనాలు, హారతి, మంత్రపుష్పం, తీర్ధ ప్రసాద వినయోగం తదితరాల అనంతరం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం వేద మంత్రాల మధ్య పూర్ణాహుతి, అనంతరం ధాన్యాన్ని దంచి స్వామివారికి సమర్పించారు. గంగా, పార్వతీ మల్లేశ్వరుల కళ్యాణోత్సవ కార్యక్రమాల్లో భాగంగా వసంతోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను మేళ, తాళాల మధ్య దుర్గాఘాట్ వద్దకు తీసుకువెళ్లి పవిత్ర కృష్ణానదిలో అవభృదోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఈవో కె.రామచంద్రమోహన్, స్థానాచార్యుడు వి.శివప్రసాద్‌శర్మ, వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు. శనివారం నుంచి సోమవారం వరకు మూడు రోజుల పాటు రాత్రి 7 గంటల నుంచి ద్వాదశ ప్రదక్షణలు, పవళింపు సేవలు జరుగుతాయి.



ఉత్సవమూర్తులకు కృష్ణానదిలో పవిత్ర స్నానం చేయిస్తున్న అర్చకులు, వేద పండితులు

తొలిపద్దు పొడిచింది

(5వ పేజీ తరువాయి)

15 శాతం వాటాగా చెల్లింపులు, ఇతర నిర్వహణ అంశాలకు సంబంధించి రూ.100 కోట్లు కేటాయింపులు జరిపింది.

మౌలిక రంగం.. ఇక వేగం

మౌలిక రంగ ప్రాజెక్టులు పరుగులు పెట్టేందుకు వీలుగా భూ సేకరణలకు ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది. విజయవాడలో మెట్రోరైల్ ప్రాజెక్టుతో పాటు విజయవాడ-నాగపూర్ ఎకనమిక్ కారిడార్‌లో భాగంగా జక్కంపూడి-ఖమ్మం వరకు 30 కిలోమీటర్ల నాలుగు వరసల గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సంబంధించి ఉన్న స్వల్ప భూ సమస్యల పరిష్కారానికి సైతం మార్గం సుగమమైంది.

జల్‌జీవన్‌ను జేజేలు

జల్‌జీవన్ మిషన్ స్కీమ్‌లో భాగంగా ఉమ్మడి కృష్ణాజిల్లాలో రూ.6 వేల కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వాటర్ గ్రిడ్ పథకంలో భాగంగా ఈ మేరకు అంచనాలు వేశారు. మొదటి విడతగా జల్‌జీవన్ మిషన్ స్కీమ్‌కు తన మ్యాచింగ్ గ్రాంట్‌గా రూ.2,800 కోట్ల కేటాయింపులు జరపటంతో ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఉన్న అత్యవసర పరిస్థితుల రీత్యా రూ.500 కోట్ల వరకు నిధుల కేటాయింపులు జరిగే అవకాశం ఉంది. ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణాజిల్లాకు మంచి నీటి సరఫరాకు సంబంధించిన ప్రాజెక్టుకు అడుగులు పడనున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో బ్యాలెన్స్ పనులకు మార్గం సుగమం కానుంది. రెండు జిల్లాల్లో తలసరి నీటి వినియోగ పెంపునకూ ఇది దోహదపడుతుంది.

ఐటీ.. రిటర్న్

రాష్ట్ర విభజన అనంతరం నవ్యాంధ్రలో ప్రధానంగా విజయవాడ, కేసరపల్లి వంటి ప్రాంతాల్లో ఐటీ పరిశ్రమల జోష్ నెలకొంది. తాజాగా ఐటీ , ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు ప్రభుత్వం ఇన్సెంటివ్స్‌ను ప్రకటించడంతో కొత్త ఐటీ పరిశ్రమలకు మార్గం ఏర్పడింది. వైసీపీ హయాంలో ఇన్సెంటివ్‌లను రద్దు చేయటంతో ఐటీ పరిశ్రమలు కుదేలయ్యాయి. చాలావరకు వెనక్కి వెళ్లిపోయాయి. తాజా బడ్జెట్‌లో ఇన్సెంటివ్‌లను ప్రకటించటంతో విజయవాడలో గతంలో ఖాళీ అయిన ఐటీ కాంప్లెక్స్‌లలో కొత్త స్టార్టప్‌లకు అవకాశం కలగనుంది. కేసరపల్లిలోని ఏస్ అర్బన్- ఏపీఐఐసీ హైటెక్ సిటీలో కూడా ఖాళీ అయిన స్థానంలో కొత్తగా ఐటీ పరిశ్రమల ఏర్పాటుకు దారులు పరుచుకున్నాయి. దీంతో పాటు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఐటీ మంత్రిగా ఉన్న నారా లోకేశ్.. గన్నవరంలోని మేథ టవర్ పక్కనే మరో టవర్‌కు శంకుస్థాపన చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే దీని నిర్మాణం పూర్తయింది. గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వం ఇబ్బందులు పెట్టడం వల్ల చిన్నచిన్న పనులు పూర్తికాలేదు. ఇన్సెంటివ్‌ల ప్రకటనతో కొత్త సంస్థలు వచ్చే అవకాశం ఉండటంతో ఈ టవర్ కూడా పూర్తయ్యే అవకాశముంది.

అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు అవకాశం

- జూన్ 30 వరకు గడువు

విజయవాడ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : నిర్దేశిత లోడ్‌తో విద్యుత్ కనెక్షన్ తీసుకుని దానికి మించి ఉపయోగిస్తున్న లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవడానికి అవకాశం ఇస్తున్న సీపీడీసీఎల్ ఎస్ఈ సాంబశివరావు తెలిపారు. విద్యుత్ కనెక్షన్ తీసుకునేటప్పుడు దరఖాస్తులో పేర్కొన్న లోడ్ కాకుండా అదనంగా ఉపయోగిస్తున్న వారు 50 శాతం రాయితీ క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని పేర్కొన్నారు. క్రమబద్ధీకరణకు శనివారం నుంచి జూన్ 30 వరకు గడువు ఉందని స్పష్టం చేశారు.



వ్యవసాయ రంగానికి ఊతం

(కంచికచర్ల - ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో వ్యవసాయ, అనుబంధరంగాలకు పెద్ద పీట వేసింది. ఉమ్మడి జిల్లాలో రైతులకు మేలు జరిగే విధంగా పలు పథకాలకు భారీగా నిధులు కేటాయించారు. ప్రభుత్వం మంచి ఊతం ఇవ్వటం వల్ల వ్యవసాయ రంగంలో మెరుగైన ఫలితాలు నమోదవుతాయంటూ రైతులు హర్షం వెలిబుచ్చుతున్నారు. అయితే గిట్టుబాటు ధరలు లభించక నష్టపోతున్నందున ధరల స్థిరీకరణకు ప్రత్యేకంగా కొంత కేటాయింపు చేసినట్లయితే బాగుండేదని రైతులు అభిప్రాయపడుతున్నారు. వివిధ పథకాలకు కేటాయింపులు ఈవిధంగా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయటం వల్ల వ్యవసాయ రంగం కుదేలైంది. ఈ రంగానికి కొత్త ఊపిరి ఊదుతూ కూటమి ప్రభుత్వం భారీగా కేటాయింపులు చేసింది. ప్రధాన వనరైన వ్యవసాయాన్ని ప్రాథమిక రంగంగా గుర్తించి, రైతులను ఆర్థికంగా స్థితిమంతులను చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొనటం విశేషం. వ్యవసాయంలో ఆధునిక నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పాటుగా డ్రోన్లు వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ నుంచి అమలు చేయనున్న అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం అమలుకు నిధులు కేటాయించారు. ఈపథకం ద్వారా రైతులకు ఏడాదికి రూ. 20 వేల వంతున సాయం అందనున్నది. ఈ ఏడాది భూసార పరీక్షలు భారీగా చేయాలని నిర్ణయించారు. వ్యవసాయం లాభసాటిగా ఉంటేనే రాష్ట్రం త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని పేర్కొన్న మంత్రి అచ్చెన్నాయుడు అధిక ఆదాయం వచ్చే పంటలను రైతులు పండించాలని కోరటం విశేషం.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	100,109, 120
చికెన్ విత్ స్కిన్	190
చికెన్ స్కిన్‌లెస్	200

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 485

వ్యవసాయానికి రూ.48వేల కోట్లు శుభపరిణామం : సదర్ ఉద్దీన్

వన్‌టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.48వేల కోట్లు కేటాయించటం శుభపరిణామమని ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎండీ సదర్ ఉద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే అన్న క్యాంటీన్లు 200 ప్రారంభించారని, అయినా పేదలకు మరిన్ని అన్న క్యాంటీన్లు ప్రారంభించాలన్నారు. మెగా డీఎస్సీపై స్పష్టత ఇవ్వాలన్నారు. మైనార్టీ సంక్షేమానికి రూ.5,434 కోట్లు కేటాయించటం తక్కువేనన్నారు. బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టు గురించి మంచి ఆలోచన చేశారని ఆయన కొనియాడారు.

పరిశ్రమల సర్వే వేగవంతం చేయండి

పరిశ్రమల శాఖ, వివిధ సమన్వయ శాఖల అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక యూనిట్ల (ఎంఎస్ఎంఈ) ప్రస్తుత పరిస్థితిని క్షుణంగా తెలుసుకొని అవి ప్రగతిపథంలో నడిపించేందుకే ప్రభుత్వం ప్రత్యేక సర్వే చేస్తోందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. చిరు వ్యాపారులు, పరిశ్రమలు సత్వరం తమ వివరాలను మార్చి 15 లోగా అందించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ లక్ష్మీశ, కలెక్టరేట్‌లో ఎంఎస్ఎంఈ సర్వే పురోగతిపై పరిశ్రమల శాఖతో పాటు వివిధ సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక యూనిట్ల సమాచారాన్ని సేకరించి ఎంఎస్ఎంఈ యాప్‌లో పొందుపరిచి ఆపై విశ్లేషించి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఓ మంచి కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక ప్రణాళిక, కార్యాచరణతో సర్వేను విజయవంతంగా పూర్తిచేసేందుకు చొరవ చూపాలని స్పష్టం చేశారు.

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోండి

వేసవికాలంలో ప్రజలు, పశుపక్ష్యాదులకు నీటి ఎద్దడి సమస్య అనేది తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం కలెక్టరేట్‌లో గ్రామీణ నీటిసరఫరా, ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటికి ఇబ్బంది పడుతున్న గ్రామాలను గుర్తించే పని ప్రారంభించాలని ఆదేశించారు. మండలాలు, గ్రామాలు, మారుమూల పల్లెటూర్లలో సైతం ప్రభుత్వపరంగా, స్వచ్ఛంద సంస్థల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేసేలా అధికారులు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. తాగునీటి పైపులైన్ల మరమ్మతు ప్రాంతాలు గుర్తించి తక్షణమే పనులు పూర్తి చేయాలన్నారు. వడగాల్పులు ఏర్పడినప్పుడు ప్రజలు ఆరోగ్యంపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచారం కల్పించాలని ఆదేశించారు. తాగునీరు పరంగా ఇబ్బందులు వుంటే 0866-2575882, 9154970454 నంబర్లలో సంప్రదించవచ్చని కలెక్టర్ సూచించారు.

హెల్మెట్ ధరించకపోతే రూ. వెయ్యి జరిమానా

నేటి నుంచి అమలు

ట్రాఫిక్ సీఐ రామారావు

పటమట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ ఉల్లంఘనులకు భారీగా జరిమానాలు విధించనున్నారని, శనివారం నుంచి భారీగా పెరిగిన జరిమానాలను అమలు చేయనున్నట్లు నాలుగవ పట్టణ ట్రాఫిక్ సీఐ రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెల్మెట్ లేని ప్రయాణానికి రూ.1,000లు, వెనుకఉన్న వ్యక్తి రూ.1,000లు, లైసెన్స్ లేని వారికి రూ.5 వేలు, బీమా లేని వాహనానికి మొదటిసారి రూ.2 వేలు, రెండోసారి రూ.4 వేలు, కాలుష్య సర్టిఫికెట్ లేకుంటే రూ.1,500లు, డ్రైవింగ్ చేస్తూ సెల్ మాట్లాడితే మొదటిసారి రూ.1,500లు, రెండోసారి రూ.10 వేలు, యూనిఫాం లేకుండా డ్రైవింగ్ చేస్తే మొదటిసారి రూ.150లు, రెండోసారి రూ.300లు, చెకింగ్ అధికారికి అడ్డగిస్తే రూ.750లు, సీటు బెల్ట్ ధరించని డ్రైవర్‌కు రూ.1,000, పక్కనున్న వ్యక్తికి రూ.1,000లు, రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్‌లేని వారికి మొదటి సారి రూ.2 వేలు, రెండోసారి రూ.5 వేలు, ట్రిపుల్ రైడింగ్ రూ.1,000లు అపరాధ రుసుం విధిస్తామని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి అపరాధ రుసుంకు దూరంగా ఉండాలన్నారు.

ఓపెన్ ఫోరంలో సందేహాలను నివృత్తి చేసుకోండి

చీఫ్ సిటీ ప్లానర్ ప్రసాద్



ఓపెన్ ఫోరంలో దరఖాస్తు దారులతో మాట్లాడుతున్న ఏసీపీ మోహన్‌బాబు

కార్పొరేషన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూడు సర్కిల్స్‌లో ప్రతి శుక్రవారం నిర్వహించే ఓపెన్ ఫోరంలో ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్(ఎల్ఆర్ఎస్), బిల్డింగ్ పెనలైజేషన్ స్కీమ్ (బీపీఎస్) స్కీమ్‌లకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేసుకోవచ్చునని చీఫ్ సిటీ ప్లానర్ ప్రసాద్ అన్నారు. ఎల్ఆర్ఎస్, బీపీఎస్ స్కీమ్‌లో దరఖాస్తు చేసుకున్న పలువురు సందేహాలను ప్లానింగ్ అధికారులు తీర్చారు. అలాగే ఆక్రమణలను తొలగించడంతో పాటు, పోల్స్, డివైడర్లపై అనధికారంగా బ్యానర్లను ఏర్పాటు చేస్తే తొలగించడంతోపాటు అపరాధ రుసుం వసూలు చేయనున్నట్టు తెలిపారు. లయోలా కళాశాల రోడ్డు, బీఆర్‌టీఎస్ రోడ్లలో ఆక్రమణలను ప్లానింగ్ సిబ్బంది తొలగించారన్నారు. ఓపెన్ ఫోరంలో సర్కిల్-1 డీసీపీ చంద్రబోస్, సర్కిల్-2 ఏసీపీ రాంబాబు, సర్కిల్ -3 ఏసీపీ మోహన్‌బాబు పాల్గొన్నారు.

దాసాంజనేయస్వామి దేవస్థానంలో సీల్డ్ టెండర్లకు ఆహ్వానం

గుణదల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): దాసాంజనేయస్వామి ఆలయంలో పలు వస్తువుల సరఫరాకై సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు మాచవరం దాసాంజనేయ స్వామి ఆలయ కార్యనిర్వహణ అధికారిణి పాతూరి లోకేశ్వరి తెలిపారు. సీల్డ్ టెండర్లు మార్చి 11లోగా అందేలా చూడాలన్నారు. మార్చి 12న ఉదయం 10గంటలకు టెండర్లు ఓపెన్ చేయడం జరుగుతుందని తెలిపారు. టెండర్ షెడ్యూల్ కొరకు డీడీ రూపంలో రెండు వందలు చెల్లించి షెడ్యూళ్లు పొందాల్సి ఉంటుందని చెప్పారు. స్వామి లాకెట్, చేతి కంకణాలు, లామినేషన్ ఫొటోలు, రౌండ్ స్టిక్కర్లు, పువ్వుల దండలు ఏడాది సరఫరా చేయడానికి ఆసక్తిగల వారు టెండర్లు వేసుకోవాలని కోరారు. టెండరు దార్లు ఆధార్, పాన్ కార్డు, ఫోన్‌నెంబరు, వస్తు సేవల పన్ను ఖాతా నెంబరు (జి.ఎస్.టి) కలిగిన కార్డు నకళ్లను దేవస్థాన కార్యాలయంలో సమర్పించాలని చెప్పారు. వివరాలకు మాచవరం దాసాంజనేయస్వామి ఆలయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

విజ్ఞానం పెంపుదలకు సైన్స్ ప్రదర్శనలు



ఎక్స్‌పోలో విద్యార్థినులు

మొగల్రాజపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురం కొమ్మారెడ్డి సీతారామయ్య సిద్ధార్థ ఫార్మశీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఫార్మాక్విజ్, ఫార్మా హ్యాక్, ప్రకృతి సిద్ధ సౌందర్యసాధనాల ఎక్స్‌పో వంటి పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డార్విన్ ఫార్ములేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ టి.రామిరెడ్డి, లైలా న్యూట్రాస్యూటికల్స్ మేనేజింగ్ డైరెక్టర్ గోకరాజు ఆదిత్యవర్మ పాల్గొని జాతీయ సైన్స్‌డే విశిష్టత వివరించారు. విజ్ఞానం పెంపుదలకు సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదం చేస్తాయన్నారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ సుప్రియ నిర్వహిం చగా. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సునీత, కన్వీనర్ చుక్కపల్లి అరుణ్‌కుమార్, ఫార్మాస్యూటిక్స్ హెడ్ డాక్టర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

లయోలాలో ....

భారతీనగర్: ఆంధ్రా లయోలా కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లీష్ ఆధ్వర్యంలో కళాశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ ప్రభుదాస్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్ హెడ్ డాక్టర్ తుమ్మల శ్రీకుమార్ లు విద్యార్థులకు జాతీయ సైన్స్ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. వికసిత్ భారత్‌లో గ్లోబల్ లీడర్‌షిప్ కోసం యువతకు సాధికారత కల్పించడం అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ బి.రాజు బహుమతులను అందజేశారు.

అనంతరం జానపద గాయకుడు రంగం రాజేష్, అతని బృందం సైన్స్‌కు సంబంధించిన పాటలు పాడారు. డీన్ డాక్టర్ ఎల్.శుభ, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ పి.వి.ఎస్.సాయిరామ్, విభాగాధిపతులు,విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్యలో...

పటమట,: పటమట శ్రీ చైతన్య పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు పలు సైన్స్ నమూనాలు ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా స్టెల్లా కళాశాల ప్రొఫెసర్ శాంత కుమారి పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ఇన్‌చార్జి పద్మ, మద్దిలేని మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ కొల్లి సునీత, అకడమిక్ డీన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



డాక్టర్ జల్లేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

డాక్టర్ జల్లేపల్లికి ఘననివాళి

పటమట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ జల్లేపల్లి అజయ్‌కుమార్ ఘోష్ 15వ వర్ధంతి ఎస్ఎస్ఎం స్కూల్ వద్ద సీపీఐ నగర సహాయ కార్యదర్శి లంకా దుర్గారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ అజయ్‌కుమార్ కమ్యూనిస్టు కుటుంబంలో పుట్టి డాక్టర్ వృత్తిని చేపట్టి ఉచిత వైద్య సేవలందిస్తూ ప్రతి ఒక్కరి మనస్సుల్లో చిరస్మరణీయుడిగా నిలిచిపోయాడన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు వీరంకి గోపాలరావు, కె.ఆర్ అంజనేయులు, చంద్రనాయక్, దోనేపూడి సూరిబాబు, బిట్ర ధనరాజు, లంక ప్రసాద్, నాగమణి, వీరంకి డాంగియా కుమారి, వెంకటేశ్వరరావు, డాక్టర్ స్వర్ణకుమారి పాల్గొన్నారు.



పదవీ విరమణ చేసిన సిబ్బందికి వీడ్కోలు పలుకుతున్న అడ్మిన్ డీసీపీ కేజీవీ సరిత, ఏవో సునీత, ఏఆర్ డీసీపీ ప్రసాదరావు తదితరులు

శేషజీవితం ఆనందంగా గడపండి

● అడ్మిన్ డీసీపీ కేజీవీ సరిత

గుణదల, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కుటుంబానికి దూరంగా ఉంటూ విధి నిర్వహణకే ఎక్కువ సమయం కేటాయించిన సిబ్బంది వారి శేషజీవితం ఆనందంగా గడపాలని కోరుకుంటున్నట్లు అడ్మిన్ డీసీపీ కేజీవీ సరిత తెలిపారు. నగర పోలీస్ కమిషనరేట్లో పనిచేసి పదవీ విరమణ చేసిన ఇద్దరు ఏఎస్ఐలు, హోంగార్డుకు వీడ్కోలు కార్యక్రమం సీపీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అడ్మిన్ డీసీపీ సరిత ముందుగా పదవీ విరమణ సిబ్బందికి పూలమాల వేసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన వారు ఇక మీదట కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడిపి ఆరోగ్యవంతంగా శేషజీవితంగా ఆనందంగా గడపాలని మనసారా భగవంతుడిని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో సునీత, ఏఆర్ ఏసీపీ డి. ప్రసాదరావు, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరావు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

● నవజీవన్ బాలభవన్ జోనల్ కో-ఆర్డినేటర్ జాకబ్‌రాజు

లబ్బీపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు ప్రాణాంతకమైనవని, వాటిపై అవగాహన పెంచుకుని దూరంగా ఉండాలని నవజీవన్ బాలభవన్ జోనల్ కో-ఆర్డినేటర్ ఎస్. జాకబ్‌రాజు అన్నారు. బిషప్ హజరయ్య పాఠశాలలో శుక్రవారం నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలిసో తెలియకో మత్తు పదార్థాల బారిన పడితే అవి ప్రాణాంతకమేనని, స్నేహితులు, మరే ఇతర వ్యక్తులు మాదక ద్రవ్యాలపై ప్రలోభపెడితే వద్దని చెప్పాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వలన సంభవించే వ్యాధులను, అనారోగ్య సమస్యలను స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. జోనల్ కో-ఆర్డినేటర్ ఎస్.కె నజ్మా, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు వివరిస్తున్న జాకబ్‌రాజు

వీవీకేఆర్ఎంపై ఎవరెస్ట్ సీసీ గెలుపు

విజయవాడ(స్పోర్ట్స్),ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మూలపాడు గ్రౌండ్స్‌లో జరుగుతున్న దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ బి లీగ్ మ్యాచ్‌లలో శుక్రవారం రెండు మ్యాచ్‌లు జరిగాయి. ఎవరెస్ట్‌సీసీ, వీవీకేఆర్ఎం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్ చేసిన వీవీకేఆర్ఎం జట్టు 46.5ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 194పరుగులు చేసింది. ఎవరెస్ట్‌సీసీ జట్టు 34.5ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 195పరుగులు చేసి విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో కొండపల్లి, రైల్వే జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన కొండపల్లి జట్టు 49.5ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 268పరుగులు చేసింది. బ్యాటింగ్ చేసిన రైల్వే జట్టు 42.3ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 187పరుగులు చేసి ఓటమి పాలైంది.

పేదల ఆరోగ్యానికి కూటమి పెద్దపీట

● దుప్పట్లు అందజేసిన గద్దె కాంత్రికుమార్



దుప్పట్లు అందజేస్తున్న గద్దె క్రాంతికుమార్

కృష్ణలంక, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) :పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలుగు యువత విభాగం నాయకుడు గద్దె క్రాంతికుమార్ తెలిపారు. 22వ డివిజన్ అధ్యక్షుడు పలిశెట్టి అన్నారావు ఫ్రెండ్ సర్కిల్ సహకారంతో సుమారు రూ.20 వేల విలువ చేసే బెడ్‌షీట్లు, డోర్‌కర్టన్స్, ఇతర సామాగ్రిని శుక్రవారం ఉదయం డివిజన్‌లోని దోబీఖానా దగ్గర వున్న ప్రభుత్వ ఆయుష్మాన్ భవన్ హాస్పటల్‌లో గద్దె క్రాంతికుమార్ చేతుల మీదుగా ఆసుపత్రి సిబ్బందికి అందచేశారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ ఆస్పత్రికి అవసరమైన సామాగ్రిని తమ పార్టీ నాయకులు స్వంత నిధులతో కొనుగోలు చేసి అందజేయడం చాలా సంతోషంగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెద్ది అన్నారావు, వేముల దుర్గారావు, మోటేపల్లి చిన్నా, వేములపల్లి రంగారావు, తోట శ్రీను, బాలబొమ్మ రంగా, తగరంపూడి మల్లి తదితరులు పాల్గొన్నారు.



ముగిసిన ఇంధన సంరక్షణ ప్రచారం

లబ్బీపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంధన సంరక్షణ, పెట్రోలియం ఉత్పత్తుల పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గత 15 రోజుల పాటు పలు ప్రచార కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయిల్ ఇండస్ట్రీ రాష్ట్ర స్థాయి సమన్వయ కర్త వి. వేణుమాధవ్ తెలిపారు. భారత ప్రభుత్వ పెట్రోలియం అండ్ సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వార్షిక ప్రధాన ఇంధన సంరక్షణ ప్రచార కార్యక్రమం ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు నిర్వహించారు. ఈ ప్రచార ముగింపు కార్యక్రమం ఫార్ప్యూన్ మురళి హోటల్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వేణుమాధవ్. గ్యాస్ ఆధారిత ఇండియా లిమిటెడ్ విజయవాడ డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.ఎస్ తివారీ మాట్లాడారు. బీపీసీఎల్ డివిజనల్ ఎల్‌పీజీ సేల్స్ హెడ్ సీపీ వేణుగోపాల్ కంపెనీ ప్రతినిధులు, డీలర్లు పాల్గొన్నారు.

నేడు, రేపు సదరన్ ఇండియా ప్రాంతీయ సమావేశం

లబ్బీపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవలో తమ సంస్థ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు వెళుతుందని సదరన్ ఇండియా రీజనల్ గ్రాండ్ మాస్టర్ టి.ఎన్ మనోహరన్ పేర్కొన్నారు. లబ్బీపేటలోని జీఆర్‌టీ హోటల్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాంతీయ గ్రాండ్ లాడ్జ్ సమావేశం శని, ఆదివారాలు రెండు రోజుల పాటు ఎస్.ఎస్ కన్వెన్షన్‌లో జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో దేశం నలుమూలల నుంచి 1200 మందికి పైగా సభ్యులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి రూ.98.20 కోట్లు విడుదల

- జిల్లాలో 2,29,913 మందికి సజావుగా పంచండి
- అధికారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2,29,913 మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసేందుకు రూ.98.20 కోట్లు విడుదల చేశామని, క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేసి సజావుగా పంపిణీ చేయాలని అధికారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. శుక్రవారం డీఆర్డీయే పీడీ, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో పింఛన్ల పంపిణీపై కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. శనివారం ఉదయం 7 గంటలకు పంపిణీ ప్రారంభించి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. రెండో తేదీ ఆదివారం కావున 3వ తేదీ నాటికి 100 శాతం పంపిణీ పూర్తిచేయాలన్నారు. లబ్ధిదారుల ఇళ్ల వద్ద నుంచి 300 మీటర్ల కంటే ఎక్కువ దూరంలో పంపిణీ చేయాల్సి వస్తే అందుకు కారణాన్ని ఎన్టీఆర్ భరోసా మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు సమావేశం ఏర్పాటు చేసే పింఛన్ల పంపిణీ వివరాలను సిబ్బందికి తెలియజేయాలని, పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, డీఆర్డీయే పీడీ కె.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, తిరువూరు ఆర్డీవో కె.మాధురి, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ప్రజాభిప్రాయ సేకరణ

- సున్నపురాయి తవ్వకంపై జయంతిపురం గని వద్ద సమావేశం నిర్వహించిన అధికారులు


మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

జగ్గయ్యపేట రూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): జయంతిపురం ఈస్ట్ ల్యాండ్ సున్నపురాయి గనుల నుంచి ఏడాదికి 108.17 హెక్టార్లలో 1.2 మిలియన్ టన్నుల సున్నపురాయి తవ్వకం కోసం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పర్యావరణ సంబంధిత ప్రజాభిప్రాయ సేకరణ ప్రశాంతంగా ముగిసింది. జయంతిపురం గని ప్రాంతంలో కలెక్టర్ లక్ష్మీశ, పర్యావరణ శాఖ ఈఈ శ్రీనివాస్, నందిగామ ఆర్డీవో బాలకృష్ణ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించి ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. పరిసర గ్రామాల అభివృద్ధికి కర్మాగారాల యాజమాన్యాలు కృషి చేయాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని కలెక్టర్ సూచించారు. ఫ్యాక్టరీ విస్తరణతో పాటు ఉద్యోగాలు కల్పించడం, చెట్లు నాటి, అభివృద్ధికి సహకరించాలని సమావేశంలో పలువురు మాట్లాడారు. కంపెనీ ప్రెసిడెంట్ ఆశిష్ కుమార్, జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, తహసీల్దార్ మనోహర్, శ్రీరాం చిన్నబాబు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే తాతయ్య, పూటీ లాగుతున్న ఎడ్లు

పూటీ లాగుడు పోటీలు ప్రారంభం

నందిగామ రూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) పేర్కొన్నారు. మహాశివరాత్రి సందర్భంగా దాములూరు కూడలి గ్రామంలో రైతు కమిటీ ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలస్థాయిలో నిర్వహిస్తున్న ఎడ్ల పూటీ లాగుడు పోటీలను శుక్రవారం రాత్రి వారు ప్రారంభించారు. ముందుగా స్వామికి పూజలు చేశారు. జూనియర్ విభాగంలో 19 జతలు పాల్గొన్నాయని రైతు కమిటీ సభ్యులు తెలిపారు. జూనియర్ విభాగంలో 1.5 క్వింటాళ్ల బరువు, ఎనిమిది నిమిషాల సమయం, ఆరుగురితో అర్ధరాత్రి వరకు సాగాయి.

అమరావతి రాజధాని ప్రాజెక్టులను పర్యవేక్షించనున్న సుర్బానా జురాంగ్, నైట్ ఫ్రాంక్

విజయవాడ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో అభివృద్ధి, ప్రాజెక్టుల పనులన్నింటినీ పర్యవేక్షించటం కోసం ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ(పీఎంసీ)లుగా సుర్బానా జురాంగ్, నైట్ ఫ్రాంక్‌లు వ్యవహరించనున్నాయి. సీఆర్‌డీఏ కార్యాలయంలో ఆ సంస్థలతో ఉన్నతాధికారులు ఒప్పందం చేసుకున్నారు. రాజధానిలో సీఆర్‌డీఏ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏడీసీఎల్)లు వివిధ ప్రాజెక్టులకు సంబంధించి టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థల పనులను ఈ కన్సల్‌టెంట్ బృందం పర్యవేక్షిస్తుంది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల ఆర్థిక సహకారంతో రాజధానిలో జరగనున్న నిర్మాణ పనుల్లో ప్రమాణాలు, నిబంధనలు అమలు పరిచే బాధ్యతలను సుర్బానా, నైట్ ఫ్రాంక్‌ల పీజీఎంసీ బృందం తోడ్పాటు అందించనుంది. శుక్రవారం సీఆర్‌డీఏ కార్యాలయంలో సుర్బానా, నైట్‌ఫ్రాంక్‌లతో ఒప్పందం జరిగింది. సీఆర్‌డీఏ తరఫున అదనపు కమిషనర్ (అడ్మినిస్ట్రేటివ్ వ్యవహారాలు) నవీన్ మల్లారపు, సుర్బానా జురాంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తరఫున ఆ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్(సౌత్ ఇండియా) అవినాశ్ మిశ్రా ఒప్పంద పత్రాలను పరస్పరం

భార్యపై హత్యాయత్నం

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అనుమానంతో కొబ్బరి బొండాల కత్తితో భార్యపై భర్త హత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. పట్టణంలోని సత్యనారాయణపురంలో ఉంటున్న యలమందుల సావిత్రి ప్రవర్తనపై భర్త శివ(53) కొంతకాలంగా తరచు గొడవలు పడుతున్నారు. శుక్రవారం రాత్రి వివాదంలో కొబ్బరి బొండాల కత్తితో దాడి చేశాడు. దీంతో ఆమె గాయాలపాలైంది. స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు విచారిస్తున్నారు.



మార్పు రాదా?

వరదల్లో నగరవాసులు భారీగా నష్టపోయినా ఇంకా కబ్జాలా..
బుడమేరు డ్రెయిన్‌ను ఆక్రమించి రేకుల షెడ్డు నిర్మాణమా?

బుడమేరు వరదల కారణంగా నగరవాసులు ఎంత నష్టపోయారో అందరికీ తెలిసిందే.. బుడమేరుపై ఆక్రమణల కారణంగా వరద నీరు చాన్నాళ్లు బయటకు పోలేదు. భారీ నష్టం జరిగినా ఆక్రమణదారుల్లో మార్పు రావడం లేదు. రామవరప్పాడు రింగ్ నుంచి రెండో ఫ్లై ఓవర్ దాటాక ముస్తాబాద వెళ్లే రోడ్డు మొదట్లో డ్రెయిన్‌ను ఆక్రమించి దర్జాగా రేకుల షెడ్డు నిర్మించారు. అందులో ఫిష్ మార్కెట్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నట్టు బోర్డులు పెట్టారు. కాలువను సగానికి కుదించి పైన నిర్మాణాలు చేపట్టినా అధికారులకు పట్టడం లేదు. -విజయవాడ, ఆంధ్రజ్యోతి

ముస్తాబాద వెళ్లే రోడ్డు మొదట్లో డ్రెయిన్‌ను ఆక్రమించి నిర్మించిన రేకుల షెడ్డు

వైద్య విద్యకు న్యాయం జోడించాలి

సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ



విజయవాడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులకు న్యాయ సంబంధిత అంశాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అభిప్రాయపడ్డారు. దీనిపై వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు ఆలోచించాలని సూచించారు. విజయవాడలోని సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాల 2019 బ్యాచ్ విద్యార్థుల స్నాతకోత్సవం శుక్రవారం నిర్వహించారు. జస్టిస్ ఎన్వీ రమణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజంలో వైద్యులకు, న్యాయవాదులకు ఎంతో బాధ్యత ఉందని గుర్తు చేశారు. రోగికి, వైద్యులకు సంయమనం ఉండాలని చెప్పారు. ఓపికతో రోగుల సమస్యలు వింటే సగం చికిత్స చేసినట్టేనని అన్నారు. కొవిడ్‌లో 760 మంది వైద్యులు రోగులకు సేవలందించి ప్రాణాలర్పించారని, అటువంటి వైద్యులపై దాడులు ఎందుకు జరుగుతున్నాయో ఆలోచించుకోవాలని చెప్పారు. కమర్షియల్‌గా ఆలోచించే వైద్యులు ఎక్కువగా ఈ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం సామాన్యుడికి వైద్యం అందడం గగనంగా మారిందని, ఆరోగ్య వ్యవస్థంతా కార్పొరేట్ రంగంలోకి వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులు, కార్పొరేట్ ఆస్పత్రుల నీడపడని ప్రాంతాలు దేశంలో చాలా ఉన్నాయని చెప్పారు. ఈ ప్రాంతాల్లో పనిచేస్తే వైద్యులు సమాజానికి మంచి సేవ చేసిన వారవుతారన్నారని సూచించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో చదివే వారికి సామాజిక బాధ్యత ఎక్కువగా ఉండాలన్నారు. మాజీ ఎంపీ కనకమేడల రవీంద్ర మాట్లాడుతూ ఐదేళ్లలో ఎంతో కష్టపడి చదివి ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉండాలంటే పీజీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌కుమార్, కంటి విభాగాధిపతి డాక్టర్ ప్రభాకర్ శాస్త్రి, పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ అమ్మన్న పాల్గొన్నారు.

బెస్ట్ అవుట్‌గోయింగ్ విద్యార్థిగా అన్విత

ప్రభుత్వాసుపత్రి: ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ బెస్ట్ అవుట్ గోయింగ్ విద్యార్థిగా పుట్టగుంట అన్విత అవార్డును అందుకుంది. అన్విత విశ్వ హిందూ పరిషత్ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్ కుమార్ కుమార్తె. స్నాతకోత్సవంలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ నుంచి ఆల్ ఓవర్ బెస్ట్ అవుట్ గోయింగ్ అవార్డు అందుకుంది.

అమరావతి విల్డర్‌నెస్ పార్కుకు
డీపీఆర్ సిద్ధం చేయండి

- 'ప్రగతి' ప్రతినిధులతో ఏడీసీ సీఎండీ డి.లక్ష్మీపార్థసారథి

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విభిన్నమైన ప్రకృతి సోయగాలతో టూరిస్టులను కట్టిపడేసేలా అమరావతిలోని శాఖమూరులో విల్డర్‌నెస్ పార్కును రూపొందించేందుకు వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను సిద్ధం చేయాలని ప్రగతి సంస్థ ప్రతినిధులకు అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) చైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీపార్థసారథి సూచించారు. శుక్రవారం నగరంలోని ఏడీసీ ప్రధాన కార్యాలయంలో ప్రగతి ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. 'శాఖమూరు సెంట్రల్ పార్కులో విల్డర్‌నెస్ పార్కు నిర్మాణానికి ఏడీసీ 20 ఎకరాల భూమిని కేటాయించింది. ఇందులో ప్రకృతి ప్రసిద్ధిగాంచిన వృక్షజాలాన్ని పర్యావరణహితంగా పెంచి, పర్యాటకానికి ఆలవాలంగా తీర్చిదిద్దడమే పార్కు లక్ష్యం. ప్రకృతి ప్రియులను ఆకర్షించే రమ్యమైన రిసార్టులు నిర్మించి వాటి సరసన అరుదుగా కనిపించే ప్రకృతి సిద్ధమైన మొక్కలను పెంచి అవసరమైన మేరకు వసతిని కల్పించే విధంగా ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకోనుంది. సాధారణ ప్రజలందరికీ విల్డర్‌నెస్ పార్కులోనికి ఉచిత ప్రవేశాన్ని కల్పించేలా ప్రణాళిక రూపొందించాలి. ప్రముఖ పర్వదినాల నాడు ప్రజల భక్తిభావాలకు అనుగుణంగా ఉండే దేవతా వృక్షాలను ఇక్కడ పెంచేలా చూడాలి.' అని ప్రగతి ప్రతినిధులను సీఎండీ కోరారు. ఈ సమావేశంలో ఏడీసీ అర్బన్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్ హెడ్ పి.సురేష్‌బాబు, సీనియర్ అర్బన్ కె.లవణ్‌కుమార్, ప్రగతి సంస్థ చైర్మన్ జీబీకే రావు, ఎండీ జి.ఆంజనేయులు హాజరయ్యారు.

కాళికామాత దేవస్థానం
అర్చకుడి దారుణ హత్య

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అంకమ్మ తల్లి ఊరేగింపులో జరిగిన స్వల్ప వివాదం కాళికామాత దేవస్థానం అర్చకుడి దారుణ హత్యకు దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..జగ్గయ్యపేట చెరువుబజార్‌లో మాఘ అమవాస్య సందర్భంగా గురువారం నిర్వహించిన వీర్ల కొలువులో ఓర్సు నాగబాబు, శివల మధ్య భుజం తగలటంతో శివ తమ్ముడు రవితేజ ఎందుకు తోశావంటూ ప్రశ్నించాడు. దీంతో వివాదం మొదలైంది. దీంతో శివ అతని స్నేహితులు బండి సాయి, వేముల జ్వాలా, వినయ్, మరి కొంతమంది రెండు వర్గాలుగా ఘర్షణకు దిగారు. బత్తుల శివ అతడి అన్న కిశోర్‌కు ఫోన్ చేయగా అతడు వచ్చి గొడవపడ్డాడు. నాగబాబు మేనమామ పట్టణంలో శాంతినగర్‌లో ఉన్న కాళికామాత దేవస్థానంలో పూజారిగా పనిచేస్తున్న బత్తుల శ్రీను అలియాస్ తానూరి శ్రీను(32)వారి మధ్య ఘర్షణ నివారించే ప్రయత్నం చేస్తుండగా బత్తుల కిశోర్ (25) తన ఇంటి వద్ద నుంచి తీసుకువచ్చిన కోడి కత్తితో శ్రీను పీక కోయటంతో అక్కడ కిక్కడే తీవ్ర రక్తస్రావంతో పడి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ఈ ఘర్షణలో ఓర్సు నాగబాబు, బత్తుల వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి. వారు జగ్గయ్యపేట ప్రభుత్వా సుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బత్తుల శ్రీను తండ్రి గురువులు, బత్తుల వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారం గా కేసు నమోదు చేసినట్టు పేట సీఐ వెంకటేశ్వర్లు చెప్పారు.

హతుడి కుటుంబసభ్యులకు తాతయ్య, తన్నీరు పరామర్శ

హత్యకు గురైన బత్తుల శ్రీను అలియాస్ తానూరి శ్రీను (35) భౌతికకాయాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మాజీ కేడీసీసీ బ్యాంకు అధ్యక్షుడు తన్నీరు నాగేశ్వరరావులు సందర్శించి నివాళులు అర్పించారు. శ్రీను తల్లిదండ్రులు, బంధువులను పరామర్శించారు. శాంతియుతంగా ఉండాలని కోరారు.

ఎయిమ్స్‌లో మెరుగైన వసతులకు చర్యలు

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని
వైద్య సేవలపై ఆరా.. వైద్యాధికారులతో సమీక్ష

మంగళగిరి సిటీ ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రిలో రోగులకు మరిన్ని మెరుగైన వసతులను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఎయిమ్స్‌లో ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్, ఎమర్జెన్సీ, ఆపరేషన్ థియేటర్లు, ఇతర విభాగాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎయిమ్స్‌లో అందుతున్న వైద్య సేవలపై అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులు, వైద్యులతో ఆస్పత్రి పురోభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా మంగళగిరి ఎయిమ్స్‌లో వైద్యం అందుబాటులో ఉందన్నారు. రోజూ 3,200 ఓపీ నమోదవుతోందని, ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నందున ప్రణాళికాబద్ధమైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. బెడ్స్ కాస్త తక్కువగా ఉన్నాయని, అలాగే ప్రజలకు రవాణా సౌకర్యం, బస్సు షెల్టర్లు లేకపోవడం వంటి సమస్యలను గుర్తించామని, త్వరలోనే వాటన్నింటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంత్రి నారా లోకేశ్ సీఎస్ఆర్ ద్వారా రెండు షటిల్ బస్సు సర్వీసులను నడిపే ఏర్పాటు చేశారని, ఎన్నికల కోడ్ ముగియగానే అవి అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రోగుల సహాయకుల కోసం ధర్మశాల భవనాన్ని మరింత విస్తరిస్తామని చెప్పారు. ప్రైవేటు అంబులెన్స్‌లు అధిక మొత్తంలో చార్జీలు వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, ఇకపై కిలోమీటరు చొప్పున నిర్ణీత ధరలతో నడిపేలా బోర్డులు ఏర్పాటు చేయిస్తామన్నారు. ఉద్యోగులు, సిబ్బంది నియామకాల్లో అవకతవకలపై విచారణ జరిపిస్తామని, క్యాంటీన్ల నిర్వహణ కోసం మరిన్ని టెండర్లు పిలుస్తామని తెలిపారు. ఎయిమ్స్ ఈడీ అహంతెమ్‌శాంతా సింగ్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కార్యాలయ కమాండర్ వేధింపులు తాళలేక
మహిళా సూపరింటెండెంట్ ఆత్మహత్య

విద్యాధరపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): భారతీనగర్‌లోని 4వ ఆంధ్ర బాలికల ఎన్‌సీసీ విభాగంలో కమాండర్ బల్వీందర్ సింగ్ వేధింపులు తాళలేక మహిళా సూపరింటెండెంట్ కారుమూడి విజయలక్ష్మి గురువారం కృష్ణానదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమార్తె భవ్యసాయిశ్రీ తన తల్లి ఆత్మహత్యకు బల్వీందర్‌సింగ్ కారణమని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. తాడిగడప డొంక రోడ్డులోని శివం ఎన్‌క్లేవ్‌లో విజయలక్ష్మి నివాసముంటోంది. కార్యాలయంలో కమాండర్ బల్వీందర్ సింగ్ పని విషయంలో దూషించటం, కించపరిచే విధంగా మాట్లాడుతున్నాడు. మానసికంగా వేధిస్తున్నాడు. కమాండర్ వేధింపులపై పలుసార్లు కుమార్తెకు చెప్పుకొని బాధపడుతూ ఉండేది. ఇటీవల ఆమెకు కాలికి దెబ్బతగలటం వలన కుర్చీలో కూర్చోవడంతో కమాండర్ కుర్చీని తీయించివేసి నిలబెట్టాడు. దీంతో ఆమె ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించి సూసైడ్ లెటర్‌ను రాసి ఇంటిలో పెట్టింది. గమనించిన కుమార్తె బంధువుల దృష్టికి తీసుకువెళ్లటంతో ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చారు. విజయలక్ష్మి కుమార్తె, బంధువులు కమాండర్‌కు ఫోన్ చేసి విజయలక్ష్మి ఆత్మహత్యకు ప్రయత్నిస్తోందని, కొంచెం జాగ్రత్తగా ఉండమని సూచించారు. పై అధికారులకు ఫిర్యాదు చేయగా, విజయలక్ష్మిని ప్రముఖ కళాశాలకు బదిలీ చేశారు. ఆ అధికారి బదిలీని నిలుపుదల చేసి అదే కార్యాలయంలో పనిచేసేలా చూశాడు. వేధింపులు తాళలేక ఆమె అనారోగ్యానికి గురయ్యింది. వాలంటరీ రిటైర్‌మెంట్ అయినా తీసుకో లేకపోతే చనిపోయినా కూడా నీవు వర్క్ చేయాల్సిందే అంటూ ఆమెను ఇంకా వేధింపులకు గురిచేశాడు. గురువారం విజయలక్ష్మి ఉదయం ఆఫీసుకు వెళ్లింది. 4.30 గంటలకు భవానీపురం పోలీసులు తనకు ఫోన్ చేసి తన తల్లి కృష్ణానదిలో దూకి ఆత్మహత్య చేసుకుందని సమాచారం తెలిపారని భవ్యసాయిశ్రీ పోలీసులకు ఫిర్యాదు చేసింది.



గొల్లపూడిలో ప్రారంభమైన సత్యా షోరూం, ప్రారంభోత్సవంలో పాల్గొన్న సిబ్బంది

గొల్లపూడిలో సత్యా షోరూం

గొల్లపూడి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ వస్తువుల విక్రయాల్లో ప్రసిద్ధి చెందిన 'సత్యా' సంస్థ ఏపీలో తన 50వ షోరూంను ఏర్పాటు చేసింది. గొల్లపూడి వన్‌సెంటర్‌లో ఈ షోరూంను శుక్రవారం భవన యజమాని భరత్‌జైన్ కుటుంబీకులు లాంఛనంగా ప్రారంభించారు. సత్యా సేల్స్ ఏపీ హెడ్ సెంథిల్, మార్కెటింగ్ హెడ్ గాంధీ, ఉద్యోగులు, వివిధ బ్రాండ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీఎం సురేష్ మాట్లాడుతూ.. ప్రతి 1.5, 5స్టార్ ఏసీ కొన్న వినియోగదారులకు టీవీ, ప్రతి 1.5, 3 స్టార్ ఏసీ కొనుగోలు చేసిన వినియోగదారులకు టేబుల్ ఫ్యాన్ ఉచితంగా ఇస్తామని తెలిపారు. అన్ని గృహోపకరణాలపై 70 శాతం వరకు తగ్గింపు, ప్రతి కొనుగోలుపై ఉచిత బహుమతి అందిస్తామని పేర్కొన్నారు. సంస్థకు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో మొత్తం 300 షోరూంలు ఉన్నాయని తెలిపారు.


నవీముఖి పేరుతో ప్యాకింగ్ చేసిన ఉత్పత్తులు, దశాబ్దాల నాటి మిర్చి బస్తాలు

ప్రజారోగ్యంతో సినాగ్రో ఫుడ్స్ చెలగాటం


- నాసిరకం ఉత్పత్తులు తయారు చేసి, మార్కెట్‌లోకి విక్రయిస్తున్న వైనం
- విజిలెన్స్ తనిఖీల్లో విస్తుగొలిపే నిజాలు వెలుగులోకి


తనిఖీలు చేస్తున్న అధికారులు

జగ్గయ్యపేట రూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): లక్షలాది రూపాయల పన్నులను ఎగవేస్తూ, నాసిరకం ఆహార ఉత్పత్తులు తయారుచేసి, మార్కెట్‌లో విక్రయిస్తూ ప్రజారోగ్యాలతో చెలగాటమాడుతున్న సినాగ్రో ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాకం విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో వెలుగులోకి వచ్చింది. శుక్రవారం గండ్రాయి గ్రామంలోని సినాగ్రో ఫుడ్స్‌లో అధికారుల తనిఖీలు చేశారు. అందులో విస్తుగొలిపే అంశాలు వెలుగు చూశాయి. ఈ కంపెనీ తయారు చేసిన ఆహార ఉత్పత్తులను నవీముఖీ పేరుతో మార్కెట్‌లో విక్రయిస్తోందని గుర్తించారు. కారం తయారీకి నాసిరకం, కాలం చెల్లిన మిర్చిని వినియోగిస్తున్నట్టు, నాసిరకం మిర్చితో పచ్చళ్ల తయారు చేసినట్టు గుర్తించారు. 2016-17లోనే సంస్థ లైసెన్స్ గడువు ముగిసిందని, రెన్యువల్ చేయించుకోలేదని 2020-21లో రూ.రెండు లక్షల ట్యాక్స్ బకాయి ఉందని ఓ అధికారి తెలిపారు. 51 రకాల నిత్యావసర సరుకులను తయారీ, ఎక్స్‌పైరీ తేదీలు లేకుండానే ప్యాకింగ్ చేస్తున్నారని, ప్రభుత్వం జారీ చేయాల్సిన స్టిక్కర్లను వారే తయారు చేసుకుంటున్నారని ప్యాకింగ్‌లకు వాటిని అంటిస్తూ విక్రయాలు చేస్తున్నారని తెలిసింది. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాల్సి ఉందని దశాబ్ద కాలంగా నిరాటంకంగా నకిలీ వస్తువులను తయారు చేస్తున్నారని పేరు చెప్పని ఓ అధికారి తెలిపారు. ఈ ఆహార పదార్థాలు వినియోగించిన మనుషులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని వీటిని ల్యాబ్‌కు పంపి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు కంపెనీ సీజ్ చేస్తారని తెలిసింది. సీఐ ఉమర్, ఫుడ్‌సేఫ్టీ అధికారి రమేష్‌బాబు, తూనికలు కొలతల ఎస్సై సులేమాన్, జీఎస్టీ అధికారులు పాల్గొన్నారు.

ఇదీ సంస్థ నేపథ్యం

పసుపు, కారం ధనియాల పొడి, మసాలా దినుసుల తయారీ కోసం లైసెన్స్ తీసుకుని గండ్రాయి గ్రామంలో దశాబ్ద కాలం క్రితం సినాగ్రో ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ప్రారంభించారు. 51 రకాల వస్తువులను ఇక్కడ తయారు చేస్తున్నారు. నవీముఖి బ్రాండ్ పేరుతో వాటిని మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. సినాగ్రో కంపెనీకి అనుబంధంగా ఉన్న గుంటూరులోని ది అసోసియేటెడ్ సర్వీసెస్ పేరుతో కొనుగోళ్లు జరుపుతున్నారు. అక్కడి నుంచి తెచ్చిన సరుకును నవీముఖీ పేరుతో ప్యాక్ చేసి మార్కెట్‌లోకి వదులుతున్నారు.


క్వారీ గుంతలో నుంచి యువతి, ఇద్దరు యువకులను చీరెలు, తాళ్ల సాయంతో బయటకు లాగుతున్న స్థానికులు

గంజాయి బ్యాచ్ వీరంగం

- ముగ్గురిని క్వారీ గుంతలోకి తోసిన వైనం
- స్థానికుల సాయంతో ప్రాణాలతో బయటపడ్డ బాధితులు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): గంజాయి మత్తులో ఏం చేస్తున్నారో వారికే తెలియడం లేదు. చిన్న విషయం వద్ద మొదలైన వాదన ఘర్షణకు దారి తీసింది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వాదులాట ఆ తర్వాత కొట్లాట, చివరకు ముగ్గురిని క్వారీ గుంతలోకి నెట్టేసేదాకా వచ్చింది. ఈఘటన ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్ సమీపంలో ఉన్న సత్తెమ్మతల్లి గుడి వద్ద శుక్రవారం జరిగింది. గంజాయి మత్తులో ఉన్న పది మంది కొట్టుకొని ఇద్దరు యువకులను, ఒక యువతిని గుడి వెనుక ఉన్న పాడుబడిన రాతి క్వారీ గుంతలోకి నెట్టేశారు. 50 నుంచి 70 అడుగుల లోతులో ఉన్న గుంతలో పడిన ఆ ముగ్గురూ హాహాకారాలు చేస్తుండటంతో సమీపంలో ఉన్న గృహాల వారు తాళ్లు, చీరెల సాయంతో వారిని బ యటకు తీశారు. బయట పడిన వ్యక్తులపై గంజాయి మత్తులో ఉన్న వారు మళ్లీ దాడి చేశారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని బాధితులను ఆస్పత్రికి చికిత్స నిమిత్తం పంపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్టీటీపీఎస్‌లో కాంట్రాక్టు కార్మికులుగా పని చేసేందుకు ఇతర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో కార్మికులు వస్తున్నారు. వారం తా కొత్తగేటు ప్రాంతంలో అద్దెకు ఉంటున్నారు. కొత్తగేటు సమీపంలో గంజాయి విపరీతంగా లభిస్తుండటంతో చాలా మంది కా ర్మికులు దానికి బానిసలయ్యారు. మత్తులో అనేక అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. దీంతో సమీపంలో ఉంటున్న కుటుంబాల వారు భయాందోళన చెందుతున్నారు. పోలీసులు స్పందించి గంజాయిని అరికట్టాలని, గంజాయి బ్యాచ్‌లపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మారణాయుధాలతో
యువకుడిపై దాడి

- విజయవాడకు బాధితుడి తరలింపు

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పాతకక్షలతో సత్యనారాయణపురం-షేర్‌మహ్మద్‌పేట రోడ్డులో ఒక యువకుడిపై(25) కొందరు హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం జరిగింది. క్రిస్టియన్‌పేటకు చెందిన షేక్ నజీర్‌పై చెరువుబజార్‌కు చెందిన కొండా అయ్యప్ప, ధనమూర్తి ఆయన అనుచరులు కర్రలు, కత్తులతో విచక్షణా రహితంగా దాడి చేశారు. రక్తపు మడుగులో ఉన్న నజీర్‌ను స్నేహితులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జగ్గయ్యపేట ఎస్సై-1 అతడిని ప్రథమ చికిత్స అనంతరం విజయవాడ తరలించారు. హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

సెమీస్‌లో ఆస్ట్రేలియా


హెడ్ (59 నాటౌట్)

- హెడ్ అజేయ హాఫ్ సెంచరీ
- వరుణుడి ఆటంకం
- అఫ్ఘాన్‌తో మ్యాచ్ రద్దు
- ఇరుజట్లకూ చెరోపాయింట్
- చాంపియన్స్ ట్రోఫీ



సెదిఖుల్లా (85)

లాహోర్: చాంపియన్స్ ట్రోఫీలో ఆస్ట్రేలియా జట్టు సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన మ్యాచ్ కూడా వర్షం కారణంగా పూర్తిగా సాగకుండానే రద్దయ్యింది. దీంతో నాలుగు పాయింట్లతో గ్రూప్ 'బి' నుంచి కంగారూలు నాకౌట్‌లోకి అడుగుపెట్టారు. మరోవైపు మూడు పాయింట్లతో ఉన్న అఫ్ఘాన్ సాంకేతికంగా మాత్రమే రేసులో నిలిచింది. శనివారం జరిగే మ్యాచ్‌లో ఇంగ్లండ్ 207 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తుగా ఓడిస్తే రన్‌రేట్ పరంగా అఫ్ఘాన్‌కు అవకాశం ఉంటుంది. పాక్‌లో వర్షం కారణంగా వరుసగా మూడో మ్యాచ్ రద్దు కావడం గమనార్హం. అయితే వరుణుడు అఫ్ఘాన్ ఇన్నింగ్స్‌కు ఆటంకం కలిగించలేదు. దీంతో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఈ జట్టు 50 ఓవర్లలో 273 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ గుర్బాజ్ తొలి ఓవర్‌లోనే డకౌట్ కాగా, చివరి మ్యాచ్‌లో శతక హీరో జద్రాన్ (22) త్వరగానే అవుటయ్యాడు. ఈ దశలో సెదిఖుల్లా (85) సంయమనం చూపాడు. ముందుగా జద్రాన్‌తో కలిసి రెండో వికెట్‌కు 67, నాలుగో వికెట్‌కు హస్మతుల్లా (20)తో కలిసి 68 పరుగులు జత చేశాడు. అయితే సెంచరీకి చేరువలో సెదిఖుల్లాను జాన్సన్ అవుట్ చేశాడు. ఆ తర్వాత అజ్మతుల్లా ఒమర్జాయ్ (67) బాధ్యత తీసుకున్నాడు. ఐదు సిక్సర్లతో చెలరేగిన అతడి ఆట తీరుతో అఫ్ఘాన్ స్కోరు 199/7 నుంచి 270 దాటగలిగింది.

12.5 ఓవర్ల ఆటే..: ఓ మాదిరి ఛేదనలో ఆసీస్ ఆట వర్షంతో కేవలం 12.5 ఓవర్ల పాటే సాగింది. కానీ ఓపెనర్ హెడ్ (59 నాటౌట్) దూకుడుతో అప్పటికే జట్టు వికెట్ నష్టానికి 109 పరుగులు చేసింది. వరుస ఫోర్లతో చెలరేగిన హెడ్ ఇన్నింగ్స్‌తో జట్టు పవర్‌ప్లేలోనే 90 పరుగులు సాధించింది. అటు 34 బంతుల్లోనే తన ఫిఫ్టీ కూడా పూర్తయ్యింది. అతడికి షార్ట్ (20), స్మిత్ (19నాటౌట్) సహకరించారు. మరోవైపు వీరి ఇన్నింగ్స్ 12.5 ఓవర్ల సమయంలో భారీ వర్షం కురవడంతో మ్యాచ్‌కు బ్రేక్ పడింది. గంటన్నర తర్వాత వర్షం తెరిపినిచ్చినా అవుట్ ఫీల్డ్ చిత్తడిగా మారింది. ఆటకు అనుకూలంగా లేకపోవడంతో అంపైర్లు మ్యాచ్ రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు.

సంక్షిప్త స్కోర్లు
అఫ్ఘానిస్థాన్: 50 ఓవర్లలో 273 ఆలౌట్ (సెదిఖుల్లా 85, అజ్మతుల్లా 67, జద్రాన్ 22; డ్వార్షుస్ 3/47, జంపా 2/48, జాన్సన్ 2/49); **ఆస్ట్రేలియా:** 12.5 ఓవర్లలో 109/1. (హెడ్ 59 నాటౌట్, షార్ట్ 20, స్మిత్ 19 నాటౌట్; ఒమర్జాయ్ 1/43)

1 చాంపియన్స్ ట్రోఫీలో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ (29 బంతుల్లో) సాధించడంతో పాటు పవర్‌ప్లేలో ఎక్కువ పరుగులు (90) సాధించిన జట్టుగా ఆసీస్.

చాంపియన్స్ ట్రోఫీలో నేడు | **దక్షిణాఫ్రికా X ఇంగ్లండ్** | మ.2.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

ఇంగ్లండ్ కెప్టెన్సీకి బట్లర్ రాజీనామా



న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీలో ఇంగ్లండ్ జట్టు దారుణ వైఫల్యంతో పరిమిత ఓవర్ల కెప్టెన్సీకి జోస్ బట్లర్ గుడ్‌బై చెప్పాడు. సారథ్యాన్ని వదులుకుంటున్నట్టు బట్లర్ శుక్రవారం ప్రకటించాడు. శనివారం దక్షిణాఫ్రికాతో జరిగే తమ చివరి గ్రూప్ మ్యాచే కెప్టెన్‌గా తనకు ఆఖరిదని తెలిపాడు. చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా బుధవారం అఫ్ఘానిస్థాన్ చేతిలో ఓడడంతో ఇంగ్లండ్ జట్టు సెమీఫైనల్ ఆశలు ఆవిరయ్యాయి. సఫారీలతో శనివారం జరిగే పోరులో గెలిచినా ఇంగ్లండ్‌కు ప్రయోజనం లేదు. ఈ నేపథ్యంలో టోర్నీలో జట్టు పరాభవానికి నైతిక బాధ్యత వహిస్తూ కెప్టెన్సీ నుంచి బట్లర్ తప్పుకొన్నాడు. 'ఇంగ్లండ్ కెప్టెన్‌గా వైదొలుగుతున్నా. ఈ టోర్నీలో రెండు ఓటములతో సెమీస్‌కు దూరమయ్యాం. గత టోర్నీల పరాజయాలు కూడా నన్ను వెంటాడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కెప్టెన్సీ నుంచి వైదొలగడమే మంచిది. ఇక, జట్టులో ఆటగాడిగా కొనసాగుతా' అని 34 ఏళ్ల బట్లర్ వెల్లడించాడు. 2022లో ఇయాన్ మోర్గాన్ నుంచి పరిమిత ఓవర్ల కెప్టెన్సీ బాధ్యతలు తీసుకున్న బట్లర్.. ఆ ఏడాది టీ20 ప్రపంచకప్‌లో జట్టును గెలిపించాడు. ఆ తర్వాత 2023 వన్డే ప్రపంచకప్‌తో పాటు గతేడాది టీ20 ప్రపంచకప్‌లో జట్టు విఫలమైంది. ఇటీవల భారత్‌తో సిరీస్‌లోనూ ఇంగ్లండ్ చెత్తగా ఆడింది. వైస్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ జట్టు సారథిగా ఎంపికయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. కాగా ఇంగ్లండ్ టెస్టు జట్టుకు బెన్‌స్టోక్స్ కెప్టెన్‌గా ఉన్న సంగతి తెలిసిందే.


మెగ్ లానింగ్ (60 నాటౌట్)

ముంబై జోరుకు బ్రేక్

డబ్ల్యూపీఎల్‌లో నేడు | **ఢిల్లీ x బెంగళూరు** | రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

- రాణించిన లానింగ్, షఫాలీ
- ఢిల్లీ ఘనవిజయం
- మహిళల ప్రీమియర్ లీగ్

బెంగళూరు: హ్యాట్రిక్ విజయాలతో దూసుకెళుతున్న ముంబై ఇండియన్స్ మహిళల జట్టుకు బ్రేక్ పడింది. ఆల్‌రౌండ్ షో కనబర్చిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. మెగ్ లానింగ్ (60 నాటౌట్), షఫాలీ (43) మెరుపు ఇన్నింగ్స్‌తో చెలరేగారు. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 9 వికెట్లకు 123 పరుగులు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (22), హేలీ మాథ్యూస్ (22) మాత్రమే రాణించారు. స్పిన్నర్లు మిన్ను మణి (3/17), జొనాస్సెన్ (3/25) ధాటికి 23 రన్స్ వ్యవధిలోనే చివరి ఐదు వికెట్లు నేలకూలాయి. ఆ తర్వాత స్వల్ప ఛేదనలో ఢిల్లీ 14.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 124 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు లానింగ్, షఫాలీ తుఫాన్ ఇన్నింగ్స్‌తో శుభారంభం అందించారు. నాలుగో ఓవర్‌లో 6,4,4తో 16 రన్స్ రాబట్టిన షఫాలీ.. తొమ్మిదో ఓవర్‌లో రెండు సిక్సర్లతో మరింత జోరు చూపింది. అయితే తొలి వికెట్‌కు 85 పరుగులు జత చేశాక అమన్‌జోత్‌కు చిక్కింది. ఆ తర్వాత లానింగ్ చెలరేగి అర్ధసెంచరీ పూర్తి చేసుకోవడంతో పాటు, మరో 33 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించింది.

సంక్షిప్త స్కోర్లు: ముంబై ఇండియన్స్: 20 ఓవర్లలో 123/9 (హర్మన్‌ప్రీత్ 22, మాథ్యూస్ 22, బ్రంట్ 18, అమన్‌జోత్ 17 నాటౌట్; మిన్ను మణి 3/17జొనాసెన్ 3/25). ఢిల్లీ క్యాపిటల్స్: 14.3 ఓవర్లలో 124/1 (మెగ్ లానింగ్ 60 నాటౌట్, షఫాలీ 43; అమన్‌జోత్ 1/12).



డబ్బుతో సంబంధం లేదు.. అందరూ ఆడొచ్చు!

- ప్రతిభ ఉంటే చాలు
- పిల్లలపై నమ్మకముంచాలి
- గోపీచంద్ వ్యాఖ్యలతో విభేదించిన సింధు తండ్రి రమణ

న్యూఢిల్లీ: ఆర్థిక వెసులుబాటు ఉన్నవారే క్రీడలను కెరీర్‌గా ఎంచుకోవాలని బ్యాడ్మింటన్ దిగ్గజం, జాతీయ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ ఇటీవల చేసిన వ్యాఖ్యలతో స్టార్ షట్లర్ సింధు తండ్రి పీవీ రమణ పరోక్షంగా విభేదించారు. ఆదాయంతో సంబంధం లేదనీ, అందరూ ఆటలాడొచ్చని రమణ అన్నారు. క్రీడల్లో అత్యున్నతస్థాయికి ఎదిగేందుకు ప్రతిభ ఉంటే చాలన్నారు. దిగువ మధ్య తరగతి నుంచి వచ్చిన తాను కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో వాలీబాల్ క్రీడలో జాతీయస్థాయిలో రాణించగలిగానని, ఆ క్రీడవల్లే నాకు రైల్వేస్‌లో ఉద్యోగం వచ్చిందని అర్జున అవార్డు గ్రహీత అయిన రమణ వెల్లడించారు. అన్నారు. 'నా ఇద్దరు కుమార్తెల్లో పెద్దమ్మాయి దివ్య చిన్నతనంలో నెట్‌బాల్ ఆడేది. కానీ, ఆమె చదువుపై ఎక్కువగా ఆసక్తి కనబర్చడంతో ఆ దిశగా ప్రోత్సహించా. ఆమె వైద్యురాలైంది. చిన్నమ్మాయి సింధు పదో తరగతికి వచ్చేసరికి బ్యాడ్మింటన్‌లో మంచి ఫామ్‌లో ఉంది. దీంతో స్పాన్సర్లు దొరికారు. ఆ తర్వాత సింధు కెరీర్ గురించి మీకు తెలిసిందే. కెరీర్ ఎదుగుదలలో కొన్ని అవాంతరాలు ఎదురవ్వొచ్చు. కానీ, వాటిని అధిగమించి ముందుకెళ్లాలి. తల్లిదండ్రులు పిల్లలపై నమ్మకముంచాలి. వారి ప్రతిభను గుర్తించి ఆ దిశగా ముందుకు తీసుకెళ్లాలి' అని 1986లో ఆసియా క్రీడల్లో పతకం గెలిచిన భారత జట్టులో సభ్యుడైన రమణ వివరించారు.


దూబే (3/88)

దూబే కొత్త చరిత్ర

- రంజీల్లో అత్యధిక వికెట్లతో రికార్డు
- కేరళతో ఫైనల్ విదర్భకు ఆధిక్యం

నాగ్‌పూర్: కేరళతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్లో విదర్భకు కీలకమైన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 131/3తో మూడోరోజు ఆటను కొనసాగించిన కేరళ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 342 పరుగులకు ఆలౌటైంది. దీంతో మొదటి ఇన్నింగ్స్‌లో 379 పరుగులు చేసిన విదర్భకు 37 పరుగుల ఆధిక్యం లభించినట్టయింది. కేరళ కెప్టెన్ సచిన్ బేబీ (98) రెండు పరుగులతో సెంచరీని మిస్సయ్యాడు. ఆదిత్య సర్వాటే 79 రన్స్ చేశాడు. దర్శన్ నల్కండే, పార్థ్ రెఖాడే, హర్ష్ దూబే (3/88)తలా మూడేసి వికెట్లు పడగొట్టారు. 22 ఏళ్ల విదర్భ బౌలర్ హర్ష్ దూబే రంజీ చరిత్రలో ఒక సీజన్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. దూబే ఈ సీజన్‌లో 69 వికెట్లు సాధించాడు. ఈ క్రమంలో 2018-19 సీజన్‌లో బిహార్‌కు చెందిన అషుతోష్ అమన్ నెలకొల్పిన 68 వికెట్ల రికార్డును హర్ష్ దూబే అధిగమించాడు.

రన్నరప్ హంపి



మాంటెకార్లో (మొనాకో): ఫిడే మహిళల గ్రాండ్‌ప్రీ చెస్ టోర్నీ మూడో అంచెలో తెలుగు గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి రెండో స్థానంలో నిలిచింది. తొమ్మిదో, ఆఖరి రౌండ్‌లో బిబిసారా అసౌబయేవా (కజకిస్థాన్)పై హంపి విజయం సాధించింది. తెల్లపావులతో ఆడిన హంపి 55 ఎత్తుల్లో ప్రత్యర్థి ఆటకట్టించింది. కాగా, ఆడిన 9 రౌండ్ల నుంచి హంపి మొత్తం 5.5 పాయింట్లతో రెండో స్థానం సొంతం చేసుకొంది. అలెగ్జాండ్రా గోర్యాంచ్‌కినా (రష్యా) కూడా 5.5 పాయింట్లతో సమంగా నిలిచినా.. సూపర్ టైబ్రేక్ ఆధారంగా విజేతగా నిలిచింది. 4 పాయింట్లు సాధించిన హారిక 8వ స్థానంతో సంతృప్తిపడాల్సివచ్చింది.

అంధుల క్రికెట్ విజేత ఆంధ్ర



సుజాత, మిక్కా శతకాలు

విశాఖపట్నం-స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): పెట్రో నెట్ ఇన్ఫినిటీ సిరీస్ అంధుల మహిళా క్రికెట్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ జట్టు చాంపియన్‌గా నిలిచింది. కేరళలో శుక్రవారం జరిగిన ఫైనల్లో కర్ణాటకపై 27 పరుగుల తేడాతో ఏపీ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర నిర్ణీత 20 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 217 పరుగులు చేసింది. ఓపెనర్లు సుజాత (102), ఎస్.మిక్కా (102) సెంచరీలు సాధించారు. కర్ణాటక నిర్ణీత 20 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 190 పరుగులు మాత్రమే చేయగలిగింది. కాగా ఆంధ్రప్రదేశ్ అంధుల మహిళాక్రికెట్‌లో తొలి సెంచరీలు సాధించిన బ్యాటర్లుగా సుజాత, మిక్కా రికార్డు నెలకొల్పారు.

బిజినెస్

మార్కెట్లకు ఫిబ్రవర్రీ

- ట్రంప్ దెబ్బకు సూచీలు ఢమాల్
- గత నెల అంతా 'బేర్' పట్టులోనే
- సెన్సెక్స్ ఏకంగా 4,300 పాయింట్లు పతనం
- రూ.85 లక్షల కోట్ల సంపద హాంఫట్
- మదుపరుల కంట రక్తకన్నీరు



ముంబై: ఈక్విటీ మార్కెట్‌కు ఫిబ్రవరి నెల ఒక పీడకలగా మిగిలిపోయింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల బెదిరింపులు, అంతర్జాతీయ అస్థిరతల కారణంగా ప్రపంచ మార్కెట్లలో ఆటుపోట్లు, విదేశీ ఇన్వెస్టర్ల నిధుల తరలింపు నేపథ్యంలో ఈక్విటీ సూచీలు భారీ పతనాలు చవి చూశాయి. దేశీయంగా చూసినట్టయితే కార్పొరేట్ల బలహీన ఆర్థిక ఫలితాలు, జీడీపీ గణాంకాలపై నెలకొన్న ఆందోళనలు దీనికి ఆజ్యం పోశాయి. గత నెల 20వ తేదీన ట్రంప్ అధికార బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రారంభమైన బేరిష్ ట్రెండ్ ఫిబ్రవరిలో కూడా కొనసాగింది. సుమారు 40 రోజులుగా ఒకటి రెండు సందర్భాల్లో తప్పితే భారత్ సహా ప్రపంచ మార్కెట్ల ధోరణి ప్రతికూలంగానే ఉంది. ఫలితంగా స్టాక్ మార్కెట్లో పెట్టుబడుల ప్రధాన సూచీ అయిన సెన్సెక్స్ ఫిబ్రవరిలో 4,300 పాయింట్ల (5.5%) మేరకు నష్టపోయింది. బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.40.6 లక్షల కోట్లు తుడిచిపెట్టుకుపోయింది. మొత్తం మార్కెట్ అంతటినీ పరిగణనలోకి తీసుకుంటే సంపద నష్టం రూ.85 లక్షల కోట్ల వరకు ఉంటుందని మార్కెట్ వర్గాలంటున్నాయి.

వరుసగా ఐదో నెలా నిఫ్టీ నష్టాల్లోనే

ఎన్ఎస్ఈ నిఫ్టీ అయితే వరుసగా ఐదో నెల కూడా నష్టాల్లో ముగిసింది. 19 సంవత్సరాల చరిత్రలోనే కనివిని ఎరుగని భారీ నష్టం ఇది. 1996 తర్వాత నిఫ్టీ ఇంత సుదీర్ఘకాలం నష్టాల్లో ట్రేడ్ కావడం ఇదే ప్రథమం. 2024 సెప్టెంబరులో జీవితకాల గరిష్ఠ స్థాయిలకు చేరిన సెన్సెక్స్, నిఫ్టీ తదుపరి ఏర్పడిన కరెక్షన్‌లో 15-16% వరకు నష్టపోయాయి. మార్కెట్లోని ఇతర సూచీలు అంతకన్నా భారీ నష్టాలనే నమోదు చేశాయి. నిఫ్టీ నెక్స్ట్ ఇండెక్స్ 26%, నిఫ్టీ మిడ్ క్యాప్ 150 ఇండెక్స్ 21%, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 26-27% నష్టపోయాయి. నిఫ్టీలోని 50 షేర్లలో 30 ఇప్పటికే బేర్ గుప్పిట్లోకి జారుకున్నాయి. నిఫ్టీ షేర్లలో టాటా మోటార్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ట్రెంట్, హీరో మోటో కార్ప్ షేర్లు గరిష్ఠ స్థాయిల నుంచి 40% వరకు దిగజారాయి.

ఎఫ్‌పీఐల నిధుల తరలింపు

మార్కెట్ ఇంత భారీగా నష్టపోవడానికి ప్రధాన కారణం విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) నిధుల తరలింపు. గత రెండు నెలల కాలంలో అంటే 2025 ప్రారంభం నుంచి ఎఫ్‌పీఐలు నికరంగా 1,220 కోట్ల డాలర్లు (రూ.1.06 లక్షల కోట్లు) తరలించుకుపోయారు. ఒక్క ఫిబ్రవరి నెలలోనే రూ.47,349 కోట్లు ఉపసంహరించారు. 2024 సంవత్సరం నాలుగో త్రైమాసికంలో విక్రయించిన 1,230 కోట్ల డాలర్ల (రూ.1.07 లక్షల కోట్లు) విలువ గల ఈక్విటీలను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఐదు నెలల కాలంలో వారి అమ్మకాల మొత్తం విలువ 2,450 కోట్ల (రూ.2.13 లక్షల కోట్లు) డాలర్లకు చేరింది.

"పెరిగితే అమ్ముకో" వ్యూహం బెటర్

ప్రస్తుతం భారత మార్కెట్ గమనాన్ని పరిగణనలోకి తీసుకుంటే మార్కెట్లో ఏదైనా ర్యాలీ ఏర్పడినప్పుడల్లా అమ్ముకునే వ్యూహం అనుసరించడం మంచిదంటున్నారు. అమెరికా సుంకాల బెదిరింపుల నేపథ్యంలో కొంతకాలం పాటు మన మార్కెట్ పరిస్థితి ఇలాగే ఉండవచ్చని ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఏఎంసీ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ మహేశ్ పాటిల్ అన్నారు. అయితే ఓవర్‌సోల్డ్ స్థితి కారణంగా అప్పుడప్పుడూ స్వల్ప ర్యాలీలు ఉండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే రాబోయే రెండు నెలల కాలంలో ఇన్వెస్టర్ల నుంచి బలమైన కొనుగోళ్ల మద్దతు ఉండకపోవచ్చని ఆయన అన్నారు. దేశంలో స్థూల ఆర్థిక గణాంకాలు మెరుగుపడే వరకు పెద్దఎత్తున కొనుగోళ్లకు పాల్పడకపోవడం మంచిదని మిరే అసెట్ క్యాపిటల్ మార్కెట్స్ ప్రతినిధి మనీష్ జైన్ సలహా ఇస్తున్నారు. ఇంత ప్రతికూల పరిస్థితుల్లో కూడా దేశీయ సంస్థల కొనుగోళ్లు మార్కెట్‌ను ఆదుకుంటున్నాయని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ సీఈఓ ప్రతీక్ గుప్తా అన్నారు.

22,800 వద్ద నిరోధం

నిఫ్టీకి 22,800 నిరోధ స్థాయి అని నువామా ఆల్టర్నేటివ్స్, ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్ అంచనా వేస్తున్నాయి. ప్రస్తుత స్థితిలో మరి కొంత దిగజారవచ్చని, ఆ క్రమంలో నిఫ్టీ 21,800 వరకు దిగజారవచ్చని ఐఐఎఫ్ సెక్యూరిటీస్ ప్రతినిధి శ్రీరామ్ వేలాయుధన్ అంచనా. మార్చిలో నిఫ్టీ 22,000-22,900 పాయింట్ల మధ్యన కదలాడవచ్చని నువామా ప్రతినిధి అభిలాష్ పగారియా అంటున్నారు.

ఇది టెక్నికల్ కరెక్షన్ మాత్రమే

అయితే ఇది టెక్నికల్ కరెక్షన్ మాత్రమేనని జెఫ్రీస్ ఈక్విటీ స్ట్రాటజిస్ట్ క్రిస్ వుడ్ అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అమ్మకాల ధోరణి చూస్తుంటే అవకాశం వచ్చినప్పుడు అమ్మేసుకుని లాభాలు మూటగట్టుకోవాలన్న దురాశ కొందరిదైతే, భవిష్యత్తులో ఏం జరగబోతోందో అన్న భయోత్పాతానికి గురై మరి కొందరు అమ్మకాలకు తెగబడుతున్నారనిపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం మార్కెట్ దిద్దుబాటుకు గురవుతున్న వేగం కారణంగా ఇన్వెస్టర్ సెంటిమెంట్ దెబ్బ తిన్నదని, అదే ఈ అమ్మకాలకు ప్రధాన కారణమని ఆల్కెమీ క్యాపిటల్ ప్రతినిధి అలోక్ అగర్వాల్ అన్నారు. ప్రస్తుతం మార్కెట్ తిరోగమనం చివరి దశలో ఉన్నదని, ఇప్పటికే మార్కెట్లో లిక్విడిటీ ఆవిరైపోయినందు వల్ల ట్రెండ్ మారే అవకాశాలున్నాయని మార్కెట్ విశ్లేషణ సంస్థ మెరిసిస్ అంటోంది. వచ్చే 4-6 నెలల కాలంలో బలమైన బౌన్స్‌బ్యాక్‌కు ఆస్కారం ఉన్నదన్నది ఆ సంస్థ విశ్లేషకుల అంచనా.

బ్లాక్ ఫ్రైడే

బేర్ దెబ్బకు విలవిల
- ఒక్కరోజే సెన్సెక్స్ 1,414 పాయింట్లు, నిఫ్టీ 420 పాయింట్లు డౌన్
- రూ.9 లక్షల కోట్ల సంపద ఆవిరి

జీడీపీ గణాంకాలపై నెలకొన్న భయాలతో పాటు సుంకాలపై ట్రంప్ తాజా వ్యాఖ్యలు, అమెరికా ఆర్థిక వ్యవస్థలో మందగమనం శుక్రవారం ఈక్విటీ మార్కెట్లో మంటలు రేపాయి. భారీ స్థాయిలో జరిగిన అమ్మకాల ప్రభావంతో సెన్సెక్స్ 1,414.33 పాయింట్లు నష్టపోయి 73,198.10 వద్ద ముగిసింది. నిఫ్టీ 420.35 పాయింట్లు నష్టపోయి 22,124.70 వద్ద క్లోజైంది. ఫలితంగా బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ (ఇన్వెస్టర్ల సంపద) ఒక్క రోజులోనే రూ.8.9 లక్షల కోట్ల మేరకు దిగజారి రూ.384.22 లక్షల కోట్ల వద్ద స్థిరపడింది. కీలక సూచీలన్నీ నష్టాల్లోనే ముగిశాయి. ఐటీ, ఆటో, బ్యాంక్, మెటల్, ఎఫ్ఎంసీజీ, ఫార్మా, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ సూచీలన్నీ కూడా భారీ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అవి 0.7 శాతం నుంచి 6.5 శాతం మధ్యన నష్టపోయాయి.

ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో ప్రతికూల ధోరణులు దేశీయ మార్కెట్లో అమ్మకాలకు ఆజ్యం పోశాయి. ఏఐలో అగ్రగామిగా ఉన్న ఎన్‌విడియా షేర్లలో భారీ అమ్మకాలు దేశీయ ఐటీ షేర్లలో కూడా అమ్మకాలకు దారి తీశాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 4.2 శాతం మేరకు నష్టపోయింది. టెక్ మహీంద్రా, విప్రో, ఎంఫసిస్ షేర్లు గరిష్ఠంగా 6.5 శాతం వరకు నష్టపోయాయి.

ట్రంప్ చర్యల ప్రభావం: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గురువారం కెనడా, మెక్సికోలపై 25% సుంకాలు విధించడంతో పాటు చైనాపై 10% అదనపు సుంకాలు విధిస్తూ తీసుకున్న చర్యలు శుక్రవారం మార్కెట్లో ప్రకంపనలు రేపాయి. ట్రంప్ వాణిజ్య విధానాలపై నెలకొన్న అనిశ్చితి మార్కెట్‌ను మరింత అస్థిరతకు గురి చేస్తోంది. వాణిజ్య యుద్ధం తీవ్రరూపం దాల్చవచ్చన్న భయాల కారణంగా డాలర్ ఇండెక్స్ 107.36 పాయింట్లకు దూసుకుపోయింది. డాలర్ ఇండెక్స్ ఎంత బలపడితే భారత్ సహా వర్ధమాన మార్కెట్లకు అంత నష్టం అంటున్నారు.

- ఈక్విటీ మార్కెట్లలో బలహీనత కారణంగా అమెరికన్ డాలర్ మారకంలో రూపాయి శుక్రవారం 19 పైసల మేరకు క్షీణించి 87.37 వద్ద ముగిసింది.

ఏడాది కనిష్ఠానికి 148 స్టాక్స్

శుక్రవారం నాటి బేర్ దెబ్బకు నిఫ్టీ 500 ఇండెక్స్‌లోని 140 స్టాక్స్ 52 వారాల కనిష్ఠానికి చేరాయి. ఈ షేర్లలో జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆయిల్ ఇండియా, టాటా టెక్నాలజీస్, సొనాటా సాఫ్ట్‌వేర్ సహా మరి కొన్ని ఉన్నాయి. మరోవైపు నిఫ్టీ 50లోని 45 షేర్లు నష్టాల్లోనే ముగిసాయి.

నామినేషన్లపై సెబీ కొత్త మార్గదర్శకాలు

డీమ్యాట్ ఖాతాలు, మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) ఫోలియోల నామినేషన్లకు సంబంధించి సెబీ కీలక నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి శుక్రవారం కొన్ని కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఉమ్మడి ఖాతాకు సంబంధించి ఒకరు లేదా అంతకు మించిన ఖాతాదారులు చనిపోతే అదనపు కేవైసీ వివరాలు లేకుండానే ఆ ఖాతాలోని సెక్యూరిటీలు మిగిలిన ఖాతాదారుకు బదిలీ అవుతాయి. మిగిలిన ఖాతాదారులు తమ కాంటాక్ట్ వివరాలను, నామినీల మార్పు లేదా అదనపు నామినీల చేర్పు వివరాలను ఎప్పుడైనా అప్‌డేట్ చేయవచ్చని కూడా సెబీ తెలిపింది. ఒకవేళ ఖాతాదారులు దివ్యాంగులైతే తమ ఖాతాల నిర్వహణ బాధ్యత నామినీలకు కూడా అప్పగించేందుకు సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

జీడీపీ వృద్ధి రేటు 6.2 శాతం

- డిసెంబరు త్రైమాసికంలో ఆశాజనకంగా వృద్ధి
- 2024-25లో వృద్ధి రేటు 6.5%

న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థ గాడినపడుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో జీడీపీ వృద్ధి రేటు 6.2 శాతంగా నమోదైంది. సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో సవరించిన 5.6 శాతంతో పోలిస్తే ఇది 0.6 శాతం ఎక్కువ. అయితే ఈ కాలానికి భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అంచనా వేసిన 6.8 శాతంతో పోలిస్తే ఇది 0.6 శాతం తక్కువ. జాతీయ గణాంకాల సంస్థ (ఎన్ఎస్ఓ), కేంద్ర గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వ శాఖ శుక్రవారం ఈ వివరాలు విడుదల చేశాయి. మరోవైపు మార్చితో ముగిసే 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి గాను జీడీపీ వృద్ధి అంచనాలను ప్రభుత్వం 6.4 శాతం నుంచి 6.5 శాతానికి సవరించింది. ఇది నాలుగేళ్ల కనిష్ఠ స్థాయి వృద్ధి రేటు అవుతుంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) నమోదైన 9.2 శాతంతో పోల్చినా ఇది 2.7 శాతం తక్కువ.

రూ.331 లక్షల కోట్ల జీడీపీ: ప్రస్తుత ధరల ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సర జీడీపీ రూ.331.03 లక్షల కోట్ల వరకు ఉంటుందని ఎన్ఎస్ఓ అంచనా. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది రూ.29.8 లక్షల కోట్లు (9.9 శాతం) ఎక్కువ. ప్రస్తుత ధరల ప్రకారం డిసెంబరు త్రైమాసిక జీడీపీ కూడా రూ.47.17 లక్షల కోట్ల వరకు ఉంది. గత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే ఇది 6.2 శాతం (రూ.2.73 లక్షల కోట్లు) ఎక్కువ.

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న 7సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్.. జియో గేమ్స్‌తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్య ఒప్పందం ద్వారా జియో ఖాతాదారులకు 7సీస్‌కి చెందిన అన్ని రకాల గేమ్స్ తమ స్మార్ట్‌ఫోన్లు, సెట్ టాప్ బాక్స్ (ఎస్‌టీబీ) ద్వారా అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతం జియోగేమ్స్ లైబ్రరీలో ఏడు గేమ్స్ అందుబాటులో ఉండగా త్వరలో మరిన్ని గేమ్స్‌ను అందుబాటులోకి తీసుకురానుంది.

- కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ).. ఆంధ్రప్రదేశ్, తమిళనాడుల్లో కొత్తగా 6 శాఖలను ప్రారంభించింది. ఏపీలోని ప్రొద్దుటూరుతో పాటు తమిళనాడులోని సేలం, తిరువల్లూర్, ట్రిచీ, చెన్నై, తిరుపూర్‌లో ఈ శాఖలను ఏర్పాటు చేసింది. దీంతో బ్యాంక్ మొత్తం శాఖల సంఖ్య 877కి చేరింది.

- కిస్నా డైమండ్ అండ్ గోల్డ్ జువెలరీ.. గుంటూరుకు చెందిన తిరుమల గోల్డ్ అండ్ డైమండ్స్‌తో జట్టు కట్టింది. ఒప్పందంలో భాగంగా తిరుమల గోల్డ్.. కిస్నాకు చెంది ప్రత్యేక ఆభరణాలను వినియోగదారుల కోసం అందుబాటులో ఉంచనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



1వ తేదీ			
హైదరాబాద్	445	విజయవాడ	485
వరంగల్	447	గోదావరి	480
చిత్తూరు	493	విశాఖపట్నం	482
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	85	విజయవాడ	86
వరంగల్	85	గుంటూరు	86
కరీంనగర్	85	ఒంగోలు	86
మహబూబ్‌నగర్	85	చిత్తూరు	77
కర్నూలు	85	నెల్లూరు	82
విశాఖపట్నం	85	అనంతపురం	82
గోదావరి	86		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	86,840 ▼	79,600 ▼	1,05,000 ▼
విజయవాడ	89,000 ▲	84,500 ▲	96,500 ▼
విశాఖపట్నం	84,940 ▼	77,860 ▼	94,680 ▼
రాజమండ్రి	86,730 ▼	79,500 ▼	97,500 ▼
ప్రొద్దుటూరు	87,700 ▼	81,120 ▼	96,500 ▼
ముంబై	85,056 ▼	77,911 ▼	93,480 ▼



దుర్గమ్మ సన్నిధిలో బడ్జెట్‌కు పూజలు

రాష్ట్ర బడ్జెట్ ప్రతిని శుక్రవారం ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ కనకదుర్గమ్మవారి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం అందించారు. అధికారులకు శేషవస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. డిప్యూటీ ఈవో రత్నరాజు పీయూష్ కుమార్‌కు, అధికారులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

- ఇంద్రకీలాద్రి, ఆంధ్రజ్యోతి



ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న డిప్యూటీ ఈవో రత్నరాజు



వెలిగొండపై జగన్నాటకం!

- ప్రాజెక్టు పూర్తయిందంటూ జాతికి అంకితం చేసిన ఘనుడు
- ఇప్పుడు బడ్జెట్‌లో తక్కువ నిధులిచ్చారని యాగీ
- ఆయన జమానాలో 2023-24లో కేటాయించింది 26 కోట్లే
- తాజా బడ్జెట్‌లో రూ.309 కోట్లు

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాలో పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుపై వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ వైఖరి హాస్యాస్పదంగా మారింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు గత ఏడాది మార్చి 6న ఆకర్షణీయ సెట్టింగులతో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి.. ఈ ప్రాజెక్టును పూర్తి చేశానంటూ సీఎం హోదాలో ఆర్భాటంగా ప్రకటించుకున్న ఆయన.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సదరు ప్రాజెక్టుకు నామమాత్రంగా నిధులు కేటాయించిందని గగ్గోలు పెడుతున్నారు. ప్రాజెక్టును జాతికి అంకితం చేశానని.. జిల్లా రైతాంగానికి సాగు కష్టాలు తీరిపోయాయని అలవోకగా అబద్ధాలాడేసి.. ఇప్పుడు నిధులెలా కోరతారనేది ప్రశ్న. వాస్తవానికి ఆయన సీఎంగా ఉండగా ఈ ప్రాజెక్టుకు 2023-24లో కేవలం రూ.25.65 కోట్లే కేటాయించారు. 2024-25 ఓటాన్ అకౌంట్‌లో రూ.300.52 కోట్లు ఇచ్చిన కూటమి ప్రభుత్వం.. తాజా బడ్జెట్‌లో 309.13 కోట్లు ప్రతిపాదించింది. ఎవరు ఎక్కువ కేటాయించారు..? ఎక్కడి పనులు అక్కడ పెట్టి పూర్తయిపోయిందంటూ నాటకమాడింది ఎవరు? ఇప్పుడు రాద్ధాంతం చేస్తోంది ఎవరు? ప్రాజెక్టుకు భూసేకరణ, సహాయ పునరావాసానికే వెయ్యి కోట్లు అవసరమని, ఇప్పుడు రూ.116 కోట్లే కేటాయించారని యర్రగొండపాలెం వైసీపీ ఎమ్మెల్యే చంద్రశేఖర్ శుక్రవారం నీలి, కూలి మీడియాతో అన్నారు. నిధుల సాధన కోసం పాదయాత్ర చేస్తానని ప్రకటించారు. వెలిగొండపై ఆయనకు నిజంగా అంత ప్రేమ ఉంటే జగన్ జమానాలో పాతిక కోట్లే విదిల్చినప్పుడు కేటాయించినప్పుడు ధర్నాలు, పాదయాత్రలు ఎందుకు చేయలేదని ప్రజలు నిలదీస్తున్నారు.

నాడు నోరు మెదపలేదేం: మంత్రి స్వామి

కొండపి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టుపై వైసీపీ ఎమ్మెల్యేలకు, నాయకులకు మాట్లాడే నైతిక హక్కు లేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రాజెక్టు పూర్తికాకుండానే ప్రారంభించి జాతికి అంకితం చేశామన్నప్పుడు నోరు మెదపనివారు ఇప్పుడు నిధుల కేటాయింపు సక్రమంగా లేదనడం సిగ్గుచేటన్నారు. 'అంటే ప్రాజెక్టు పూర్తికాకుండానే జగన్ ప్రారంభించి ప్రజలను మోసగించారని ఎమ్మెల్యే చంద్రశేఖర్ అంగీకరించినట్లే కదా! ఇలాగైనా నిజాన్ని ఒప్పుకొన్నందుకు సంతోషం' అని ఎద్దేవాచేశారు. వైసీపీ నాయకులు గానీ, ఎమ్మెల్యే చంద్రశేఖర్ గానీ పాదయాత్రలు చేయక్కర్లేదని, చంద్రబాబు ప్రభుత్వం వెలిగొండను రాబోయే రోజుల్లో పూర్తిచేస్తుందన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు ఆర్భాటపు ప్రకటనలు మానుకొని, సభకు వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడాలని స్వామి అన్నారు.

'అంచనాలు' అందేనా?

3.22 లక్షల కోట్ల భారీ బడ్జెట్

కేంద్ర గ్రాంట్లపై కొండంత ఆశ

పన్ను, పన్నేతర ఆదాయం లెక్కలూ ఎక్కువే!

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): గణాంకాలు, లక్ష్యాలు, కేటాయింపులు అన్నీ ఘనంగానే ఉన్నాయి! బాగానే ఉంది! కానీ... 3.22 లక్షల కోట్ల బడ్జెట్‌లో పేర్కొన్న కొన్ని అంచనాలను అందుకోగలరా... అనే సందేహాలూ తలెత్తుతున్నాయి. మరీ ముఖ్యంగా కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు, పన్నేతర ఆదాయంపై కొండంత ఆశలు పెట్టుకున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి రూ.7,432 కోట్ల పన్నేతర ఆదాయం వచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనాల ప్రకారం రూ.7,018 కోట్లు వచ్చే అవకాశం ఉంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరాల్లో ఇంకా తక్కువగానే వచ్చింది. కానీ, వచ్చే ఆర్థిక సంవత్సరంలో పన్నేతర ఆదాయం రూ.19,119 కోట్లు వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. భూముల అమ్మకం, ఎర్రచందనం అమ్మకం... ఈ రెండే పన్నేతర ఆదాయానికి ప్రధాన మార్గాలు! ఇంత భారీగా అంచనాలు ప్రకటించినప్పుడు ఏయే మార్గాల్లో ఎంతెంత వస్తుందో కూడా చెబితే బాగుండేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇక... పన్ను ఆదాయం అంచనాలు కూడా వాస్తవాలకు దూరంగా ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సర బడ్జెట్లోనూ, వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్లోనూ పన్ను ఆదాయం అంచనాలు ఒకే రకంగా పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పన్ను ఆదాయం రూ.1,09,789 కోట్లుగా మొదట అంచనా వేసి... ఇప్పుడు సవరించిన అంచనాలంటూ దానిని రూ.94,966 కోట్లకు తగ్గించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి కూడా పన్ను ఆదాయం రూ.1,09,006 కోట్లుగా అంచనా వేశారు. అంటే... సవరించిన అంచనాలకంటే దాదాపు రూ.14,040 కోట్లు పెంచేశారు. ఇదెంత వరకు సాధ్యపడుతుందో మరి! అలాగే, కేంద్రం ఇచ్చే గ్రాంట్స్ ఇన్ ఎయిడ్‌పై కూడా భారీగా ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనాల ప్రకారం గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ రూపంలో వచ్చేది రూ.21,966 కోట్లు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో వీటిని అమాంతం పెంచి... రూ.32,384 కోట్లుగా చూపించారు. అంటే... రూ.10,418 కోట్లు ఎక్కువగా అంచనా వేశారు. కేంద్రంలో అనుకూలమైన ప్రభుత్వం ఉన్న నేపథ్యంలో... తాము అనుకున్న మేరకు నిధులు రాబట్టవచ్చునని రాష్ట్రం భావిస్తున్నట్లుంది. ఇక... వచ్చే ఆర్థిక సంవత్సరంలో అన్ని మార్గాల్లో రూ.1,04,382 కోట్ల అప్పులు చేస్తామని బడ్జెట్లో చెప్పారు.

అప్పుల ప్రస్తావనేదీ?

అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రభుత్వం అప్పుల వివరాలు దాచిపెట్టింది. దీనికి కారణమేవిటో తెలియడంలేదు. ఒకచోట మాత్రం జీఎస్‌డీపీలో రాష్ట్ర అప్పు శాతం ఎంత అని చెప్పడం కోసం గ్రాఫిక్స్‌లో అస్పష్టంగా చూపించారు. ఇందులో పబ్లిక్ డెట్ రూ.6 లక్షల కోట్లు దాటిందని అర్థమవుతోంది కానీ, కచ్చితంగా ఎంత అనేది చెప్పాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేనట్లు అర్థమవుతోంది. కనీసం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విడుదల చేసిన శ్వేతపత్రంలో పేర్కొన్న అరకొర అప్పులు కూడా బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. కానీ, అప్పులపై చెల్లించాల్సిన వడ్డీలు, అసలు లెక్కలు మాత్రం స్పష్టంగానే చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దయనీయంగా ఉన్న నేపథ్యంలో... అప్పులపై బడ్జెట్ పత్రాల్లో మరింత పారదర్శకంగా ఉండాల్సిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

సర్కారుకు సొమ్ములిలా..

- పన్నులు: 50%
- పన్నేతర ఆదాయం: 9%
- గ్రాంట్స్ ఇన్ ఎయిడ్: 15%
- కేంద్ర పన్నుల్లో వాటా: 26%

అప్పుల రాక



- కేంద్ర రుణాలు 21%
- ఇతర రుణాలు 1%
- సెక్యూరిటీల విక్రయం ద్వారా: 77%
- డిపాజిట్లు, ట్రాన్సాక్షన్ల ద్వారా: 1%

ఖర్చులు పైపైకి

రెవెన్యూ వ్యయం	
2022-23:	2,01,256
2023-24:	2,12,450
2024-25:	2,24,343
2025-26:	2,51,163

అంకెలు ఘనం.. కేటాయింపులు శూన్యం: షర్మిల

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): 'కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్‌లో సంఖ్య ఘనం... కేటాయింపులు శూన్యం' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. శుక్రవారం ఆమె ఎక్స్ వేదికగా బడ్జెట్‌పై స్పందించారు. 'అంతా అంకెల గారడి, అభూత కల్పన. దశ-దిశ, పస లేని బడ్జెట్ ఇది. రాష్ట్రం గుల్ల... బడ్జెట్ అంతా డొల్ల. ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా ఉంది. ఎన్నికల వాగ్దానాలను పూర్తిగా విస్మరించారు. సూపర్ సిక్స్ పథకాలకు పంగనామాలు పెట్టారు. ఇతర హామీలకు ఎగనామం పెట్టారు. ఇది మంచి ప్రభుత్వం కాదు... ముంచే ప్రభుత్వం అని తొలి బడ్జెట్‌తోనే నిరూపితం అయింది. ప్రభుత్వ ఉద్యోగులను వంచించారు. రాష్ట్ర రాజధానికి ఒక్క రూపాయి కేటాయించకుండా అప్పులతోనే అమరావతి కట్టాలని చూడటం మీ అవివేకానికి నిదర్శనం. రాష్ట్ర ప్రజలను మోసం చేసి, ఎన్నికల హామీలను గాలికి వదిలేసి, మసి పూసి మారేడుకాయ చేశారు. ఈ బడ్జెట్‌లో విజన్ లేదు... విజ్ఞమూ లేదు. కేవలం ఇంద్రజాలమే. మిషన్ లేదు, మీనింగూ లేదు. కేవలం మహేంద్రజాలమే' అంటూ షర్మిల మండిపడ్డారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదన్న షర్మిల... వివిధ పథకాలకు చేసిన కేటాయింపులు అరకొరగానే ఉన్నాయని, కొన్నింటికి అసలు కేటాయింపులే లేవని అంటూ వివరణాత్మక విమర్శ చేశారు.

ప్రజా సమస్యలను ప్రస్తావిద్దాం

- ప్రతిపక్షం బాధ్యతను తీసుకుందాం: బీజేపీ

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): 'అసెంబ్లీలో ప్రజా సమస్యల్ని లేవనెత్తి పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. ప్రతిపక్ష హోదా కోసం పట్టుబడుతూ ప్రతిపక్ష ఎమ్మెల్యేలు సభకు రావట్లేదు. క్షేత్ర స్థాయిలో సమస్యల్ని సభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొద్దాం' అని బీజేపీ ప్రజా ప్రతినిధుల సమావేశంలో నిర్ణయించారు. విజయవాడలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సమావేశమయ్యారు. 'రాష్ట్రంలో బీజేపీ బలపడాలంటే ప్రజా సమస్యల్ని పరిష్కరించడమే అజెండాగా ఉండాలి. కేంద్రం, రాష్ట్రానికి ఇస్తోన్న సహకారాన్ని పార్టీ శ్రేణుల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. క్షేత్ర స్థాయిలో కమలాన్ని వికసింపజేయాలి' అని ముఖ్య నేతలు అభిప్రాయపడ్డారు.

సంక్షేమానికి, అభివృద్ధికి తోడ్పాటేది?

- వామపక్షాలు, ప్రజా సంఘాల పెదవి విరుపు

అమరావతి, విజయవాడ, ఏలూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వార్షిక బడ్జెట్ పట్ల వామపక్ష పార్టీలు, వాటి అనుబంధ కార్మిక, ఉపాధ్యాయ సంఘాలు పెదవి విరిచాయి. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఏలూరులో స్పందిస్తూ... 'రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను మభ్యపెట్టే, మోసపూరిత బడ్జెట్. పయ్యావుల ప్రవేశపెట్టిన బడ్జెట్ 'పేరు గొప్ప... ఊరు దిబ్బ' అన్న చందాన ఉంది. భారీ బడ్జెట్ ప్రతిపాదించారు. రెవెన్యూ లోటు ఏ విధంగా పూడుస్తారో వివరించలేదు. వ్యవసాయ రంగానికి కేటాయింపులు అరకొరగానే ఉన్నాయి. కౌలు రైతులను పూర్తిగా విస్మరించారు' అని విమర్శించారు. 'ఉన్న అప్పులకు అదనంగా రూ.లక్షల కోట్లు అప్పు తేబోతోంది. రూ.80 వేల కోట్లు ద్రవ్యలోటు ఉంది. దాన్ని పూడ్చడానికి ప్రజలపై అదనపు భారాలు వేసేదిగా ఉంది. మొత్తం బడ్జెట్‌లో ఇరిగేషన్ వాటా 24.73 శాతం నుంచి 23.98 శాతానికి తగ్గింది. విద్య, వైద్యానికి కేటాయింపులు తగ్గాయి. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న యువతకు నిరుద్యోగ భృతి గురించి ప్రస్తావన లేదు' అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధులు పి.ప్రసాద్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు బడ్జెట్‌పై స్పందిస్తూ... 'సంపదలు సృష్టిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం... అప్పులు సృష్టించే బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఏటా 20 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామన్న హామీని బుట్టదాఖలా చేశారు.

పీఆర్‌సీకి కేటాయింపులు ఏవీ?: ఎస్టీయూ

బడ్జెట్‌లో పీఆర్‌సీ, ఐఆర్ అమలుపై స్పష్టత లేదని ఎస్టీయూ ఆక్షేపించింది. 12వ పీఆర్‌సీ అమలు ఇప్పటికే 20 నెలలు ఆలస్యమైందని, అయినా పీఆర్‌సీకి ప్రభుత్వం కేటాయింపులు చూపలేదని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, రఘునాథరెడ్డి ఓ ప్రకటనలో విమర్శించారు. సీపీఎస్, జీపీఎస్ కంటే మెరుగైన పెన్షన్ విధానం అమలుచేస్తామని హామీ ఇచ్చినా, దానిపైనా ప్రకటన చేయలేదన్నారు.

పాఠశాల విద్యకు కేటాయింపులు పెంచాలి: ఉపాధ్యాయ సంఘాలు

బడ్జెట్‌లో పాఠశాల విద్యకు తక్కువ నిధులు కేటాయించారని యూటీఎఫ్ విమర్శించింది. ఈమేరకు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్. వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ ఓ ప్రకటన చేస్తూ... 'విద్యా రంగానికి 20% నిధులు కేటాయించాలని కొఠారి కమిషన్ చెప్పిన దానిని ప్రభుత్వం పట్టించుకోలేదు. కేవలం 9.86 శాతం మాత్రమే నిధులు కేటాయించడం వల్ల ప్రభుత్వం తన బాధ్యత నుంచి వైదొలుగుతోందనే భావన కలుగుతోంది. పాఠశాల విద్యకు కేటాయింపులు 20 శాతానికి పెంచాలి' అని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్-1938 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి స్పందిస్తూ... 'బడ్జెట్‌లో కేటాయించిన అరకొర నిధులతో విద్యారంగ అభివృద్ధి సాధ్యం కాదు. పాఠశాలలకు ప్రభుత్వమే విద్యుత్ సరఫరా చేస్తుందన్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం' అని పేర్కొన్నారు.



నెలాఖరులోగా పదవుల భర్తీ

ప్రజలకు, పార్టీ కేడర్‌కు.. అలాగే పార్టీ కేడర్‌కు, లీడర్లకు నడుమ దూరం పెరుగుతోంది. ఇది మంచిది కాదు. తరచూ జనంలోకి వెళ్తుండాలి. శ్రేణులతో సమావేశమవుతూ వారి కష్టసుఖాలు తెలుసుకుంటూ ఉండాలి.

కొత్తగా వచ్చినవారు టీడీపీ విధివిధానాలు.. పార్టీ ఆలోచనలను ఇంకా వంటబట్టించులేకపోతున్నారు. ఏదైనా సమస్య ఉంటే అంతర్గతంగా చర్చించి పరిష్కరించుకోవాలే తప్ప వీధినపడకూడదు.

అబద్ధాన్ని నిజంగా ప్రచారం చేయడం వైసీపీకి, ఆ పార్టీ నాయకులకు అలవాటు. ఇప్పటికీ వారిది అదే తీరు. దానిని వ్యూహాత్మకంగా ఎదుర్కోవడం చాలా ముఖ్యం.

- సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్ష పదవులు ఇస్తామని తెలిపారు. నామినేటెడ్ పదవుల కోసం ఎమ్మెల్యేలు, ఎంపీలు నామినేటెడ్ పదవుల కోసం తమ ప్రతిపాదనలను వెంటనే పోర్టల్‌లో పెట్టాలని సూచించారు. మీరు ఇవ్వాల్సిన డేటా ఇవ్వకుండా పదవులు భర్తీ చేయాలంటే ఎలా కుదురుతుందని వారిని ప్రశ్నించారు. పార్టీలో ఏ స్థాయిలో ఉన్న వారైనా కుటుంబ సాధికార సారథి(కేఎస్ఎస్) బాధ్యత చేపట్టాల్సిందేనని స్పష్టం చేశారు. వారికే పదవుల్లో ప్రాధాన్యం ఇస్తామన్నారు. కేఎస్ఎస్‌ల నియామకం మార్చి 30 నాటికి పూర్తికావాలని, మార్చి 31 నుంచి ఏప్రిల్ నెలాఖరుకల్లా క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయి కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. సీఎం ఇంకా ఏం చెప్పారంటే..

కార్యకర్తలకు రుణపడి ఉంటా

పార్టీ కార్యకర్తలకు రుణపడి ఉంటా. జగన్ జమానాలో ఐదేళ్లు ఎన్ని హింసలు పెట్టినా, ప్రాణాలు తీసినా పార్టీతోనే ఉన్నారు. కేడర్‌ను కాపాడుకోవడం మన బాధ్యత. నియోజకవర్గ స్థాయి మొదలు గ్రామస్థాయి వరకు కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించండి. వారిని కలుపుకొని వెళ్తే నాయకులకు తిరుగుండదు. ఇన్‌చార్జి మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు సమన్వయంతో పనిచేయాలి. ఇన్‌చార్జి మంత్రి నేతృత్వంలో తరచూ ఆ జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు సమావేశమవుతుండాలి. విందు భేటీలు పెట్టుకోండి. మళ్లీ మనమే అధికారంలోకి రావాలనే స్పృహతో పనిచేయాలి. దానికి నిత్యం ప్రజల్లో ఉండడమే మార్గం. కేంద్ర మంత్రులు నెలకు 2-3 సార్లు జిల్లాలకు వెళ్లి అభివృద్ధి, సంక్షేమాలను ప్రజలకు వివరించాలి. ప్రతి 3వ శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించి, అందులో ఎమ్మెల్యేలు, ఎంపీలు మంత్రులు.. అందరూ భాగస్వాములు కావాలి. చెత్త తీయడం, వీధులు శుభ్రపరచడం వంటి వాటిపైనే కాకుండా ప్రజల్లో మమేకమై సమాజాన్ని చైతన్యపరిచే కార్యక్రమాలూ నిర్వహించాలి.

బడ్జెట్‌పై చర్చ జరగాలి..

కేంద్ర బడ్జెట్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఎన్డీయే ప్రభుత్వం వినూత్న రీతిలో కేంద్ర మంత్రులతో సమావేశాలు నిర్వహించింది. అదే తరహాలో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రజల్లో చర్చకు పెట్టాలి. మంత్రులు, ఎమ్మెల్యేలు దీనిపై చొరవ తీసుకోవాలి. బడ్జెట్‌పైన, ప్రభుత్వంపైన ప్రజల ఫీడ్ బ్యాక్ తీసుకోండి. అన్న క్యాంటీన్‌కు వెళ్లి అక్కడ ఉన్నవారితో కలిసి భోజనం చేసి ఫీడ్ బ్యాక్ అడగండి. బడ్జెట్ రూపకల్పనపై ఎంతో కసరత్తు చేశాం.

సూపర్-6 హామీల అమలుకు ప్రాధాన్యం ఇచ్చాం. అన్నదాత, తల్లికి వందనం పథకాలకు నిధులు కేటాయించాం. మే నుంచి వాటిని అమలు చేస్తాం. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం కూడా అమలు చేస్తాం. గృహనిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటి వరకు ఎస్సీ, ఎస్టీలకే అదనంగా నిధులిస్తోంది. ఇకపై బీసీలకూ రూ.50వేలు అదనంగా ఇస్తాం. 2029నాటికి ప్రతి కుటుంబానికి ఇల్లు, నీరు, విద్యుత్, పీఎం సూర్యఘర్ ద్వారా సౌర విద్యుత్, గ్యాస్ సరఫరా, మరుగుదొడ్డి, ఇంటర్నెట్ అందించాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. వాట్సాప్ గవర్నెన్స్‌లో ప్రస్తుతం 161 సేవలు ఇస్తున్నాం. వీటిని త్వరలోనే 500కు పెంచుతాం. దీనిపై ఎమ్మెల్యేలు ఫీడ్ బ్యాక్ తీసుకోవాలి. వేసవికాలంలో నీటి సమస్య లేకుండా చూసేందుకు ఓ యాప్ కూడా తీసుకొస్తున్నాం. ప్రతి ఎంపీ, ఎమ్మెల్యే వారి నియోజకవర్గాన్ని ఏ విధంగా అభివృద్ధి చేస్తారో ప్రణాళికాపత్రం తయారు చేసుకోవాలి. త్వరలో ఎమ్మెల్యేలతో ముఖాముఖి నిర్వహిస్తాం. అసెంబ్లీలో ఏ ఎమ్మెల్యే ఎంత సేపు ఉన్నారో కూడా త్వరలో స్క్రీన్‌పై చూపిస్తాం. ప్రతి సభ్యుడూ సభ జరిగే సమయంలో అసెంబ్లీలో ఉండాల్సిందే.

2 నెలల్లో గుంతల్లేని రోడ్లు

వైసీపీ మిగిల్చి వెళ్లిన గుంతల రోడ్లను చాలావరకు పూడ్చి మంచిగా చేశామని.. ఇంకా ఎక్కడైనా ఇబ్బందులుంటే మంత్రి జనార్దన్‌రెడ్డి చొరవ తీసుకుని 2 నెలల్లో గుంతలు లేని రాష్ట్రంగా మార్చడంపై దృష్టి సారించాలని సీఎం సూచించారు. మంత్రి స్పందిస్తూ.. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ డబ్బులివ్వడం లేదని సరదాగా వ్యాఖ్యానించారు. చంద్రబాబు బదులిస్తూ.. 'కేశవ్‌కు కూడా చెబుతున్నా.. రోడ్లను ప్రాధాన్యంగా తీసుకుని జనార్దన్‌రెడ్డికి డబ్బులివ్వాలి' అని చెప్పడంతో సమావేశంలో నవ్వులు విరిశాయి.

నాడు జగన్ కుట్రలను నిఘా కూడా పసిగట్టలేదు


- సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోలేక దెబ్బతిన్నాం
- 2019లో ఓటమికి దుష్ప్రచారం ప్రధాన కారణం: చంద్రబాబు

'2019 ఎన్నికల ముందు మాజీ మంత్రి వివేకానందరెడ్డిని హత్య చేసి గుండెపోటుగా నమ్మించే ప్రయత్నం చేశారు. రాజకీయాల్లో ఉండే క్రిమినల్స్ ఆలోచనలు ఎలా ఉంటాయో, కుట్రలు ఎలా ఉంటాయో ఈ హత్య ఘటన ఓ కేస్ స్టడీ' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. వివేకా హత్య మొదలు.. గులకరాయి ఘటన వరకు సుదీర్ఘంగా వివరించారు. 'వివేకా హత్యకు గురైతే గుండెపోటు అని జగన్ టీవీలో వేశారు. నేను కూడా నిజమేననుకున్నాను. ఎన్నికల సమయం కావడంతో టికెట్ల కేటాయింపుపై కసరత్తు చేస్తూ దీనిపై పెద్దగా దృష్టి పెట్టలేదు. కానీ జగన్ రాజకీయ లబ్ధి కోసం నీచమైన ఆరోపణలు చేశారు. వారి పేపర్‌లో నారాసుర రక్తచరిత్ర అని నా చేతిలో కత్తి పెట్టి వార్తలు రాశారు. వివేకా కుమార్తె సునీతారెడ్డి కూడా వారి మాటలనే నమ్మారు. హత్య గురించి ఎవరూ మాట్లాడకుండా వారే కోర్టుకు వెళ్లి గ్యాగ్ ఆర్డర్ తెచ్చారు. ఎన్నికల ముందు సీబీఐ దర్యాప్తు కావాలన్నారు. అధికారంలోకి వచ్చాక అవసరం లేదన్నారు. అప్పుడు సునీతారెడ్డికి అనుమానం వచ్చి పోరాటం మొదలుపెట్టారు. వివేకా హత్య అప్పటి ఎన్నికల్లో మనకు ప్రతికూల ఫలితాలు రావడానికి ఓ కారణమైంది. నిఘా వ్యవస్థ కూడా జగన్ కుట్రలను పసిగట్టలేకపోయింది. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోకపోవడం వల్ల డ్యామేజీ జరిగింది. మళ్లీ 2024 ఎన్నికల ముందు జగన్ గులకరాయి డ్రామా ఆడాడు. కానీ జనం ఒక్కసారే మోసపోతారు. ఈసారి నమ్మలేదు. ఇటీవల జగన్ ఇంటి ముందు గడ్డి తగలబడితే దాన్నీ రాజకీయం చేయాలని చూశారు. రాజకీయాల్లో క్రిమినల్స్ ఉంటే ఇలాంటి ఆలోచనలే చేస్తారు. వారి కుట్రలను, ఫేక్ ప్రచారాలను తిప్పికొట్టాలి' అని పిలుపిచ్చారు.



కష్ట కాలంలో మంచి బడ్జెట్: స్పీకర్ అయ్యన్న

నష్టపోయిన రాష్ట్రాన్ని కాపాడటం కోసం ఈ కష్ట కాలంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల నాయకత్వంలో మంచి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని శాసనసభ స్పీకరు అయ్యన్న పాత్రుడు అన్నారు. బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అనంతరం సభ్యులకు కొన్ని సూచనలు చేశారు. 'సభలో ఎక్కువమంది కొత్త సభ్యులు ఉన్నారు. శని, ఆదివారాలు సెలవులు. అందరూ బడ్జెట్‌ని బాగా చదివి ఆకళింపు చేసుకోవాలి. సోమవారం నుంచి 3 రోజులపాటు బడ్జెట్‌పై చర్చ ఉంటుంది. అందరికీ మాట్లాడే అవకాశం వస్తుంది' అని పేర్కొన్నారు.



సంక్షేమానికి జై

బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి రూ.23,260 కోట్లు

ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖకు ప్రత్యేకంగా నిధులు

నాయీ బ్రాహ్మణుల సెలూన్లకు, చేనేతలకు ఉచిత విద్యుత్తు

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి 18,848 కోట్లు

డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాల కోసం 100 కోట్లు

ఉపాధి పథకానికి రూ.5,500 కోట్లు కేటాయింపులు

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వివిధ సంక్షేమ శాఖలకు భారీగా కేటాయింపులు చేసింది. బీసీ సంక్షేమ శాఖతో పాటు దాని పరిధిలో ఉన్న ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖకు కూడా ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. కాపు, ఈబీసీ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, రెడ్డి, కమ్మ, క్షత్రియ కార్పొరేషన్లకు నిధులు ప్రకటించింది. బీసీ సంక్షేమానికి రూ.23,260 కోట్లతో బడ్జెట్‌ను రూపొందించారు. ఆదరణ కింద రూ.1,000కోట్లు, ఏపీ స్టడీ సర్కిల్‌కు రూ.10 కోట్లు, బీసీ గురుకులాలకు రూ.365.04 కోట్లు, ఏపీ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.42.02 కోట్లు, భవనాలకు రూ.25 కోట్లు, కళాశాల హాస్టళ్లకు రూ.141.80 కోట్లు, గురుకుల పాఠశాల భవనాలకు రూ.10 కోట్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూ.13.14కోట్లు, ప్రభుత్వ హాస్టళ్లకు రూ.282.28 కోట్లు కేటాయించింది. అలాగే పోస్టు మెట్రిక్, ప్రీ మెట్రిక్, ఆయా బీసీ కార్పొరేషన్లకు బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. ఎస్సీ ఎస్టీలకు ఇచ్చినట్లే బీసీల్లో నాయీ బ్రాహ్మణుల సెలూన్లకు, చేనేతలకు ఉచిత విద్యుత్తు అందించడానికి నిధులు కేటాయించారు. అర్హత కలిగిన ప్రతి బీసీ విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ వసతి కోసం విద్యార్థులకు రూ.10వేలు, రూ.15వేలు, రూ.20వేలు, బీసీ భవనాల నిర్మాణాలు, కమ్యూనిటీ హాళ్లు, బీసీ కార్పొరేషన్ల ద్వారా ఆర్థికాభివృద్ధి సంక్షేమ పథకాల అమలు, హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్ల భవనాల నిర్మాణాలు, బీసీ విద్యార్థులకు విదేశీ విద్య, పెళ్లికానుక అందించనున్నారు.

ఈడబ్ల్యూఎస్ సంక్షేమానికి రూ.10,619 కోట్లు

కాపు, ఈబీసీ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, రెడ్డి, కమ్మ, క్షత్రియ కార్పొరేషన్లకు సంబంధించి ఈడబ్ల్యూఎస్ శాఖకు రూ.10,619 కోట్లు కేటాయించారు. ఆర్యవైశ్య సంక్షేమ కార్పొరేషన్‌కు రూ.515.95 కోట్లు, బ్రాహ్మణ కార్పొరేషన్-323.73 కోట్లు, ఈబీసీ సంక్షేమ కార్పొరేషన్-860.46 కోట్లు, కమ్మ సంక్షేమ కార్పొరేషన్-1,637.52 కోట్లు, ఏపీ కాపు సంక్షేమ కార్పొరేషన్-4,672.55 కోట్లు, క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్-248.25 కోట్లు, ఏపీ రెడ్డి సంక్షేమ కార్పొరేషన్‌కు రూ.1,881.54 కోట్లు కేటాయించారు. ఆయా కార్పొరేషన్లకు స్వయం ఉపాధి ఆర్థిక కార్యకలాపాలకు విడిగా బడ్జెట్ కేటాయించారు.

సాంఘిక సంక్షేమ శాఖకు 10,909 కోట్లు

ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.2,723.80 కోట్లు, బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు రూ.30కోట్లు, అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటుకు రూ.50 కోట్లు, ప్రభుత్వ హాస్టళ్లకు రూ.627.58 కోట్లు, పీఎం అజయ్ ఆదర్శ గ్రామ యోజనకు రూ.110.46 కోట్లు, పీఎం అజయ్ హాస్టళ్లకు రూ.206.30 కోట్లు, ఎస్సీ సబ్‌ప్లాన్‌కు రూ.150 కోట్లు, ఎస్సీలకు ఉచిత విద్యుత్‌కు రూ.300 కోట్లు, ప్రభుత్వ కేంద్రీయ గురుకుల పాఠశాలలకు రూ.660 కోట్లు కేటాయించారు.

గిరిజన సంక్షేమ శాఖకు రూ.4,307 కోట్లు

గిరిజన ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.696.94 కోట్లు, పీవీటీజీల అభివృద్ధికి రూ.48.41 కోట్లు, విద్య మౌలిక వసతులకు రూ.41.29 కోట్లు, ఆర్టికల్ 275(1)కు రూ.100 కోట్లు, విద్యుత్ చార్జీల రీయింబర్స్‌మెంట్‌కు రూ.100 కోట్లు, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు రూ.201.37 కోట్లు, గిరిజన గురుకులాలకు 340 కోట్లు.


ఎల్ఈడీ వీధి దీపాలకు రూ.250 కోట్లు

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.18,848 కోట్లు కేటాయించారు. ఎల్ఈడీ వీధిదీపాలకు రూ.250 కోట్లు, రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద రూ.130 కోట్లు, ఏఐఐబీ రోడ్ల నిర్మాణాలకు రూ.795.76 కోట్లు, పీఎంజీఎస్‌వై రోడ్లకు రూ.28.46 కోట్లు, పంచాయతీరాజ్ రోడ్లకు రూ.400కోట్లు, డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాల కోసం రూ.100 కోట్లు, ఉపాధి హామీ పథకానికి రూ.5,500 కోట్లు, ఎన్ఆర్ఎల్ఎంకు రూ.690 కోట్లు, ఎన్టీఆర్ జలసిరికి రూ.50కోట్లు, ఆర్‌డబ్ల్యూఎస్ కింద తాగునీటి పైపుల నిర్వహణకు పంచాయతీలకు రూ.100 కోట్లు, జల్‌జీవన్ మిషన్ కోసం రూ.2,800 కోట్లు, స్వచ్ఛభారత్ గ్రామీణకు రూ.494 కోట్లు కేటాయించారు.



మెట్రో రైలుకు రూ.50 కోట్లు

బడ్జెట్‌లో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యమిచ్చారు. రాజధాని రైతులకు భూములిచ్చినప్పటి నుంచి 10 ఏళ్ల పాటు యాన్యుటీ చెల్లించడానికి అవసరమైన నిధులు కేటాయించారు. అమరావతి అభివృద్ధి ప్రాజెక్టుకు రూ.6వేల కోట్లు, మెట్రోరైలుకు రూ.50 కోట్లు, అమృత్ సిటీ ప్రాజెక్టులకు రూ.751.72 కోట్లు, రాజధానిలోని భూమి లేని పేదల పెన్షన్లకు రూ.115.11 కోట్లు, ఆర్థిక కమిషన్ గ్రాంట్లు, రూ.1,020 కోట్లు, రాజధాని ల్యాండ్‌పూలింగ్‌కు రూ.297.82 కోట్లు, స్మార్ట్‌సిటీల కోసం రూ.10 కోట్లు, అన్న క్యాంటీన్లకు రూ.50 కోట్లు చొప్పున కేటాయించారు.



శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ఈ ఏడాది నుంచి 'అన్నదాతా సుఖీభవ'

ఒక్కో రైతుకు రూ.20వేలు చొప్పున లబ్ధి

వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పించిన అచ్చెన్న



అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్నదాతా సుఖీభవ పథకాన్ని ఈ ఏడాది నుంచి అమలు చేస్తామని, ఇందుకు అవసరమైన నిధులు కేటాయించామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. కేంద్రం అమలుచేస్తున్న పీఎం కిసాన్ యోజనను కలుపుకొని రైతులకు రూ. 20వేలు చొప్పున లబ్ధిని ఈ పథకం కింద అందిస్తామని తెలిపారు. శుక్రవారం ఆయన అసెంబ్లీలో వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. "ఆధునిక సాంకేతికతను ఉపయోగించి రైతులకు సాగు ఖర్చులు గణనీయంగా తగ్గించడం, ప్రకృతి సేద్యం వైపు రైతులను మళ్లించడం, అధిక ఆదాయ పంటలపై దృష్టిని పెంచడం ఎగుమతికి అనువైన, సన్నరకాల వరి సాగును ప్రోత్సహించడమే లక్ష్యంగా వ్యవసాయ బడ్జెట్ రూపొందించాం' అని తెలిపారు. "వ్యవసాయ రంగంలో 15% వార్షిక వృద్ధి సాధించేందుకు 11 పంటలను గ్రోత్ ఇంజన్లుగా గుర్తించాం. 2024-25లో జీఎస్‌డీపీ మొదటి అంచనా ప్రకారం వ్యవసాయం జీవీఏ రూ.57,187కోట్లు. వ్యవసాయ రంగ వృద్ధి రేటు 22.86 శాతం. వ్యవసాయం కుంటుపడితే మరే రంగమూ ముందుకెళ్లే అవకాశం ఉండదు. అందుకే వ్యవసాయాన్ని ప్రాథమిక రంగంగా గుర్తించాం." అని అచ్చెన్నాయుడు తెలిపారు. కాగా, శాసనమండలిలో వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి నారాయణ ప్రవేశపెట్టారు.

ప్రాజెక్టులకు సై

పోలవరానికి అత్యధికంగా 6,705 కోట్లు

ఇందులో భూసేకరణకే 1,546 కోట్లు

మిగతా పథకాలకు 11,314 కోట్లు

వీటిలో హంద్రీ-నీవాకు 3,243 కోట్లు

జల వనరులకు మొత్తంగా రూ.18,019 కోట్లు

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జీవనాడి పోలవరం సహా ప్రధాన ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేసే లక్ష్యంతో టీడీపీ కూటమి ప్రభుత్వం 2025-26 వార్షిక బడ్జెట్‌లో వాటికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. మొత్తంగా జల వనరుల శాఖకు రూ.18,019 కోట్లను కేటాయించగా.. అందులో ఒక్క పోలవరం ప్రాజెక్టుకే 6,705 కోట్లు కేటాయించడం గమనార్హం. ఇతర కీలక ప్రాజెక్టులకు, జలవనరుల శాఖ పాలన, సెక్రటేరియట్‌కు కలిపి రూ.11,314 కోట్లు ప్రతిపాదించారు. వాస్తవానికి 2025-26లో ప్రాజెక్టుల పూర్తికి రూ.27 వేల కోట్లు అవసరమని ప్రీ-బడ్జెట్ సమీక్షల సందర్భంగా ఆ శాఖ కోరగా.. రూ.21 వేల కోట్లు ఇస్తామని ఆర్థిక శాఖ మాటిచ్చింది. చివరకు రూ.18,019 కోట్లకు పరిమితం చేసింది. పోలవరం ప్రాజెక్టుకు కేటాయించిన రూ.6,705 కోట్లలో భూసేకరణకు సుమారు 1,546 కోట్లు కేటాయించారు. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తికానప్పటికీ.. ఎన్నికల ముందు నాటి సీఎం జగన్ హడావుడిగా దానికి ప్రారంభోత్సవం చేసేశారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక 2024-25లో రూ.300.52 కోట్లు ఖర్చుచేసింది. ఇప్పుడు 25-26 బడ్జెట్‌లో కూడా 309.13 కోట్లు ప్రతిపాదించింది. తెలుగుగంగ ప్రాజెక్టుకు 2024-25లో 406.46 కోట్లు ఖర్చుచేయగా.. కొత్త ఆర్థిక సంవత్సరంలో రూ.840.30 కోట్లు ప్రతిపాదించారు. హంద్రీ-నీవా సుజల స్రవంతికి కూడా 3,243.64 కోట్లు ఇచ్చారు. నిరుటి కంటే (రూ.1,586.18 కోట్లు) ఇది రెట్టింపుపైనే ఉండడం విశేషం. కడప జిల్లా ప్రాజెక్టుల్లో గాలేరు-నగరి (రూ.488.57 కోట్లు), పులివెందుల కెనాల్ స్కీం(170.69 కోట్లు), మైలవరం కెనాల్-4.25 కోట్లు (తుంగభద్ర ప్రాజెక్టు) కీలకమైనవి. ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల్లో వంశధార పరిధిలో నేరడి బ్యారేజీ(182.53 కోట్లు), తోటపల్లి రిజర్వాయరు (47.81కోట్లు), తారకరామ తీర్థ సాగర్ 68 కోట్లు), మహేంద్రతనయ వరద కాలువ(90.60 కోట్లు) మొదలైనవాటికి కేటాయింపులు జరిపారు. ఒంగోలు ప్రాజెక్టుల్లో వెలిగొండ (309.13 కోట్లు), సాగర్ (5 కోట్లు), గుండ్లకమ్మ (15.50 కోట్లు) తదితర పథకాలకు.. అనంతపురం ప్రాజెక్టుల్లో తుంగభద్ర హెచ్ఎల్‌సీ స్టేజ్ 1(37 కోట్లు), స్టేజ్ 2(34.23 కోట్లు), హంద్రీ-నీవా (3,233 కోట్లు).. కర్నూలు పథకాల్లో తుంగభద్ర ఎల్ఎల్‌సీ(32 కోట్లు), కేసీ కెనాల్(183.89 కోట్లు), ఎస్ఆర్‌బీసీ(9.02 కోట్లు), గురురాఘవేంద్ర (34.06 కోట్లు), గాజులదిన్నె (11.98 కోట్లు), 68 తాగునీటి చెరువులకు రూ.37 కోట్లు ప్రతిపాదించారు. కృష్ణా డెల్టా సిస్టమ్‌కు 701.29 కోట్లు కేటాయించగా.. ఇందులో గోదావరి-పెన్నా అనుసంధానం-1కు 200 కోట్లు, చింతలపూడి ఎత్తిపోతలకు రూ.30 కోట్లు, పులిచింతలకు రూ.16.38 కోట్లు ప్రతిపాదించారు. పోలవరం ప్రాజెక్టు పరిధిలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి రూ.600 కోట్లు, పురుషోత్తపట్నం ఎత్తిపోతలకు రూ.75.51 కోట్లు, ముసురుమల్లికి 10 కోట్లు ఇచ్చారు.



బడ్జెట్ ప్రతుల బ్యాగ్‌తో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక విభాగం అధికారులు


జలవనరుల శాఖకు కేటాయింపులు ఇలా.. (రూ.కోట్లలో)

విభాగం	2025-26	2024-25
తెలుగుగంగ	840.30	406.46
తుంగభద్ర బోర్డు	318.32	331.47
కడప ఇరిగేషన్ ప్రాజెక్టులు	812.54	534.78
ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాజెక్టులు	470.38	175.49
ఒంగోలు ఇరిగేషన్ ప్రాజెక్టులు	507.17	478.11
అనంతపురం ఇరిగేషన్ ప్రాజెక్టులు	3,447.05	1,766.32
పోలవరం ప్రాజెక్టు	6,705.20	3,528.06
కర్నూలు ఇరిగేషన్ ప్రాజెక్టులు	446.35	261.48
గోదావరి డెల్టా సిస్టమ్, ధవళేశ్వరం	210.82	80.19
కృష్ణా డెల్టా సిస్టమ్, విజయవాడ	701.29	209.82
చిన్న నీటిపారుదల	694.59	732,30
జలవనరుల శాఖ సెక్రటేరియట్, ఇతరత్రా	2,865.35	2284.09
మొత్తం	18,019.66	10,798.57

ఆర్అండ్‌బీకి 8,785 కోట్లు

పీపీపీ పద్ధతిలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో రహదారుల నిర్మాణం, విస్తరణ, అభివృద్ధి వంటి కీలక ప్రాజెక్టుల కోసం రూ.8,785 కోట్లు బడ్జెట్‌లో కేటాయించింది. రాష్ట్ర ప్రధాన రహదారులను పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ) కింద తొలి దశలో 1,302 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయనుంది. దీనికోసం ఏపీఆర్‌డీసీకి 700 కోట్లు కేటాయించి పనులు చేపట్టాలని ప్రతిపాదించింది. పీపీపీ ప్రాజెక్టులకు వయబులిటీ గ్యాప్ ఫండింగ్ కోసం 2వేల కోట్లు కేటాయించింది. దీనిలోనుంచి ఆర్అండ్‌బీకి 370 కోట్లు రానున్నాయి. కోర్‌నెట్‌వర్క్ రోడ్ల కోసం 150 కోట్లు, ఆర్ఐడీఎఫ్ కోసం 250 కోట్లు, జిల్లా ప్రధాన రోడ్లకు 274 కోట్లు, రహదారులు, వంతెనల నిర్మాణం కోసం 700 కోట్లు, రైల్వే సేఫ్టీ వర్క్‌ల కోసం 270 కోట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ప్రభుత్వం రహదారుల నిర్మాణం, అభివృద్ధికి తొలి ప్రాధాన్యం ఇస్తోందని ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చెప్పారు. ఇప్పటికే 1200 కోట్లతో రాష్ట్రంలోని 17వేల కిలోమీటర్ల రహదారులపై గుంతలను పూడ్చివేశామని, త్వరలో గుంతల రహిత రోడ్లుగా మారుస్తామన్నారు.



బడ్జెట్‌లో మైనార్టీలకు పెద్ద పీట

5,434 కోట్లు కేటాయింపు.. గతంకన్నా 1,058 కోట్లు అదనం

మైనార్టీ సబ్ ప్లాన్‌కు 2,512 కోట్లు

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మైనార్టీల సంక్షేమానికి కూటమి సర్కార్ పెద్దపీట వేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.5,434 కోట్లు కేటాయించింది. ఇది గత ఏడాది కన్నా రూ.1058 కోట్లు అదనం. మైనార్టీ సబ్ ప్లాన్‌కు రూ.2,512 కోట్లు కేటాయించింది. పీఎం జన్ వికాస్ కోసం 560 కోట్లు, ముస్లిం మైనార్టీల స్వయం ఉపాధి, ఆర్థిక భరోసాకు రూ.173.57 కోట్లు, ఆర్టీఎఫ్ అండ్ ఎండీఎఫ్‌కు రూ.229 కోట్లు, ఏపీజే కలాం ఓవర్సీస్ పథకానికి రూ.20 కోట్లు, ఇమామ్‌లు, మౌజన్ల వేతనాలకు రూ.90 కోట్లు, హజ్ యాత్రికులకు రూ.14 కోట్లు ఉర్దూ అకాడమీకి రూ.10.80 కోట్లు కేటాయించింది. క్రైస్తవ మైనార్టీ ఉపాధి ఆర్థిక చేయూతకు రూ.20 కోట్లు, పాస్టర్లకు రూ.30.49 కోట్లు కేటాయించింది. జెరుసలేం యాత్రికులకు రాయితీ కోసం రూ.1.50 కోట్లు, అంబేడ్కర్ ఓవర్సీస్ పథకానికి రూ.1.50 కోట్లు, ఆర్టీఎఫ్ అండ్ ఎంటీఎఫ్‌కు రూ.12 కోట్లు కేటాయించింది. మైనారిటీల సంక్షేమ పథకాలకు గతంలో రూ.2808 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది అదనంగా మరో రూ.112.70 కోట్లు కేటాయించారు.



పరిశ్రమలకు రూ. 3,156 కోట్లు

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యమిస్తున్న కూటమి ప్రభుత్వం అందుకు తగ్గట్టుగానే రాష్ట్ర బడ్జెట్‌లో పరిశ్రమలు, వాణిజ్య శాఖకు రూ.3,156 కోట్లు కేటాయించింది. రాష్ట్రంలోని విశాఖ-చెన్నై, చెన్నై-బెంగళూరు, హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి రూ.837 కోట్లు కేటాయించింది. ఎంఎస్ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ప్రోత్సాహకాలకు రూ.1,400 కోట్లు, ఐటీఐలు, శ్రీసిటీ (ఐఐఐటీ), కాకినాడలోని హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లకు రూ.210 కోట్లు, దీన్‌దయాల్ అంత్యోదయ యోజన పథకం కింద నేషనల్ అర్బన్/రూరల్ లైవ్లీహుడ్ మిషన్‌కు రూ.745 కోట్లు, పీ4 కింద వయబులిటీ గ్యాప్ ఫండింగ్ కోసం రూ.2 వేల కోట్లు కేటాయించింది.

కౌలు రైతుకూ 20 వేలు

వ్యవసాయ యాంత్రీకరణకు ఊతం

డ్రోన్ల సేద్యంపై రూ.80 కోట్ల రాయితీ

ప్రకృతిసాగు పరిధిలోకి 2,570 క్లస్టర్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో వ్యవసాయ అనుబంధరంగాలకు బడ్జెట్‌లో రూ.48,341.14 కోట్లు కూటమి ప్రభుత్వం కేటాయించింది. వ్యవసాయ శాఖకు రూ.12,401.58 కోట్లు, ఉద్యాన శాఖకు రూ.930.88కోట్లు, పశుసంవర్ధకశాఖకు రూ.1,112.07కోట్లు, మత్స్యశాఖకు రూ.540.19కోట్లు, సహకార శాఖకు రూ.239.85కోట్లు, మార్కెటింగ్ శాఖకు రూ.315.32 కోట్లు, పట్టుపరిశ్రమకు రూ.96.22 కోట్లు కేటాయించింది. ఉచిత వ్యవసాయ విద్యుత్‌కు రూ.12,773.25కోట్లు, వ్యవసాయానికి అనుబంధమైన ఉపాధి హామీ పథకానికి రూ.6,026.87కోట్లు, ఎన్టీఆర్ జలసిరికి రూ.50కోట్లు, నీటిపారుదల శాఖకు రూ.12,903.41కోట్లు కేటాయించింది. ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీకి రూ.507.01కోట్లు, శ్రీవెంకటేశ్వర పశువైద్య వర్సిటీకి రూ.154.57కోట్లు, ఉద్యాన వర్సిటీకి రూ.98.21కోట్లు, మత్స్య వర్సిటీకి రూ.38కోట్లు కేటాయించింది. రైతులకు నేరుగా లబ్ధి చేకూర్చే 'అన్నదాతా సుఖీభవ'కు రూ.9,400కోట్లు, పంటల బీమాకు రూ.1,023 కోట్లు, విత్తన రాయితీకి రూ.240కోట్లు ప్రతిపాదించింది.

వెయ్యి డ్రోన్ కేంద్రాలు.. సన్న చిన్నకారు రైతులకు వ్యవసాయం భారం కాకుండా వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించడానికి రూ.139.65 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. అలాగే రూ.80కోట్ల రాయితీతో 1,000 డ్రోన్లతో వ్యవసాయ యాంత్రీకరణ కేంద్రాలను ఏర్పాటుచేయనున్నారు. రైతులు సాంకేతికంగా మేలైన యాజమాన్య పద్ధతులు చేపట్టడానికి 'స్మార్ట్ అగ్రికల్చర్- ప్రెసిషన్ అగ్రికల్చర్' విధానాలను తీసుకురానున్నారు. అర్హులైన కౌలు రైతులను గుర్తించి, కౌలు హక్కు కార్డులు జారీ చేసి, పంట రుణాలు, సంక్షేమ పథకాల లబ్ధిపొందేలా కొత్త కౌలు చట్టం తేవటానికి చర్యలు తీసుకుంటారు.

కుప్పం, హిందూపురం, చేబ్రోలులో ప్రాజెక్టులు

2024 ఆగస్టు, సెప్టెంబరులలో సంభవించిన భారీ వర్షాలు, వరదలతో జరిగిన పంట నష్టాలను ఈ- క్రాప్, వెబ్ పోర్టల్, రియల్‌టైమ్ గవర్నెన్స్ ఆధారంగా అంచనా వేసి, వాస్తవ సాగుదారులకు నష్టపరిహారా న్ని ప్రభుత్వం త్వరితగతిన అందించింది. పైగా పరిహారాన్ని పెంచి ఇచ్చింది. 1.85 లక్షల మంది రైతుల కు 20 రోజుల్లోనే రూ.284.56 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని నేరుగా రైతుల ఖాతాలకు జమ చేసింది. వ్యవసాయశాఖకు 2025-26లో బడ్జెట్‌లో మొత్తం రూ.12,401.58 కోట్లు ప్రతిపాదించింది. ఉద్యాన రంగంలో పెట్టుబడులు రాష్ట్ర భవిష్యత్‌కు బాసటగా నిలుస్తాయని ప్రభుత్వం పేర్కొంది. 11 రకాల ఉద్యాన పంటలను క్లస్టర్ విధానంలో ప్రోత్సహించేందుకు, ఏటా వృద్ధి రేటు 15% పైన వచ్చేలా పంటల్ని, క్లస్టర్‌లను ఎంపిక చేస్తున్నట్లు తెలిపింది. ఉద్యానశాఖకు రూ.930.88 కోట్లు ప్రతిపాదించారు. 2025-26లో పట్టు పరిశ్రమకు రూ.96.22 కోట్లు ప్రతిపాదించారు. కుప్పం, హిందూపురం, చేబ్రోలులో 'లీఫ్ టూ క్లాత్' ప్రాజెక్ట్ చేపట్టాలని ప్రతిపాదించారు.



అన్నదాతకు అండగా..

ఈ ఏడాది నుంచి 'అన్నదాత-సుఖీభవ' అమలు కానున్నది. 'సూపర్ సిక్స్'లో భాగంగా ఏటా రైతులకు రూ.20వేలు ఇస్తామన్న సీఎం చంద్రబాబు తన హామీని నెలబెట్టుకోనున్నారు. సాగు చేసే యజమానులకు కేంద్రం పీఎం కిసాన్ కింద ఇచ్చే రూ.6వేలకు తోడు రాష్ట్రం రూ.14వేలు కలిపి ఇవ్వనుం ది. ఏమాత్రం భూమి లేని కౌలురైతులకు మొత్తం రూ.20 వేలూ చెల్లించనుంది. ఏపీ ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం(ఏపీసీఎన్ఎఫ్) ద్వారా ఇప్పటికే 10.68లక్షల కుటుంబాలు 5లక్షల హెక్టార్లలో సహజ సేద్య పద్ధతులు అవలంబిస్తుండగా, కొత్తగా నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ పథకం కింద 3వేల గ్రామ పంచాయితీల్లోని 2,570 క్లస్టర్లను ప్రకృతి సేద్యం పరిధిలోకి తీసుకురానున్నట్లు వ్యవసాయ బడ్జెట్‌లో పేర్కొన్నారు.

రైతుబజార్ల ఆధునీకరణ

మార్కెటింగ్‌శాఖ కింద ఉన్న రైతుబజార్ల ఆధునీకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు కోసం 2025-26లో రూ.300కోట్ల బడ్జెట్ ప్రతిపాదించారు. మిర్చి పంటకు మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం(ఎంఐఎస్) కింద క్వింటా ఎంఐపీ ధర రూ.11,781.25గా కేంద్రం నిర్ణయించింది. ఎంఐపీ కన్నా మార్కెట్ ధర పతనమైనప్పుడు వ్యత్యాస ధరలో 50:50 నిష్పత్తిలో రైతులకు చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో 2025-26 బడ్జెట్‌లో మార్కెటింగ్ శాఖకు రూ.315.32 కోట్లు ప్రతిపాదించారు. దేశంలో సహకార ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు కేంద్రప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా 'సహకార సే సమృద్ధి' కార్యక్రమాన్ని చేపట్టింది. రాష్ట్రంలో మత్స్య, ఆక్వా రంగాన్ని కూటమి ప్రభుత్వం గ్రోత్ ఇంజన్‌గా గుర్తించింది. రాష్ట్రంలో రంగా వర్సిటీ పరిధిలో కొత్తగా 4 కృషి విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. కుప్పం, బాపట్ల, పల్నాడు, విజయనగరంలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఎన్టీఆర్ జలసిరి కింద 2025-26లో 6,667బోర్లు ఉచితంగా వేసి, 10 వేల మోటార్లు ఉచితంగా పంచాలని నిర్ణయించింది.



బడ్జెట్ 2025 - 26

గతంలో స్కాములు.. ఇప్పుడు స్కీములు

-పురందేశ్వరి



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2025-26 బడ్జెట్ ప్రజా హితంగా ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వ్యాఖ్యానించారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్యే సుజనా చౌదరి నేతృత్వంలో అమ్మ ఆసుపత్రి వైద్యులు దుర్గా శ్రీలక్ష్మి, పవన్ కుమార్, శ్రీదేవి తదితరులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ.. గతంలో స్కాములు మాత్రమే ఉండేవి. ఇప్పుడు స్కీములు అమలవుతున్నాయని వ్యాఖ్యానించారు.

ఆరోగ్యానికి భరోసా

- బడ్జెట్‌లో వైద్యఆరోగ్య శాఖకు రూ. 19,265 కోట్లు
- కుటుంబానికి రూ. 25 లక్షల ఆరోగ్య బీమా
- ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు రూ. 4 వేల కోట్లు
- ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పన, నిర్వహణకు రూ. 966 కోట్లు
- ఏజెన్సీల్లో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణానికి 111 కోట్లు



అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు ఆరోగ్య భరోసా కల్పించేందుకు వార్షిక బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ. 25 లక్షల ఆరోగ్య బీమా పథకం తీసుకువచ్చేందుకు సిద్ధం అయింది. 2025-26 బడ్జెట్‌లో ఆరోగ్యశాఖకు రూ. 19,265 కోట్లు కేటాయించింది. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు రూ. 4 వేల కోట్లు నిధులు ఇచ్చింది. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారానే ప్రభుత్వం ఆరోగ్య బీమా పథకాన్ని అమలులోకి తీసుకువస్తుంది. ఇది కాకుండా మందులు, సర్జికల్స్‌కు రూ. 600 కోట్లు, కొత్త మెడికల్ కాలేజీలకు రూ. 620 కోట్లు కేటాయించింది. ఇప్పటికే అడ్మిషన్లు పూర్తయిన రాజమండ్రి, ఏలూరు, నంద్యాల కాలేజీలకు రూ. 245 కోట్లు కేటాయించగా, కొత్తగా నిర్మాణంలో ఉన్న కాలేజీలకు రూ.375 కోట్లు ప్రభుత్వం ఇచ్చింది. గిరిజన ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు ఏర్పాటుకు రూ.111 కోట్లను కేటాయించింది. మొత్తంగా ఆరోగ్యశాఖలోని డీఎంఈకి రూ.8,784.84 కోట్లు, పబ్లిక్ హెల్త్‌కు రూ. 2,737.59 కోట్లు, ఆరోగ్యశాఖ కమిషనరేట్‌కు రూ. 5,854.60 కోట్లు, సెకండరీ హెల్త్‌కు రూ. 1,538.51 కోట్లు కేటాయించింది.

మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత

ప్రభుత్వాసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సర్కారు ప్రాధాన్యతనిచ్చింది. సెకండరీ హెల్త్ ఆస్పత్రుల ఉన్నతీకరణకు రూ. 251 కోట్లు, మౌలికసదుపాయాల నిర్వహణకు రూ.272 కోట్లు, ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.183.59 కోట్లు, ఎమర్జెన్సీ రెస్పాన్స్‌ను బలోపేతానికి రూ.149.95 కోట్లు కేటాయించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యపరీక్షలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పనకు రూ.111.21 కోట్లు కేటాయించారు. మొత్తంగా ఆస్పత్రుల్లో వివిధ మార్గాల్లో మౌలిక సదుపాయాల కల్పన, నిర్వహణకు రూ.966 కోట్లు కేటాయించింది.

108, 104 వాహనాలకు రూ. 317 కోట్లు

108 అంబులెన్సులు, 104 వాహనాల నిర్వహణను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. దానిలో భాగంగానే రెండు పథకాలకు కలిపి రూ. 317.93 కోట్లు బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది. 108 అంబులెన్సులు నిర్వహణకు రూ. 189.44 కోట్లు, 104 వాహనాల నిర్వహణకు రూ. 128.49 కోట్లు ప్రతిపాదించింది.

పండంటి ప్రగతికి 10 సూత్రాలు!

(మొదటి పేజీ తరువాయి)

'పది సూత్రాలు' నిర్దేశించుకున్నారు. పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నీటి సంరక్షణ, వ్యవసాయం-అభివృద్ధి, రవాణా సదుపాయాల మెరుగుదల, తక్కువ ఖర్చుతో ఇంధన ఉత్పత్తి, స్వచ్ఛాంధ్ర, టెక్నాలజీ విస్తృత వినియోగం, తక్కువ ధరలతో అత్యుత్తమ నాణ్యమైన ఉత్పత్తుల తయారీ... ఈ పది సూత్రాలతో 2047 నాటికి రాష్ట్రాన్ని దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టాలని నిర్ణయించారు. ఈ దీర్ఘకాలిక ప్రణాళికకు అనుగుణంగా 2025-26 బడ్జెట్‌ను రూపొందించారు.

మూలధన వ్యయం పెంచుతూ...

రాష్ట్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన వ్యయం అవసరం. ఇప్పుడు పెట్టే మూలధన వ్యయమే (క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్) రేపు సంపద సృష్టిస్తుంది. అభివృద్ధికి బాటలు వేస్తుంది. మూలధన వ్యయానికి ఖర్చు పెట్టకపోతే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దివాలా తీస్తుందన్న ప్రాథమిక సూత్రాన్ని పాటించి... దీనికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం మూలధన వ్యయం కోసం 59 శాతం ఖర్చు చేస్తే, 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం కేవలం 22 శాతం ఖర్చు చేసింది. జగన్ పాలనలో 60 శాతం తగ్గిన మూలధన వ్యయాన్ని కూటమి ప్రభుత్వం ఇప్పుడు గాడిలో పెట్టింది. పెట్టుబడుల వ్యయాన్ని రెట్టింపు చేసి... ఏకంగా రూ.40,635 కోట్లు కేటాయించింది.

జనమే బలం...

సకలవర్గాల సమ్మిళిత ప్రగతి, సాధికారత... ఈ జంట సూత్రాలతో రాష్ట్ర ప్రగతిని మార్చవచ్చునని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా... మానవ వనరులను పెంపొందించడం... వారిని నిపుణులుగా తీర్చిదిద్దడం... పేదరిక నిర్మూలన... శుభ్రమైన పరిసరాల్లో నివాసానికి 'స్వచ్ఛాంధ్ర' సాధనకు సంబంధించిన పద్దులకు ఏకంగా రూ.1,42,349 కోట్లు కేటాయించింది. ఇందులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకోసమే 27,518 కోట్లు ఖర్చు చేయనుంది. తల్లికి వందనం పథకం కోసం రూ.9,407 కోట్లు, స్వచ్ఛాంధ్ర కోసం రూ.820 కోట్లు కేటాయించారు.

రథ చక్రాలు...

- ఆర్థిక, సాంకేతిక ప్రగతితో రాష్ట్రాభివృద్ధి వేగిరమవుతుందనే ఉద్దేశంతో సంబంధిత రంగాలపై ప్రత్యేక దృష్టి సారించారు. వీటికి ఏకంగా 55,730 కోట్లు కేటాయించారు. అమరావతిని 'గ్రోత్ ఇంజిన్'గా భావిస్తున్న నేపథ్యంలో... నూతన నగరాభివృద్ధికోసం బడ్జెట్‌లో రూ.6వేల కోట్లు వెచ్చించనున్నారు. ఇక... మౌలిక సదుపాయాలకు సంబంధించి మచిలీపట్నం, భావనపాడు, కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టులు..
- భోగాపురం, విజయవాడతోపాటు రీజనల్ ఎయిర్‌పోర్టులు, కొత్త పారిశ్రామిక నోడ్స్ కోసం రూ.605 కోట్లు కేటాయించారు. ఇంధన రంగానికి రూ.13,600 కోట్లు... రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కోసం రూ.10 కోట్లు, ఆర్టీజీఎస్, సీఎం కాల్ సెంటర్ కోసం రూ.101 కోట్లు, ఐటీ, ఎలక్ట్రానిక్ పరిశ్రమలకు ప్రోత్సాహకాల కోసం రూ.300 కోట్లు కేటాయించారు.

విద్యుత్ సబ్సిడీ భారం రూ.13,600 కోట్లను రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది. వ్యవసాయం, పారిశ్రామిక రంగం, అర్హులైన ఎస్సీఎస్టీ లబ్ధిదారులకు సబ్సిడీలు, రాయితీలను పూర్తిగా భరిస్తామని బడ్జెట్‌లో స్పష్టం చేసింది.

ఇదీ మార్గం... ఇదీ లక్ష్యం

2047 నాటికి స్వర్ణాంధ్ర సాధన, రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలివి! వీటి ఆధారంగానే 'స్వర్ణాంధ్రకు పది సూత్రాలు' రూపొందించి, బడ్జెట్‌లో కేటాయింపులు జరిపింది.

- ప్రస్తుతం 5.3 కోట్లుగా ఉన్న రాష్ట్ర జనాభా 2047 నాటికి 5.8 కోట్లకు చేరాలి.
- 70.6 ఏళ్లుగా ఉన్న సగటు ఆయుఃప్రమాణం 85 ఏళ్లకు పెరగాలి.
- 36 శాతం ఉన్న పట్టణ జనాభాను 60 శాతానికి పెంచాలి.
- 72 శాతం ఉన్న అక్షరాస్యత రేటును 100 శాతానికి చేర్చాలి.
- ఉపాధి, ఉద్యోగ రంగాల్లో ప్రస్తుతం 45.8 శాతం మాత్రమే ఉన్న మహిళల భాగస్వామ్యాన్ని 80 శాతానికి పైగా పెంచాలి.
- ప్రస్తుతం 170 బిలియన్ డాలర్లుగా ఉన్న జీఎస్‌డీపీని 2.4 ట్రిలియన్ డాలర్లకు పెంచాలి.
- ప్రస్తుతం 3,200 డాలర్లుగా ఉన్న తలసరి ఆదాయాన్ని 42,000 డాలర్లకు చేర్చాలి.
- ఇప్పుడు 19.3 బిలియన్ డాలర్లుగా ఉన్న ఎగుమతులు 450 బిలియన్ డాలర్లకు పెరగాలి.
- వచ్చే ఐదేళ్లలో వృద్ధిరేటును రెండింతలు పెంచి 29.29 శాతానికి చేర్చాలి.

ప్రగతి బాటలు...

పారిశ్రామిక అభివృద్ధి, నైపుణ్యం పెంపు, ఉపాధి కల్పన... ప్రగతి సాధనకు ఇవి కీలకం. వీటి కోసం ఈ బడ్జెట్‌లో రూ.12,112 కోట్లు కేటాయించారు. ఇందులో భాగంగా... విశాఖ - చెన్నై, చెన్నై-బెంగళూరు, హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి రూ.837 కోట్లు ఖర్చు చేయనున్నారు. పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, ఎంఎస్‌ఎంఈలకు ప్రోత్సాహకాల కోసం రూ.1400 కోట్లు, పీపీపీపీ విధానంలో వీజీఎఫ్ (వయబులిటీ గ్యాప్ ఫండింగ్) కోసం రూ.2,000 కోట్లు కేటాయించారు. దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన - అజీవికా కోసం రూ.745 కోట్లు కేటాయించగా... ఐటీఐ, ఐఐఐటీ, స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (కాకినాడ) కోసం రూ.210 కోట్లు ఖర్చు చేయనున్నారు.


'కృషి'తో నాస్తి దుర్భిక్షం...

సాగు బాగుంటే... దుర్భిక్షం ఉండదు! అందుకే... వ్యవసాయం, నీటి సంరక్షణ పద్దులకు రూ.29,655 కోట్లు కేటాయించారు. ఇందులో 'అన్నదాత సుఖీభవ' పథకం వాటాయే రూ.6300 కోట్లు. అలాగే... ధరల స్థిరీకరణ నిధి కోసం రూ.300 కోట్లు కేటాయించారు.

విద్యుత్ సబ్సిడీ 13,600 కోట్లు



బడ్జెట్ సమర్పణ సమయంలో ఎమ్మెల్యేలతో నిండిన శాసనసభ



- 1,36,740 కోట్లు
- 1,01,080 కోట్లు
- 84,538 కోట్లు

ఏ రంగానికి ఎంత?

విధ్వంసం నుంచి నిర్మాణం దిశగా...

సంక్షేమ, సంతులిత బడ్జెట్

- బడ్జెట్‌పై మంత్రులు, ప్రజా ప్రతినిధుల ప్రశంసలు

అమరావతి, రేపల్లె, భీమవరం, తుని, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్ద పీట వేశారు. సూపర్ సిక్స్ సహా మేనిఫెస్టోలోని హామీల అమలుకు బడ్జెట్‌లో ప్రాధాన్యం కల్పించి మాట నిలబెట్టుకునేందుకు ప్రభుత్వం ముందుకు వెళ్తోంది' అని పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు ప్రశంసించారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ.. 'హామీ మేరకు వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచాం. 6,100 మంది పోలీస్ కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది' అన్నారు. జగన్ విధ్వంస పాలన నుంచి నిర్మాణం వైపు నడిచేలా రాష్ట్ర వార్షిక బడ్జెట్ స్ఫూర్తినిచ్చిందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.

ఐదేళ్ల తర్వాత గొప్ప బడ్జెట్: మంత్రి మనోహర్

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్... గత ప్రభుత్వ విధ్వంసం తర్వాత ఆర్థిక పరిస్థితులను బేరీజు వేసుకుని ప్రతిపాదించిన గొప్ప బడ్జెట్ అని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. 'ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమానికి జనసేన పార్టీ నుంచి సహకారాత్మక వైఖరి ఉంటుంది. పిఠాపురం నియోజకవర్గంలో పట్టు రైతుల కష్టాలపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధ చూపారు. పట్టు రైతులకు మేలు చేసేలా లీఫ్ టూ క్లాత్ కార్యక్రమాన్ని వ్యవసాయ బడ్జెట్‌లో పెట్టిన మంత్రి అచ్చెన్నాయుడుకు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. గత పాలకుల విధ్వంస పాలన వల్ల ఏర్పడిన ఆర్థిక ఇబ్బందులు ఉన్నా... సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సంతులిత బడ్జెట్‌ని ఆర్థిక మంత్రి కేశవ్ ప్రవేశ పెట్టారని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. విద్య, వైద్య, వ్యవసాయం, అభివృద్ధి, సామాజిక సంక్షేమం.. ప్రాధాన్యంతో వికసిత భారత్‌లో స్వర్ణాంధ్రను భాగస్వామ్యం చేసే బడ్జెట్ అని ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు.

ఇది ప్రజల బడ్జెట్: కేంద్ర మంత్రి భూపతి రాజు

'కూటమి ప్రభుత్వం ప్రజల బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. పేద, మధ్య తరగతి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రవేశపెట్టిన అత్యుత్తమమైన బడ్జెట్ ఇది. వ్యవసాయ రంగంతో పలు రంగాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయింపు వంటివి చూస్తుంటే గత ప్రభుత్వంలా ఓట్ల కోసం కాకుండా రాష్ట్ర దీర్ఘకాలిక ప్రయోజనాలను మాత్రమే దృష్టిలో పెట్టుకొని ప్రవేశపెట్టిన అత్యుత్తమమైన బడ్జెట్‌గా ఉంది' అని కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు.

సంక్షోభాల నుంచి గట్టెక్కిస్తుంది: యనమల

'ఈ బడ్జెట్ రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభాల నుంచి గటెక్కిస్తుంది. బడ్జెట్ పద్దులు బేసిక్‌గా ఉన్నాయి. ఆర్థిక లోటు, రుణ తగ్గింపులకు సూచికగా ఈ బడ్జెట్ నిలుస్తుంది. ఆర్థిక వివేకంతో అడుగులు వేస్తున్న కూటమి ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం అంచనాలు ఆర్థిక వృద్ధికి వాస్తవికంగా ఉంది' అని రాష్ట్ర మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు వ్యాఖ్యానించారు.



రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు

'స్వర్ణాంధ్ర' సాకారం: ఏపీ చాంబర్స్ హర్షం

'స్వర్ణాంధ్ర విజన్-2047ను సాకారం చేసే బడ్జెట్‌ను కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. సంక్షేమ కార్యక్రమాలకు కేటాయింపులతోపాటు అభివృద్ధికి దోహదపడే ఈ బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం' అని పరిశ్రమల సమాఖ్య (ఏపీ చాంబర్స్) అధ్యక్షుడు పొట్లూరి రామారావు తెలిపారు.

వడ్డీలకు 18 శాతం సంక్షేమానికి 18 శాతం

- పథకాల ఖర్చుతో సమానంగా రుణాల చెల్లింపులు
- సగటు ఆదాయంలో 32% అప్పుల ద్వారానే రాక
- సంక్షేమం సాగాలంటే అప్పులు చేయాల్సిందే

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేసే ఖర్చులో సగటున రూపాయిలో 18 పైసలు తిరిగి అప్పులకు అసలు, వడ్డీల చెల్లింపులకు వెళ్తోంది. సంక్షేమానికి కూడా సగటున 18 పైసలే ఖర్చు చేస్తోంది. అంటే.. రుణాలు, వడ్డీల చెల్లింపులకు చేస్తున్న వ్యయం, సంక్షేమంపై చేస్తున్న ఖర్చు సమానంగా ఉంటున్నాయి. బడ్జెట్‌లో రూపాయి రాక, రూపాయి ఖర్చు గురించిన వివరాలను ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్ర స్థూలాదాయం తగ్గడం, ఖర్చుపై నియంత్రణ లేకపోవడంతో సగటున ఒక రూపాయిలో అప్పులు, ఖర్చుల వాటా పెరిగిపోతోంది. సర్కారుకు వచ్చే ఆదాయంలో సగటున 32 పైసలు అప్పులు, ఇతర మార్గాల ద్వారా జమ అవుతున్న సొమ్మే ఉంటోంది. చేస్తున్న ఖర్చులో వేతనాలు, ఇతర ఖర్చులు, వడ్డీల చెల్లింపులకే 43 పైసలు పోతోంది. మిగిలిన 53 పైసలు నికరంగా రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం వినియోగిస్తున్నారు. సంక్షేమ రంగం మరింతగా ముందుకు సాగాలంటే ఆదాయం పెరగాలి. ఆదాయం పెరగాలంటే పన్నుల భారం పెంచాలి. ప్రజలపై కొత్తగా పన్నుల భారం వేసేది లేదని ప్రభుత్వం చెబుతోంది. కాబట్టి ఆదాయం పెంచుకోవాలంటే సర్కారుకున్న ఏకైక మార్గం కొత్తగా అప్పులు తీసుకురావడమే. గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఆర్థిక, పారిశ్రామిక, వాణిజ్య రంగాలు గణనీయంగా అభివృద్ధి చెంది.. పన్నులు, పన్నేతర రూపంలో వచ్చే ఆదాయం కనీసం 55 శాతం దాటి ఉంటే, అప్పుల భారం తగ్గేదని నిపుణులు చెబుతున్నారు. కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటా పెరగకపోవడం, పన్నుల ద్వారా వచ్చే ఆదాయంలో వృద్ధి లోపించడంతో మరో దారిలేక అప్పులపైనే ఆధారపడే పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు. సంక్షేమ రంగం, వాటితో ముడిపడిన ఇతర రంగాలు సజావుగా కొనసాగాలంటే సొంత ఆదాయ మార్గాలు పెంచుకోక తప్పదని సూచిస్తున్నారు.

బడుగులకు గృహావరం

- బడ్జెట్‌లో గృహ నిర్మాణానికి 6,318 కోట్లు

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): బడుగుల సొంతింటి కల నెరవేర్చడానికి కూటమి సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. ఇళ్ల నిర్మాణానికి బీసీలు, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75వేల చొప్పున అదనపు సాయం ప్రకటించింది. ఎస్సీలు, ఎస్టీలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించగా, బీసీలకూ అదనపు సాయం చేయాలని కేబినెట్ సమావేశంలో నిర్ణయించింది. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్ల లబ్ధిదారులతో పాటు కూటమి ప్రభుత్వం కొత్తగా పీఎంఏవై 2.0 కింద మంజూరు చేయనున్న ఇళ్లకు కూడా ఈ సాయం వర్తిస్తుంది. పేదల ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.1.50 లక్షల రాయితీకి ఇది అదనం. రాష్ట్రంలో అర్హులైనవారందరికీ పక్కా ఇళ్లు నిర్మిస్తామన్న ఎన్నికల హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చనుంది. బడ్జెట్‌లో రూ.6,318 కోట్లు కేటాయించడం ద్వారా బడుగులకు భరోసా కల్పించింది. జగనన్న కాలనీల పేరుతో ఇళ్లు కాదు ఊళ్లే నిర్మిస్తున్నామంటూ గొప్పలు చెప్పిన గత వైసీపీ ప్రభుత్వం చివరికి రూ.4,737 కోట్ల మేర చెల్లించకుండా నిధులు దారి మళ్లించింది. దీంతో రాష్ట్రంలో లక్షలాది మంది పేదల సొంతింటి కల నెరవేరకుండా పోయింది. ఇలా నష్టపోయిన లబ్ధిదారుల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందినవారే ఎక్కువ. రాష్ట్రవ్యాప్తంగా అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్లను పూర్తి చేసేందుకు ఎస్సీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేల చొప్పున అదనపు సాయం అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. పేదల ఇళ్ల నిర్మాణానికి భరోసా కల్పిస్తూ రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించారు.

బీసీలకు సాయానికి కేబినెట్ ఓకే

గత వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు కేటాయించిన ఇళ్లు కూడా చాలావరకు అసంపూర్తిగా మిగిలిపోయాయని, వారికి కూడా రూ.50 వేలు చొప్పున అదనపు సాయం అందించాలనే ప్రతిపాదనపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. బడ్జెట్‌కు ఆమోదం తెలిపేందుకు శుక్రవారం ఉదయం జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా 3.5 లక్షల మంది బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు చొప్పున అదనపు సాయమందిస్తే ప్రభుత్వంపై దాదాపు రూ.2 వేల కోట్ల మేర అదనపు భారం పడనుంది. ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీలకూడా ఇళ్ల నిర్మాణానికి రూ.50 వేలు అదనపు సాయం అందించడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది.

గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ఇళ్లన్నీ పూర్తిచేస్తాం

- ఇంటి నిర్మాణ విలువ 1.80 నుంచి 2.5 లక్షలకు పెంపు
- 9 నెలల్లో పూర్తి లక్ష్యం: మంత్రి పార్థసారథి



అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయడానికి తమ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన గృహాల్లో ఇంకా 5.5 లక్షల గృహాలు మొదలు కావాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం, యూనిట్ కాస్ట్ తక్కువగా ఉండడం, సిమెంట్ ధరలు తదితర కారణాల వల్ల నిర్మాణాలు అనుకున్నవిధంగా పూర్తి కాలేదన్నారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణ పూర్తికి సీఎం చంద్రబాబు చర్యలు చేపట్టారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల ఇళ్ల నిర్మాణానికి అదనపు సాయం అందించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై రూ.4,135 కోట్ల భారం పడిందన్నారు. గృహ నిర్మాణానికి సంబంధించి గత ప్రభుత్వం యూనిట్ కాస్టుగా రూ.1,80,000 చెల్లిస్తే ప్రస్తుతం యూనిట్ కాస్ట్‌ను రూ.2.5 లక్షలుగా నిర్ణయిస్తూ మంత్రిమండలి ఆమోదం తెలిపిందన్నారు. జల్ జీవన్ మిషన్ కింద రూ.2,010 కోట్ల విలువైన 7,797 పనులను చేపట్టేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపిందన్నారు. ఈ పనులన్నింటినీ తొమ్మిది నెలల్లో పూర్తి చేయాలనే లక్ష్యాన్ని కూడా నిర్దేశించడం జరిగిందన్నారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో గవర్నర్ ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగానికి క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు.

అంకెల్లో బడ్జెట్(రూ.కోట్లు)

మొత్తం బడ్జెట్:	3,22,359.33
రాబడి:	2,17,976.53
అప్పులు:	1,04,382.80
ఖర్చులు:	3,22,359.33
రెవెన్యూ లోటు:	33,185.97

రాబడికి మించి ఖర్చు!(రూ.కోట్లు)

రెవెన్యూ వ్యయం	2,51,162.5
మూలధన వ్యయం	40,635.72

అప్పుల కోసమే 60 కోట్లు(రూ.కోట్లు)

అప్పులపై చెల్లించే వడ్డీ	34,998.12
చెల్లించే అసలు	24,430.16
కేంద్ర రుణాల చెలింపునకు	6,130.00

అప్పు తెచ్చినా ఆదాయం పెంచేలా!

2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.1,04,382.80 కోట్లు అప్పు తేవాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. దీనిలో రూ.33,185 కోట్లను రెవెన్యూ లోటు సరిచేసేందుకు కేటాయిస్తారు. మిగిలిన సొమ్మును పెట్టుబడులకు వినియోగించి ఆదాయం పెరిగేందుకు ప్రాధాన్యం ఇస్తారు. మరి కొంత మొత్తంతో పాత అప్పుల్లో అసలును చెల్లిస్తారు.



లోటు మెరుగు!

గత రెండేళ్లతో పోల్చుకుంటే మెరుగు పడుతోంది.

జీఎస్‌డీపీ అంచనా 18,25,000	
జీఎస్‌డీపీలో రెవెన్యూ లోటు:	1.82%
బడ్జెట్ లోటు:	4.38%
ప్రాథమిక లోటు:	2.46%
జీఎస్‌డీపీలో అప్పు:	35.00%
వృద్ధిరేటు	13.63%

రాబడి(రూ.కోట్లు)

2022-23:	1,57,768
2023-24:	1,73,767
2024-25:	1,76,031
2025-26:	2,17,977



బడ్జెట్ 2025 - 26

తొందరపడ్డ పయ్యావుల

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శాసనసభలో తొందరపడ్డారు. శుక్రవారం ఉదయం రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆయన.. సభాపతి అనుమతి ఇవ్వక ముందే బడ్జెట్ ప్రసంగాన్ని మొదలు పెట్టేయడం చర్చనీయాంశమైంది. సభా సంప్రదాయాల ప్రకారం సభాపతి ఆ రోజు సభలో చర్చించే అంశాలను వివరించి సభను ప్రారంభిస్తారు. బడ్జెట్ రోజు సభాపతి సభను ప్రారంభిస్తూ సభ్యులనుద్దేశించి.. 'ఇప్పుడు ఆర్థిక శాఖా మాత్యులు వార్షిక నివేదిక (బడ్జెట్)ను ప్రవేశపెడతారు' అని ప్రకటిస్తారు. ఆ తర్వాత ఆర్థిక మంత్రి లేచి నిలబడి.. 'అధ్యక్షా! మీ అనుమతితో రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను సభ ముందు ఉంచుతున్నాను' అంటూ తన బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించాలి. గత ఏడాది ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు స్పీకర్ అనుమతిచ్చిన తర్వాతనే పయ్యావుల తన బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించారు. కానీ శుక్రవారం ఉదయం స్పీకర్ అయ్యన్నపాత్రుడు సభాపతి స్థానంలోకి వచ్చీ రాగానే.. మంత్రి పయ్యావుల తన బడ్జెట్ ప్రసంగాన్ని మొదలు పెట్టేశారు.

పునర్నిర్మాణం సవాలే!

"కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్ర రుణపరిమితి సున్నాకు చేరింది. అప్పు తీసుకునే శక్తి లేని ఏకైక రాష్ట్రం ఏపీయే. ఇంతటి ఆర్థిక దుస్థితిలోనూ అభివృద్ధినీ, సంక్షేమాన్నీ సమపాళ్లలో అందించగలుగుతున్నాం. నిజానికి, చంద్రబాబుకు సవాళ్లు కొత్త కాదు. జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితుల్లో ఆయన ముఖ్యమంత్రిగా తొలిసారి బాధ్యతలు తీసుకున్నారు. సాహసోపేత నిర్ణయాలు, సంస్కరణలు చేపట్టి పరిస్థితిని చక్కదిద్దారు. ఇప్పుడు తిరిగి అలాంటి పరిస్థితే పునరావృతమైంది. అయినా, తక్కువ సమయంలోనే మేనిఫెస్టోలోని ప్రధాన హామీలను అమలుచేయగలిగాం."

- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

అయినా తక్కువ సమయంలోనే పురోగతి.. కూటమి వచ్చేనాటికి రాష్ట్ర రుణసామర్థ్యం జీరో
వైసీపీ నిర్వాకంతో అప్పు చేసే శక్తినీ కోల్పోయాం.. రాష్ట్రంలో నాడు ఆర్థిక విధ్వంసకర వాతావరణం
ప్రతిశాఖలోనూ ఆర్థిక అరాచకమే.. ప్రజాస్వామ్యం అంటే గౌరవం లేని పాలనతో ఇక్కట్లు
ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడి.. రూ.3,22,359 కోట్ల రాష్ట్ర బడ్జెట్ సమర్పణ
ప్రసంగంలో స్వామినాథన్, నేతాజీ, శ్రీశ్రీల ప్రస్తావన



అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక విధ్వంసానికి గురైన ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి నిలబెట్టడమే లక్ష్యంగా రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందించామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. రుణసామర్థ్యం జీరోకు చేరుకున్న ఒకే ఒక రాష్ట్రంగా ఉన్న ఏపీలో బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయడం అత్యంత క్లిష్టతరమైన ప్రక్రియ అని, ముఖ్యమంత్రి చంద్రబాబు అందించిన స్ఫూర్తితోనే ఈ ప్రక్రియను పూర్తి చేయగలిగామని తెలిపారు. శుక్రవారం శాసనసభలో రూ.3,22,359 కోట్ల రాష్ట్ర బడ్జెట్‌ను పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారు. "గత పాలకులు ప్రతి శాఖలోనూ ఆర్థిక అరాచకం చేశారు. ఈ పరిస్థితుల్లో బడ్జెట్‌ను ఎలా రూపొందించాలని తలలు పట్టుకుంటున్న స్థితిలో ముఖ్యమంత్రి చెప్పిన మాటలు మార్గదర్శకంగా నిలిచాయి. అణుదాడిలో విధ్వంసమైన హిరోషిమా నగరం లేచి నిలబడగా లేనిది.. ఆర్థిక విధ్వంసం జరిగిన ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి నిలబెట్టలేమా? అంటూ ఆయన ప్రేరేపించారు" అని ఆయన తెలిపారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్ర పరిస్థితులను సమీక్షించి, లోతైన విశ్లేషణలు జరిపి శ్వేతపత్రాల ద్వారా గత ప్రభుత్వం దుష్పరిపాలనను ప్రజల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర పరిస్థితి దిశా నిర్దేశం లేకుండా అస్తవ్యస్తంగా ఉందని గుర్తించామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని సంస్థలన్నీ నాశనమయ్యాయని, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందని, అప్పులు భారీగా పెరిగాయని తెలుసుకున్నామని తెలిపారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రాష్ట్ర పునర్నిర్మాణం పెద్ద సవాల్ అని, దీనిని అధిగమించడానికి ఎంతో ధైర్యం, ఆశావహ దృక్పథం గల నాయకత్వం అవసరమని చెప్పారు. చంద్రబాబు రూపంలో తమకు అటువంటి ప్రేరణ లభించిందని పయ్యావుల కేశవ్ తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

మాట నిలబెట్టుకున్నాం..: "గత ప్రభుత్వంలో ఆర్థిక వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. జీతాలు కూడా సకాలంలో చెల్లించలేకపోయారు. అభివృద్ధి కార్యకలాపాలన్నీ నాడు నిలిచిపోయాయి. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆర్థిక వాతావరణం సహకరించకపోయినా, అతి తక్కువ సమయంలోనే మేనిఫెస్టోలోని ప్రధాన హామీలను నెరవేర్చాం. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను నెలకు రూ.4 వేలకు పెంచాం. పేదల కోసం 204 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశాం. దీపం 2.0 పథకం కింద ఉచిత సిలిండర్లు ఇస్తున్నాం. అర్చకులు, ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవవేతనం పెంచాం. 16,347 ఉపాధ్యాయ పోస్టుల నియామక ప్రక్రియకు శ్రీకారం చుట్టాం. అధికారంలోకి రావడానికి ముందు ప్రజలకు ఇచ్చిన మాట నిలుపుకొన్నాం."

జనామోదమే ప్రధానం

"ప్రభుత్వం చేసే ప్రతి పనీ ప్రజల ఆమోదంతో చేయాలనేది సీఎం చంద్రబాబు ఆలోచన. ప్రజలను ఒప్పించి ముందుకు సాగడం ప్రజాస్వామ్యంలో నిరంతర ప్రక్రియ. ప్రభుత్వం ప్రతి రూపాయినీ లెక్కించి, ప్రతి శాఖతో లోతుగా చర్చించి, ప్రతి అవసరాన్ని గుర్తించి, భవిష్యత్తు సవాళ్లను విశ్లేషించి బడ్జెట్‌ను రూపొందించింది. వ్యవసాయం గాడితప్పితే మరేదీ సక్రమంగా సాగబోదన్న వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మాటలు గుర్తు చేసుకోవాలి. "బడ్జెట్ అనగానే రూపాయి రాక-పోక, కేటాయింపులు, అప్పులు, ఆదాయం, ఖర్చులు, లోటు, మిగులు, రెవెన్యూ వ్యయం, మూలధన వ్యయం. సామాన్యునికి అర్థం కాని పడికట్టు పదాలివి. ప్రజల భాషలో వారికి బడ్జెట్ అర్థమయ్యేలా వివరించాల్సిన బాధ్యత మనదే."

పయ్యావుల నోట శ్రీశ్రీ మాట..

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తన బడ్జెట్ ప్రసంగంలో పలు సూక్తులు ఉటంకించారు.

- "సామాన్యుల సంతోషమే రాజు సంతోషం. వారి సంక్షేమమే ఆయన సంక్షేమం." - కౌటిల్యుడు
- "ప్రజలకు సంక్షేమాన్ని అందించడమే అధికారం ఏకైక విధి." - బెంజమిన్ డిస్రేలి
- "మహిళకు మీరు సాధికారత కల్పిస్తే మొత్తం సమాజాన్ని ఉద్ధరించినట్టే." - సావిత్రిబాయి ఫూలే
- "మీరు సంవత్సరానికి ప్రణాళిక వేస్తే వరి నాటండి. దశాబ్దానికి ప్రణాళిక వేస్తే చెట్లు నాటండి. జీవితకాలానికి ప్రణాళిక వేస్తే ప్రజలకు విద్య నేర్పండి." - చైనా సామెత
- "గ్రామాలు శక్తి సంపన్నమైన, స్వయం సమృద్ధి, సాధికారతలతో తులతూగకపోతే దేశాభివృద్ధి అసంపూర్తిగానే ఉండిపోతుంది." - దీన్‌దయాళ్ ఉపాధ్యాయ
- "ఈ భూమిపైన ఏదైనా అద్భుతం ఉందంటే అది నీరే." - లోరెన్ ఐస్లీ
- "తెలుగ దేలయన్న దేశంబు తెలుగేను. తెలుగు వల్లభుండ తెలుగొకండ. ఎల్ల నృపులు గొలువ ఎరుగవే బాసాడి. దేశ భాషలందు తెలుగు లెస్స" - శ్రీకృష్ణదేవరాయలు
- "నాకు రక్తాన్నివ్వండి, నేను మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను." - సుభాష్ చంద్రబోస్
- "నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను..." - శ్రీశ్రీ

బడులకు ఉచిత విద్యుత్

పాఠశాలల నిర్వహణ వ్యయంపై ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై బడులకు ఉచిత విద్యుత్ అందించనున్నట్టు బడ్జెట్‌లో ప్రకటించింది. బడులకు ఉచితంగా ఇచ్చే విద్యుత్ భారాన్ని ప్రభుత్వమే భరించనుంది. సుదీర్ఘకాలంగా పాఠశాలలకు కేటాయించే కాంపోజిట్ గ్రాంట్ నుంచి విద్యుత్ బిల్లులను చెల్లిస్తున్నారు. దీంతో ఇతర అవసరాలకు ఒక్క రూపాయి కూడా ఉండట్లేదు. ఈ సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన గత ప్రభుత్వంలోని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ... విద్యుత్ బిల్లులు కట్టొద్దని ఓ ప్రకటన చేశారు. కానీ దాన్ని అమలుకు చర్యలు తీసుకోలేదు. దీంతో విద్యుత్ పంపిణీ సంస్థలు పాఠశాలలకు నోటీసులు జారీ చేశాయి. కొన్నిచోట్ల విద్యుత్ కనెక్షన్లు కట్ చేశాయి. దీంతో ఈ బిల్లులు ఎవరు కట్టాలనేది పెద్ద ప్రశ్నగా మారింది. దీనికి శాశ్వత పరిష్కారం చూపుతూ ప్రభుత్వం బడులకు ఉచిత విద్యుత్ ప్రకటించింది.

ప్రజారాజధాని అమరావతి...

"మహారాష్ట్ర అభివృద్ధికి ముంబై ఎంత కీలకమో, తెలంగాణ వృద్ధికి హైదరాబాద్ ఎంత ముఖ్యమో, మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడానికి అమరావతి నిర్మాణం కూడా అంతే అవసరం. రాజధాని నిర్మాణం కోసం బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించడం లేదు. కానీ రాజధాని పనులు ప్రారంభం కాబోతున్నాయి. సీఎం చెప్పినట్లు అమరావతి సెల్ఫ్ సస్టయినబుల్ ప్రాజెక్టుగా అవతరించనుంది. తనకు తానే ఆర్థిక వనరులు సంపాదించుకునే సామర్థ్యం అమరావతికి ఉంది. పోలవరం-బనకచెర్ల నదుల అనుసంధాన ప్రాజెక్టు ఏపీకి గేమ్ చేంజర్ కానుంది. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం(పీపీపీ)విధానంలో అభివృద్ధి పనులను చేపట్టేందుకు ఆలోచనలు చేస్తున్నాం. దీనికోసం రూ.రెండు వేల కోట్ల కార్పస్ ఫండ్‌తో కొత్త పథకాన్ని అమలు చేయనున్నాం."

9,407 కోట్లతో 'తల్లికి వందనం' అమలు

» ఈ సంవత్సరం నుంచి పథకం అమలు

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీల్లో మరో కీలక హామీ అమలుకు కూటమి ప్రభుత్వం ముందడుగు వేసింది. 'తల్లికి వందనం' పథకానికి 2025-26 బడ్జెట్‌లో రూ.9,407 కోట్లు కేటాయించింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదివే ప్రతి విద్యార్థికీ రూ.15వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని ఈ సంవత్సరం నుంచి అందిస్తామని ప్రకటించింది. రాష్ట్రంలో సుమారు 80 లక్షల మంది విద్యార్థులు 1 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్నారు. వారికి ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున ఈ పథకానికి మొత్తం రూ.12వేల కోట్లు అవసరం. ఆ మేరకు బడ్జెట్‌లో కేటాయించకపోవడంతో ప్రభుత్వం అదనంగా నిధులు సర్దుబాటు చేయాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. గత ప్రభుత్వం దాదాపు 80 లక్షల మంది విద్యార్థులకు 'అమ్మఒడి' అమలు చేసినట్లు ప్రచారం చేసుకుంది. చివరికి వారి తల్లుల (43 లక్షల మంది) ఖాతాల్లో రూ.13వేలు చొప్పున జమ చేసింది. అప్పట్లో ఏడాదికి సుమారు రూ.6,500 కోట్లు ఖర్చు చేయగా, ఇప్పుడు తల్లికి వందనం పథకం అమలుకు దానికి రెట్టింపు అవుతోంది.

పాఠశాల విద్యకు ప్రాధాన్యం

కీలకమైన పాఠశాల విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. బడ్జెట్‌లో రూ.31,805 కోట్లు (దాదాపు 10%) కేటాయించింది, గతేడాది రూ.29,909కోట్లు కేటాయించగా, ఇప్పుడు రూ.1,896 కోట్లు పెంచింది.

2,506 కోట్లు

» ఉన్నత విద్యకు..

రాష్ట్ర విశ్వవిద్యాలయాలు అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం ఉన్నత విద్యకు రూ.2,506 కోట్లు కేటాయించింది. ఇందులో వర్సిటీలకే రూ.1,006 కోట్లు, నైపుణ్యాభివృద్ధికి రూ.1,228 కోట్లు కేటాయించింది. రాష్ట్రవ్యాప్తంగా నైపుణ్య గణన చేపట్టిన నేపథ్యంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్‌కు వేర్వేరుగా నిధులు కేటాయించింది.

3,486 కోట్లు

» మధ్యాహ్న భోజనానికి..

పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి పథకం 'మన బడి- మన భవిష్యత్తు', 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం' పథకాలు, బడులకు ఉచిత విద్యుత్‌కు కలిపి తాజా బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.3,486 కోట్లు కేటాయించింది. బడుల్లో మధ్యలో ఆగిపోయిన అభివృద్ధి పనులను ఈ నిధులతో చేపట్టనున్నారు. వాస్తవానికి మిగిలిపోయిన పనుల పూర్తికి రూ.10వేల కోట్లు అవసరమని అంచనా వేశారు. అయితే అనేక పాఠశాలల్లో పిల్లలు లేకపోయినా పనులు చేసి, నిధులు వృథా చేశారన్న ఆరోపణలున్నాయి. ఆడిట్ చేపట్టిన పాఠశాల విద్యాశాఖ, ప్రస్తుతం అవసరమైన పనులపైనే దృష్టి పెట్టింది.

4,332 కోట్లు

» మహిళా, శిశు సంక్షేమానికి..

మహిళా, శిశు సంక్షేమానికి కూటమి సర్కార్ పెద్ద పీట వేసింది. మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమశాఖకు బడ్జెట్‌లో రూ.4,332 కోట్లు కేటాయించింది. అంగన్వాడీ కార్యకర్తలకు గ్రాట్యుటీ మంజూరుకు ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని 47,296 అంగన్వాడీల నిర్వహణకు రూ.878 కోట్లు కేటాయించారు. అంగన్వాడీల్లో గర్భిణీలు, బాలింతలు, పదేళ్లలోపు పిల్లల పౌష్టికాహారానికి రూ.851 కోట్లు కేటాయించింది. గర్భిణీలు, బాలింతలు, ఆరేళ్లలోపు పిల్లలకు అంగనాడీ కేంద్రాల ద్వారా అందించే బాల సంజీవని, బాల సంజీవని ప్లస్ పథకం కిట్ల కోసం రూ.1,163.34 కోట్లు కేటాయించారు.

మున్సిపాలిటీలకు ఆర్థిక స్వేచ్ఛ

"ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేస్తున్నాం. వచ్చే విద్యా సంవత్సరం నుంచి మధ్యాహ్న భోజన పథకం కింద ప్రభుత్వ పాఠశాలలకు, సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు ప్రత్యేకంగా ప్యాక్ చేయబడిన నాణ్యమైన బియ్యం అందిస్తాం. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ధాన్యసేకరణ ప్రక్రియను మెరుగుపరిచాం. 2024 ఖరీఫ్ కాలానికిగాను 5.50 లక్షల మంది రైతులకు 32.7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లకు గాను రూ.7,564 కోట్లను 48 గంటల్లోనే చెల్లించాం. ఇందులో 90 శాతం మందికి 24 గంటల్లోనే చెల్లింపులు జరిగాయి. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన ధాన్యం కొనుగోలు చెల్లింపులకు సంబంధించిన రూ.1674 కోట్లను చెల్లించాం. 1999 సంవత్సరంలో దీపం పథకాన్ని ప్రవేశపెట్టిన చంద్రబాబు, తిరిగి ఇప్పుడు దీపం 2.0 పథకాన్ని ప్రారంభించారు. తల్లికి వందనం పథకానికి కేటాయింపులు చేస్తున్నాం. రూ.35తో దశాబ్దాల క్రితం ప్రారంభమైన వృద్ధుల పింఛన్‌ను ఇప్పుడు రూ.4వేలకు పెంచాం. మద్యం లైసెన్సుల్లో 10 శాతాన్ని కల్లుగీత కార్మికులకు కేటాయించాం. గత ప్రభుత్వం రాష్ట్ర వాటాను సకాలంలో విడుదల చేయకపోవడంతో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.13,499 కోట్లకు గాను కేవలం రూ.2,255 కోట్లు మాత్రమే వినియోగించుకోగలిగాం. మన ప్రభుత్వం అభ్యర్థన మేరకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకం గడువును 2028 వరకు పొడిగించింది. ఏప్రిల్ 1 2025 నుంచి మున్సిపాలిటీల్లో బిల్లుల చెల్లింపు అధికారాలను వాటికే ఇవ్వనున్నాం. స్థానికసంస్థలకు ఆర్థిక స్వేచ్ఛను అందించే కార్యక్రమమిది."

నాడు బ్లాక్‌లిస్టులో ప్రభుత్వం

"15శాతానికి పైగా రాష్ట్ర స్థూల దేశీయ ఉత్పత్తిని(జీఎస్‌డీపీ) సాధించడం లక్ష్యంగా చంద్రబాబు స్వర్ణాంధ్ర-2047 దార్శనిక పత్రం రూపొందించారు. అప్పులు తీర్చడం మరిచిన గత ప్రభుత్వ తప్పుడు విధానాలను సరి చేస్తున్నాం. ప్రభుత్వం కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టడం చూశాం. కానీ, ప్రభుత్వాన్నే కాంట్రాక్టర్లు బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి పనులు చేయడానికి ముందుకు రాని పరిస్థితి గత ప్రభుత్వంలోనే కనిపించింది. ఆదుస్థితి నుంచి రాష్ట్రాన్ని తప్పించగలిగాం. వైసీపీ హయాంలో 93పథకాలను కేంద్రం నిలిపివేయగా, రూ.9,371 కోట్ల బకాయిలను చెల్లించి 74 పథకాలను పునరుద్ధరించగలిగాం." అని కేశవ్ తెలిపారు."

బడ్జెట్ సమగ్ర స్వరూపం

వివరం	2023-24	2024-25 (బ.అం)	2024-25 (స.అం)	2025-26 (బ.అం)
1) రెవెన్యూ వసూళ్లు	1,73,767	2,01,173	1,76,031	2,17,976
ఎ)పన్ను ఆదాయం	85,922	1,09,789	94,967	1,09,007
బి) పన్నేతర ఆదాయం	7,432	10,576	7,018	19,119
సి) కేంద్ర పన్నుల్లో వాటా	45,711	50,474	52,080	57,566
డి) గ్రాంట్లు	34,702	30,334	21,966	32,284
2) మూలధన వసూళ్లు	79,775	93,254	98,576	1,04,383
3) మొత్తం వసూళ్లు	2,53,543	2,94,427	2,74,607	3,22,359
4) రెవెన్యూ వ్యయం	2,12,450	2,35,917	2,24,342	2,51,162
5) మూలధన వ్యయం	23,330	32,713	24,072	40,636
6) రుణాలు, వడ్డీ చెల్లింపు	17,776	25,797	26,193	30,561
7) మొత్తం వ్యయం	2,53,556	2,94,427	2,74,607	3,22,359
8) రెవెన్యూ లోటు	-38,682	(-)34,743	(-)48,311	(-)33,186
9) ద్రవ్య లోటు	-62,719	(-)68,742	(-)73,362	(-)79,927

బ.అం.- బడ్జెట్ అంచనా స.అం.- సవరించిన అంచనా (అంకెలు రూ. కోట్లలో)

రాష్ట్ర గతిని, స్థితిని మార్చే
ప్రగతిశీల బడ్జెట్

» స్వర్ణాంధ్ర-2047 లక్ష్యసాధనకు రోడ్‌మ్యాప్

» కేటాయింపుల్లో సూపర్ సిక్స్‌కు ప్రాధాన్యం : సీఎం

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పునర్ నిర్మాణానికి రాష్ట్ర బడ్జెట్ పునాదిలా నిలుస్తుందని దృఢంగా నమ్ముతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గత పాలకుల విధ్వంసంతో నిర్వీర్యమైన వ్యవస్థలను నిలబెట్టేందుకు ప్రతి క్షణం పనిచేస్తున్నామని, ఆర్థిక సవాళ్లు ఉన్నా 8 నెలల్లో పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్ల ఏర్పాటు, దీపం పథకం వంటి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. గత ప్రభుత్వం నిలిపివేసిన 93 కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 74 పథకాలను ఇప్పటికే ప్రారంభించామన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి అవసరమయ్యే విధంగా బడ్జెట్ కేటాయింపులు జరిపామన్నారు. రాష్ట్ర గతిని, స్థితిని మార్చే సానుకూల ప్రగతిశీల బడ్జెట్‌ను ప్రజల ముందుంచామన్నారు. స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్య సాధనకు ఈ బడ్జెట్ రోడ్‌మ్యాప్‌గా నిలుస్తుందన్నారు. పేదరిక నిర్మూలనలో భాగంగా పెద్ద ప్రాజెక్టుల మూలధన వ్యయం కోసం వయబిలిటీ గ్యాప్ ఫండ్ కింద రూ. 2 వేల కోట్లు కేటాయించామని తెలిపారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యమిచ్చామని అన్నారు.

బీసీల అభ్యున్నతికి పెద్దపీట: బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేయడంలో తమ ప్రభుత్వం వెనకడుగు వేసే ప్రసక్తే లేదని సీఎం స్పష్టం చేశారు. బీసీ సోదరుల సంక్షేమానికి రూ. 47,456 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. బీసీల గృహనిర్మాణానికి అదనంగా రూ. 50 వేలు అందించాలని నిర్ణయించామని చెప్పారు. దేశానికి అన్నపూర్ణగా ఉన్న ఏపీలో వ్యవసాయరంగాన్ని నిలబెట్టేందుకు రూ. 48,341 కోట్లతో వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని తెలిపారు. ప్రతి క్షణం ప్రతి గంటా ప్రతి రోజూ ప్రజల కోసం ఆలోచించే ప్రభుత్వం తమదని, ప్రజల ఆకాంక్షలు తీర్చేందుకే ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చామని తెలిపారు. మొత్తంగా అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్ సంతృప్తిని ఇచ్చిందని చంద్రబాబు పేర్కొన్నారు.



గ్రామాభివృద్ధికి ఊపునిచ్చేలా..

సంక్షేమం, సుస్థిర అభివృద్ధే లక్ష్యం
రెవెన్యూ, ద్రవ్య లోటు తగ్గింపునకు చర్యలు
అన్ని వర్గాల ప్రజల భవిష్యత్‌కు భరోసా ఇచ్చింది
బడ్జెట్‌పై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్ 2025-26 వార్షిక బడ్జెట్ సంక్షేమం, సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ఉంది' అని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. బడ్జెట్‌పై తన అభిప్రాయాన్ని వెల్లడిస్తూ ఆయన శుక్రవారం ఒక ప్రకటన చేశారు. 'గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేసింది. సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణతో రెవెన్యూ, ద్రవ్య లోటు తగ్గించే చర్యలు చేపట్టింది. ఈ బడ్జెట్ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల భవిష్యత్తుకు భరోసాని ఇచ్చేలా, అభివృద్ధికి బాటలు వేసేదిగా ఉంది. మూలధన వ్యయాన్ని రూ.40,636 కోట్లకు పెంచడం ద్వారా మౌలిక వసతులు పెరుగుతాయి. ప్రణాళికాబద్ధంగా రూపొందించిన ఈ బడ్జెట్‌లో సంక్షేమం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా చేసిన కేటాయింపులు కూటమి ప్రభుత్వ విధానాన్ని వెల్లడించాయి. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుకు తగిన కేటాయింపులు జరపడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. సాగు నీటి రంగానికి రూ.18,019 కోట్లు కేటాయింపులు శుభపరిణామం. పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అన్న మహాత్ముడి వాక్కు అనుసారం గ్రామీణాభివృద్ధికి రూ.18,890 కోట్ల భారీ కేటాయింపులు ద్వారా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జోరందుకుంటాయి. నిధుల లేమి అనేదే లేకుండా గ్రామాల్లో అభివృద్ధి ఊపందుకోవడానికి ఈ బడ్జెట్ బాటలు వేస్తుంది. జల్ జీవన్ మిషన్ పథకానికి బడ్జెట్‌లో ప్రాధాన్యం దక్కడం సంతోషంగా ఉంది. వ్యవసాయానికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఆ రంగానికి చేసిన బడ్జెట్ కేటాయింపులే చెబుతున్నాయి. ఆక్వా రైతులకి విద్యుత్ యూనిట్ ధరను రూ.1.50పై చేయడం హర్షణీయం. రాష్ట్ర పురోభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయింపుల్లో కేంద్ర ప్రభుత్వం ఇతోధిక సహకారం అందిస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీకి మనఃస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి తగిన దూరదృష్టితో ముందుకు వెళ్తున్న సీఎం చంద్రబాబుకు, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా బడ్జెట్ రూపొందించిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు, రైతాంగానికి మేలు చేసే బడ్జెట్ ప్రవేశపెట్టిన వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడుకు, అధికారులకు అభినందనలు' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

ప్రధాన శాఖలకు బడ్జెట్ కేటాయింపులు (రూ.కోట్లలో)

శాఖ	కేటాయింపు
పాఠశాల విద్యాశాఖ	31,806
బీసీ సంక్షేమ శాఖ	23,260
వైద్య ఆరోగ్యశాఖ	19,265
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ	18,848
జలవనరుల శాఖ	18,020
పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ	13,862
ఇంధన రంగం	13,600
వ్యవసాయ రంగం	11,636
సాంఘిక సంక్షేమ రంగం	10,909
ఆర్థికంగా వెనుకబడిన తరగతులు	10,619
రవాణా రంగం	8,785

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ..రాష్ట్ర వ్యాప్తంగా పరీక్షలు రాయనున్న 10.58 లక్షల మంది విద్యార్థులు


అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు శనివారం ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. తొలిరోజు మొదటి సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ భాషపై పరీక్ష నిర్వహించనున్నారు. ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాల విద్యార్థులకు రోజు మార్చి రోజు పరీక్షలు జరుగుతాయి. రాష్ట్రవ్యాప్తంగా 1,535 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 10.58 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారుల కార్యాలయాలకు అనుసంధానం చేశారు. పరీక్షా కేంద్రాలను 'నో మొబైల్ జోన్'గా ప్రకటించారు. అయితే అధికారిక సమాచారం కోసం చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రమే ఇంటర్ బోర్డు ఒక కీప్యాడ్ ఫోన్‌ను సమకూర్చారు. ఈ పరీక్షలకు నిమిషం నిబంధనను అమలు చేస్తున్నారు. అంటే.. పరీక్షలకు హాజరయ్యేవారు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు.



రాజధానికి విస్తృత ప్రచారం కల్పించండి

» అమరావతి బ్రాండ్ అంబాసిడర్ వైష్ణవితో సీఎం చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): "రాజధాని అమరావతికి విస్తృత ప్రచారం కల్పించండి. రాజధానిలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయండి' అని అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవికి సీఎం చంద్రబాబు సూచించారు. అమరావతి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులైన వైద్య విద్యార్థిని వైష్ణవి శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిశారు. ఈ సందర్భంగా వైష్ణవిని సీఎం అభినందించారు. నేటి యువతకు ఆమె ఆదర్శంగా నిలుస్తుందన్నారు. వైష్ణవి గతేడాది రాజధానికి రూ.25 లక్షలు విరాళంగా అందించారు. అమరావతి కోసం మరిన్ని విరాళాలు సేకరించాలన్నది తన లక్ష్యమని వైష్ణవి సీఎంకి తెలిపారు.



సీఎం చంద్రబాబుతో అమరావతి బ్రాండ్ అంబాసిడర్ వైష్ణవి

మార్గదర్శిపై కేసు కొనసాగాల్సిందే

» కర్త మరణించినా తప్పు నుంచి తప్పించుకోలేరు

» హైకోర్టులో ఆర్బీఐ వాదన

» తండ్రి క్రిమినల్ కేసులతో వారసులకు సంబంధం ఉండదు.. సిద్ధార్థ లూథ్రా వాదన

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మార్గదర్శి కేసుపై శుక్రవారం హైకోర్టులో మరోసారి విచారణ జరిగింది. ఉమ్మడి ఏపీ ప్రభుత్వం ఉన్నప్పుడు పెట్టిన కేసును కొట్టివేయాలని కోరుతూ మార్గదర్శి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌లపై జస్టిస్ శ్యాంకోషీ, జస్టిస్ కె.సుజన ధర్మాసనం విచారణ జరిపింది. రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) చట్టంలోని 45(ఎస్)కు విరుద్ధంగా ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించినందుకు మార్గదర్శి కేసు ఎదుర్కోవాల్సిందేనని ఆర్బీఐ తెలిపింది. ఆర్బీఐ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్. రవిచందర్ వాదిస్తూ.. రామోజీరావు మరణించినప్పటికీ మార్గదర్శిపై కేసు విచారణ కొనసాగాలని తెలిపారు. రామోజీరావు లేకపోయినా మార్గదర్శి హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) ఇప్పటికీ వ్యాపారం కొనసాగిస్తోందని చెప్పారు. అందువల్ల ఒకవేళ తప్పుచేసినట్లు తేలితే మార్గదర్శి సంస్థ సెక్షన్ 58 (బీ) ప్రకారం శిక్ష ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు మార్గదర్శి పిటిషన్‌లను తిరస్కరించాలని కోరారు. మరోవైపు మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా తదితరులు వాదిస్తూ.. హెచ్‌యూఎఫ్ అంటే సొంత వ్యాపారమని, కంపెనీ లేదా సొసైటీ తరహాలో హెచ్‌యూఎఫ్ చట్టబద్ధమైన వ్యక్తి (ఆర్టిఫిషియల్ పర్సన్) కాదని పేర్కొన్నారు. హెచ్‌యూఎఫ్‌కు కర్త, కర్మ, క్రియ అన్నీ రామోజీరావే కాబట్టి ఆయన చనిపోయిన నేపథ్యంలో ఇక ఎవరిపైనా కేసుఉండదని తెలిపారు. క్రిమినల్ కేసుల్లో ఒకవేళ తండ్రి తప్పులు చేసినా వాటితో వారసులకు సంబంధం ఉండదని చెప్పారు. మరోవైపు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల తరఫు న్యాయవాదులు వాదిస్తూ.. రామోజీరావు చనిపోయిన నేపథ్యంలో ఇప్పుడు కేసు విచారణ చేపట్టడం వల్ల సమయం వృథా తప్ప ఏమీ ఉండదని పేర్కొన్నారు. పిటిషనర్ ఉండవల్లి అరుణ్‌కుమార్ వాదిస్తూ.. 17ఏళ్లపాటు రామోజీకి ఏ సంబంధం లేదని వాదించి, ఇప్పుడు అన్నింటికీ ఆయనే బాధ్యుడని వాదిస్తున్నారన్నారు. వాదనలు విన్న బెంచ్, ఉండవల్లి పూర్తిస్థాయివాదనలకోసం మార్చి7కు కేసును వాయిదా వేసింది.

అది సజ్జల స్క్రిప్ట్!

దాని ప్రకారమే నేను మాట్లాడాను భార్గవ్‌రెడ్డి దానిని వైరల్ చేశారు

పోలీసుల ముందు అంగీకరించిన పోసాని

రాయచోటి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ముఖ్య నాయకుడు, అప్పటి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పంపిన 'స్క్రిప్టు' ప్రకారమే తాను మాట్లాడానని సినీనటుడు, వైసీపీ నేత పోసాని కృష్ణమురళి పోలీసుల ముందు అంగీకరించినట్లు తెలిసింది. ఆ వీడియోలను అప్పటి వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ సజ్జల భార్గవ్‌రెడ్డి వైరల్ చేశారని పోసాని పేర్కొన్నట్లు సమాచారం. తాను వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నట్లు... అవి కులాల మధ్య విభేదాలు సృష్టించే అవకాశమున్నట్లు తెలిసీ, ఉద్దేశపూర్వకంగానే మాట్లాడినట్లు అంగీకరించినట్లు ఆయన 'కన్ఫెషన్ స్టేట్‌మెంట్'లో పోలీసులు పేర్కొన్నట్లు సమాచారం. గురువారం రాత్రి పొద్దుపోయాక అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు కోర్టులో పోసానిని హాజరు పరిచారు. అంతకుముందు పోలీసులు అడిగిన కొన్ని ప్రశ్నలకు సరిగా బదులివ్వకుండా 'ఐ లవ్ యూ రాజా' అని వింతగా ప్రవర్తించిన పోసాని... కోర్టుహాలులో న్యాయాధికారిని 'అన్నా' అని సంబోధించారు. ఆయన తరఫున వైసీపీ లీగల్ సెల్ నుంచి పొన్నవోలు సుధాకర్‌రెడ్డితోపాటు ఏకంగా 15మంది న్యాయవాదులు కోర్టుకు హాజరయ్యారు. ప్రభుత్వం తరఫున రైల్వేకోడూరు కోర్టు ఏపీపీ చిన్నబాబు, మరో ఇద్దరు న్యాయవాదులు వాదనలు వినిపించారు. రాత్రి 10.30నుంచి అర్ధరాత్రి దాటాక 2.30వరకు వాదనలు జరిగాయి. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్‌ను పోసాని అసభ్యకరంగా మాట్లాడిన మాటల వీడియో క్లిప్‌లను ఏపీపీ చిన్నబాబు పెన్‌డ్రైవ్‌లో కోర్టుకు అందజేశారు. "పోసాని ఒక సామాజికవర్గాన్ని రెచ్చగొట్టేలా మాట్లాడారు. సినీ పరిశ్రమలో రెండు సామాజికవర్గాల పెత్తనమే ఉందంటూ కులాల మధ్య చిచ్చుకు ప్రయత్నించారు" అని తెలిపారు. పోలీసులు పెట్టిన సెక్షన్లలో పస లేదని పోసాని తరఫు న్యాయవాది పొన్నవోలు పేర్కొన్నారు. "ప్రభుత్వం పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నట్లు.. పోసాని పనికిమాలిన వాడు, బుద్ధి లేనివాడు కాదు. పోలీసులు పెట్టిన కొన్ని సెక్షన్లను పరిగణనలోకి తీసుకోకుండా రిమాండ్ తిరస్కరించి.. బెయిల్ మంజూరు చేయండి" అని కోరారు. జడ్జిని పలుమార్లు అన్నా.. అని పోసాని సంబోధించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తేజసాయి పోసానికి మార్చి 12వరకు రిమాండ్ విధిస్తూ... శుక్రవారం తెల్లవారుజాము 5.40గంటలకు తీర్పును వెల్లడించారు. కోర్టు ఆదేశాల మేరకు పోసానిని శుక్రవారం ఉదయం రాజంపేట సెంట్రల్ జైలుకు తరలించారు. ఆయనకు రిమాండ్ ఖైదీ నంబరు 2261 కేటాయించారు. జైలులో పోసాని కొద్దిపాటి అస్వస్థతకు గురయ్యారు. ప్రయాణాల కారణంగా అలిసిపోవడంతో స్వల్ప అస్వస్థతకు గురయ్యారని జైలులోని వైద్యుడు తెలిపారు. పోసాని తన స్నేహితుడు సాల్మన్‌రాజును పిలిపించుకుని మాట్లాడారు. రిమాండ్ ఖైదీలను ఉంచే సబ్‌జైలు కావడంతో ఇక్కడ ఐదు గదులు మాత్రమే ఉన్నాయి. అందులో ఒక గదిని పోసానికి కేటాయించారు. పోసాని కోరడంతో పడుకోవడానికి బెడ్ ఏర్పాటు చేశారు. జైలులో ఉదయం అల్పాహారంగా పొంగలి, మధ్యాహ్నం అన్నం, పప్పు పెట్టారు.



పోసాని కృష్ణమురళిని రాజంపేట సబ్‌జైలుకు తరలిస్తున్న పోలీసులు

రిమాండ్ రిపోర్టులో కీలక వివరాలు...

జనసేన నేత మణి ఫిర్యాదు మేరకు ఓబుళవారిపల్లి పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో బుధవారం రాత్రి హైదరాబాద్‌లో పోసాని కృష్ణమురళిని పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆయన రిమాండ్ రిపోర్టులో పలు కీలక వివరాలను పొందుపరిచారు. "కులాలు, వర్గాల మధ్య చిచ్చు పెట్టేలా పోసాని కృష్ణమురళి మాట్లాడారు. వాటిని యూట్యూబ్ తదితర సోషల్ మీడియా వేదికలపై వైరల్ చేశారు. తెలుగు చిత్ర పరిశ్రమ మీద, రాజకీయ పార్టీ నేతల మీద ఆయన చేసిన వ్యాఖ్యలు అత్యంత వివాదాస్పదమైనవి. సమాజంలో విభేదాలు సృష్టించి, అల్లర్లకు దారితీసేలా... ఉద్దేశపూర్వకంగానే మాట్లాడారు. ఒక ప్రముఖ నటుడిని కించపరిచేలా, ఆయన కుటుంబసభ్యులను అవమానించేలా దూషణలు చేశారు. ఇంకో వీడియోలో దళితులను అవమానించారు. తన పిల్లలకు దళితులతో వివాహం చేయబోనంటూ వ్యాఖ్యానించారు. వివాదాస్పద వ్యాఖ్యలు చేయడమే పనిగా పెట్టుకుని... నేరానికి పాల్పడ్డారు. తన 'పొలిటికల్ మాస్టర్స్'ను సంతృప్తి పరచడమే లక్ష్యంగా మాట్లాడారు. ఆయనపై రాష్ట్ర వ్యాప్తంగా మరో 14కేసులు నమోదయ్యాయి. 4 కేసుల్లో చార్జిషీట్లు దాఖలయ్యాయి. పార్వతీపురం జిల్లా పాలకొండ పోలీసులు ఇచ్చిన నోటీసును పోసాని లెక్క చేయలేదు. చట్టంపట్ల ఆయనకు ఏమాత్రం గౌరవం లేదనేందుకు ఇదొక నిదర్శనం. ఆయన చేసిన వ్యాఖ్యలు ఇంటర్నెట్‌లో ఉన్నాయి. ఆయనకు బెయిలు ఇస్తే... సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశముంది. ఈ కేసులో ఇంకా దర్యాప్తు చేయాల్సి ఉన్నందున... పోసానిని జ్యుడీషియల్ కస్టడీ విధించండి" అని పోలీసులు కోర్టును కోరారు.

సత్యవర్ధన్ 'వాంగ్మూలం' ఇప్పించండి

» కోర్టులో పోలీసుల మెమో

విజయవాడ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): గన్నవరం టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో ఫిర్యాదుదారుడిగా ఉన్న ముదునూరి సత్యవర్ధన్ వాంగ్మూలం కాపీని తమకు ఇప్పించాలని పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ కోర్టులో మెమో దాఖలు చేశారు. వంశీతోపాటు మరో నలుగురిని అరెస్టు చేసిన తర్వాత సత్యవర్ధన్‌తో న్యాయాధికారి ముందు సీఆర్పీసీ 164 ప్రకారం వాంగ్మూలం ఇప్పించారు. ఈ వాంగ్మూలం సర్టిఫైడ్ కాపీని అందజేయాలని పోలీసులు మెమో దాఖలు చేశారు. కాగా, వంశీదాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయడానికి పీపీ కల్యాణి మూడు రోజులు గడువు కోరారు. సోమవారం కౌంటర్ దాఖలు చేస్తామని ఆమె కోర్టుకు తెలిపారు.

పోలీస్ కస్టడీపై 3న తీర్పు

సత్యవర్ధన్ కేసులో మరో ఇద్దరు నిందితులను తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును న్యాయస్థానం 3వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో నాలుగో నిందితుడు ఘంటా వీర్రాజు, పదో నిందితుడు వేలూరు వంశీబాబును పది రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై శుక్రవారం వాదనలు ముగిశాయి. తీర్పును సోమవారం వెలువరిస్తామని న్యాయాధికారి హిమబిందు తెలిపారు.

నా బ్యారక్ మార్చండి.. వంశీ పిటిషన్

విజయవాడ జిల్లా జైలులో తన బ్యారక్‌ను మార్చాలని కోరుతూ గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను ఆయన తరఫున న్యాయవాది సత్యశ్రీ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ న్యాయస్థానంలో శుక్రవారం వేశారు. తనను 5-10 మంది ఉన్న బ్యారక్‌లోకి మార్పు చేయాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో తాను ఉంటున్న బ్యారక్‌లో ఇతర ఖైదీలను కూడా ఉంచాలని కోరారు.

గోరంట్ల మాధవ్‌పై రాజద్రోహం కేసు పెట్టాలి

» అనంత ఎస్పీకి టీడీపీ, జనసేన ఫిర్యాదు

అనంతపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అంతర్యుద్ధం రానుందని వ్యాఖ్యలు చేసిన వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై రాజద్రోహం కేసు నమోదు చేయాలని టీడీపీ, జనసేన నేతలు గంగారామ్, సుధాకర్ యాదవ్, లక్ష్మీనరసింహ, పొదిలి బాబురావు, ఇమామ్ హుస్సేన్ శుక్రవారం అనంతపురం జిల్లా ఎస్పీ జగదీశ్‌కు ఫిర్యాదు చేశారు. పోక్సో కేసు బాధితురాలి వివరాలను బహిరంగపరిచినందుకు ఆయనపై విజయవాడ సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనిపై అక్కడి పోలీసులు గురువారం అనంతకు వచ్చి, గోరంట్ల మాధవ్‌కు నోటీసులిచ్చారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో గోరంట్ల మాధవ్ చేసిన వ్యాఖ్యలను టీడీపీ, జనసేన నేతలు తీవ్రంగా తప్పుబట్టారు. కూటమి ప్రభుత్వాన్ని కూలదోయడానికి వైసీపీ కుట్రలు చేస్తోందని, ఆ పార్టీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నాయి. ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన మాధవ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

రాజమండ్రి రీజనల్ సైన్స్ సెంటర్‌కు స్వామి జ్ఞానానంద పేరు పెట్టాలి

» డిప్యూటీ సీఎం పవన్ ప్రతిపాదనపై కేంద్ర సాంస్కృతిక శాఖకు లేఖ

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలోని రీజనల్ సైన్స్ సెంటర్‌ను స్వామి జ్ఞానానంద రీజనల్ సైన్స్ సెంటర్‌గా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ మేరకు రీజనల్ సైన్స్ సెంటర్‌కు 'స్వామి జ్ఞానానంద' పేరు పెట్టాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రతిపాదించారు. దీనిపై కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, శాస్త్ర, సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాము శుక్రవారం లేఖ రాశారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మార్చి 1 నుంచి 30 వరకు రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో నాలుగు నెలలు పైబడిన ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, 4-8 నెలల పెయ్య దూడలకు బ్రూసెలోసిస్ టీకాలు ఉచితంగా వేయనున్నట్లు పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు తెలిపారు.

ఆంధ్రాకు ఐఏఎస్ శివశంకర్ లోతేటి

2013 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి శివశంకర్ లోతేటి తిరిగి ఆంధ్రప్రదేశ్‌కు రానున్నారు. గతంలో డీవోపీటీ ఆదేశాల మేరకు తెలంగాణకు వెళ్లినా.. తర్వాత ఆ ఆదేశాలను సవాల్ చేస్తూ మళ్లీ క్యాట్‌ను ఆశ్రయించారు. తాను ఏపీలోని విజయనగరం జిల్లాకు చెందిన వాడినని, ఐఏఎస్ పరీక్ష రాస్తున్న సమయంలో తెలంగాణలోని తన బంధువుల అడ్రస్ ఇవ్వాల్సి వచ్చిందని, దాని ఆధారంగా తనను ఆ రాష్ట్రానికి కేటాయించడం సరికాదని వెల్లడించారు. వాదనలు విన్న క్యాట్ ఆయనను నాలుగు వారాల్లోగా ఏపీకి బదిలీ చేయాలని డీవోపీటీని ఆదేశించింది.

వరంగల్ విమానాశ్రయానికి గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ/వరంగల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని వరంగల్ జిల్లా మామునూరు విమానాశ్రయం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఉత్తర్వులు ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రానికి వరంగల్ విమానాశ్రయం గేమ్ చేంజర్‌గా, రాష్ట్రాభివృద్ధికి కీలక మైలురాయిగా మారుతుందని రామ్మోహన్‌నాయుడు అన్నారు.

పార్లమెంటు సీట్లు పెంచకుండా దక్షిణాదిపై బీజేపీ కుట్ర: రేవంత్

హైదరాబాద్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంటు సీట్లను పెంచకుండా శిక్షించడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అలా జరిగితే దక్షిణాది రాష్ట్రాల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. దక్షిణాది సీట్లు తగ్గవంటూ అమిత్ షా చెబుతున్నారని, పెంచబోమన్న లాజిక్ అందులో కనబడుతోందని వ్యాఖ్యానించారు. ఈ కుట్రను తిప్పికొడతామని ప్రకటించారు. డీలిమిటేషన్‌లో లోక్‌సభ సీట్లు తగ్గబోవని చెబుతున్న అమిత్‌షా దామాషా పద్ధతిలో ఎన్నిసీట్లు పెంచబోతున్నారో ఎందుకు చెప్పడం లేదని రేవంత్ ప్రశ్నించారు. ఇప్పుడున్న సీట్ల దామాషానా? జనాభా దామాషానా? చెప్పకుండా తగ్గవంటూ స్పష్టత లేని సమాధానం అమిత్‌షా ఎలా ఇస్తారన్నారు.

డైరెక్ట్ మేనేజ్‌మెంట్‌లో ఉన్న దర్గాలకు టెండర్లు: అజీజ్

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డుకు ఆదాయం పెంచే విధంగా తొలి అడుగులోనే విజయం సాధించామని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. కర్నూల్ జిల్లా ఎల్లార్తి గ్రామంలో షేక్ షావలి పాషావలి దర్గాకు టెండర్ల ద్వారా వక్ఫ్‌బోర్డుకు ఆదాయం పెంచామన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా వక్ఫ్ బోర్డు పరిధిలో డైరెక్ట్ మేనేజ్‌మెంట్‌లో ఉన్న దర్గాలకు టెండర్లు పిలుస్తామని, తద్వారా వక్ఫ్ బోర్డుకు ఆదాయం పెరుగుతుందన్నారు. దీంతోపాటు వక్ఫ్ బోర్డు ఆస్తుల ఆక్రమణలను తొలగించడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు.

మన సీట్లు మనకే!

» తెలంగాణ బాటలో ఏపీ

» ఉన్నత విద్యా సంస్థల్లో సీట్లపై కూటమి ప్రభుత్వం నిర్ణయం

» అన్ రిజర్వ్‌డ్ కోటాలో ఓయూ కట్

» నేడో రేపో సర్కారు ఉత్తర్వులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉన్నత విద్యా సంస్థల్లోని సీట్ల విషయంలో ఏపీ ప్రభుత్వం కూడా తెలంగాణ బాటలోనే నడవాలని నిర్ణయించింది. 'ఇకపై మా సీట్లు మాకే' అంటూ తెలంగాణ ప్రభుత్వం తాజాగా స్థానికత, నాన్‌లోకల్ కోటాలపై స్పష్టత ఇస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో ఏపీ కూడా అదే విధానంలో వెళ్లేందుకు సిద్ధమైంది. దీంతో ఇకనుంచి రాష్ట్రంలోని ఉన్నత విద్యలో సీట్లు రాష్ట్ర విద్యార్థులకే దక్కనున్నాయి. దీనిపై ప్రభుత్వం ఈ రోజు లేదా రేపు ఉత్తర్వులు జారీ చేయనుంది. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం ఉమ్మడి రాష్ట్రం నుంచి ఉన్నత విద్యలో అన్‌రిజర్వ్‌డ్ కోటా అమలవుతోంది. అప్పట్లో ఉమ్మడి రాష్ట్రాన్ని 3 రీజియన్లుగా విభజించి ఈ కోటా అమలు చేశారు. ఆంధ్రా ప్రాంతంలో ఆంధ్రా యూనివర్సిటీ(ఏయూ), రాయలసీమలో శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ(ఎస్వీ), తెలంగాణలో ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ)లు ఈ కోటాకు ప్రాతిపదికగా ఉన్నాయి. ప్రతి యూనివర్సిటీలో కన్వీనర్ కోటా సీట్లలో 85 శాతం పూర్తిగా ఆ యూనివర్సిటీ పరిధిలోకే వస్తాయి. మిగిలిన 15శాతం సీట్లను అన్‌రిజర్వ్‌డ్‌గా పేర్కొని ఆయా వర్సిటీల పరిధిలోని విద్యార్థులకు కేటాయిస్తారు. విభజన జరిగి పదేళ్లు దాటినందున ఈ కోటా వర్తించదంటూ తెలంగాణ ప్రభుత్వం తాజాగా మార్పులు చేసింది. అన్‌రిజర్వ్‌డ్ కోటాలో ఏయూ, ఎస్వీయూను తొలగించింది. దీంతో ఏపీ విద్యార్థులు ఓయూ పరిధి అయిన తెలంగాణలో సీట్లు పొందడానికి అర్హత కోల్పోయారు. దీంతో ఇప్పుడు ఏపీ ప్రభుత్వం కూడా అదే నిర్ణయం తీసుకుంది. ఏయూ, ఎస్వీయూ అన్‌రిజర్వ్‌డ్ కోటాలో ఓయూను తొలగించనుంది. దీంతో రాష్ట్రానికి చెందిన సీట్లు రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల విద్యార్థులకు మాత్రమే దక్కుతాయి. ఇతర రాష్ట్రాల విద్యార్థులకు సీట్లు ఎలా కేటాయించాలనే దానిపై ఇంకా కసరత్తు జరుగుతోంది. అలాగే స్థానికతపైనా ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది.



సంబంధం లేకున్నా

ఉన్నత విద్యలో సీట్లకు, పునర్విభజన చట్టానికి సంబంధం లేదనే వాదన వినిపిస్తోంది. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం ఉన్నత విద్యలో అన్‌రిజర్వ్‌డ్ కోటా అమలవుతోందని, ఈ కోటా తొలగించాలంటే రాజ్యాంగంలో 371(డీ)ని తొలగించడం లేదా సవరించడం ద్వారానే సాధ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారు. కానీ, కోటాపై తెలంగాణ నిర్ణయం తీసుకోవడంతో ఏపీ విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా సర్కారు కూడా అదే బాటను ఎంచుకుంది.

10 తర్వాత అమరావతి పనులు

» త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి

» మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ



అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణ పనులు ఈ నెల 10 తర్వాత నుంచి ప్రారంభమవుతాయని మునిసిపల్ శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లేదని విమర్శించారు. శుక్రవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మున్సిపల్‌శాఖలో నిధులను గత ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. ఏప్రిల్ 1 నుంచి మున్సిపాలిటీ నిధులు ఆయా సంస్థలే ఖర్చు చేసేలా బడ్జెట్‌లో ప్రకటించడం పట్ల సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. దీంతో సీఎఫ్ఎంఎస్ నుంచి చెల్లించే విధానం రద్దవుతుందన్నారు. బడ్జెట్‌లో మున్సిపల్‌శాఖకు రూ.13 వేల కోట్లకుపైగా కేటాయింపులు చేశారని, దీనిలో సీఆర్డీఏకు రూ.6వేల కోట్లు కేటాయించారని తెలిపారు. జగన్ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసిందని, కానీ.. కూటమి ప్రభుత్వం బీసీల సంక్షేమానికి రూ.47,456 కోట్లు కేటాయించడం ద్వారా బీసీల అభ్యున్నతికి కట్టుబడిందని చెప్పారు.

సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్

రాజధాని అమరావతి సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టు అని మంత్రి నారాయణ తెలిపారు. ఎక్కడా ఒక్క రూపాయి ప్రభుత్వం నుంచి అదనంగా ఖర్చు పెట్టడం లేదన్నారు. ప్రజలు కట్టే పన్నుల నుంచి ఒక్క పైసా వినియోగించడంలేదని చెప్పారు. అమరావతికి ప్రపంచ బ్యాంకు, ఈడీజీ, హడ్కోలాంటి సంస్థలు రుణాలు మంజూరు చేశాయన్నారు. ఇప్పటివరకూ రూ.48వేల కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచామన్నారు. ఐఏఎస్ అధికారులు, న్యాయమూర్తుల బంగళాల టెండర్లలో అక్రమాలు జరిగాయని కొందరు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐఏఎస్ బంగళాల నిర్మాణానికి చదరపు అడుగుకు రూ.4,382 మాత్రమే ఖర్చు పెడుతున్నట్లు తెలిపారు. కానీ, జగన్ పత్రికలో మాత్రం చదరపు అడుగుకు రూ.9,300 ఖర్చు పెడుతున్నట్టు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. మంత్రులు, న్యాయమూర్తుల బంగళాల నిర్మాణానికి చదరపు అడుగుకు రూ.10,042 ఖర్చవుతుందని రాశారన్నారు. కానీ, వాస్తవంగా చదరపు అడుగుకు రూ.4,264 మాత్రమే ఖర్చవుతుందని తెలిపారు. నిర్మాణంలో నాణ్యతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. అమరావతిలో సంస్థలకు భూములు కేటాయించిన తర్వాత మిగిలిన భూమిని అమ్మడం ద్వారా నిధులు సేకరిస్తామన్నారు. జగన్ చెప్పినట్లు ప్రజలపై ఒక్క రూపాయి కూడా భారం వేయబోమన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో టెండర్ల ప్రక్రియ ఆలస్యం అయిందని నారాయణ చెప్పారు. ఈ నెల 10న టెండర్లు ఖరారు చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. మూడేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తి చేయాలని చంద్రబాబు నిర్దేశించినట్లు తెలిపారు.

వేసవిలో తాగునీటి సమస్య రావొద్దు!

» తగిన ముందస్తు చర్యలు తీసుకోండి

» కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ ఆదేశాలు

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): వేసవిలో రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తుచర్యలు చేపట్టాలని, తగిన కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. శుక్రవారం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీటి సమస్యతో పాటు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో అనుసరించాల్సిన విధి విధానాలు, ఎంఎస్ఎంఈ పార్కుల సర్వే తదితర అంశాలపై సమీక్షించారు. సీఎస్ మాట్లాడుతూ మార్చి నుంచి జూన్ వరకు వేసవి తీవ్రత ఉండే అవకాశం ఉందని, రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య లేకుండా జిల్లాల వారీగా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. నీటి ద్వారా వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి ఎద్దడి ఉండే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ ఏడాది జలాశయాలు నిండుగా ఉన్నాయని, భూగర్భ జలాలు కూడా అందుబాటులో ఉన్నాయని, నీటి గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. చేతి పంపులు, బావులు, తాగునీటి పథకాల మరమ్మతులు వెంటనే చేపట్టాలని, అవసరమైతే సురక్షిత నీటి పంపిణీకి ముందుగానే ట్యాంకులను అద్దెకు తీసుకొని సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. పింఛన్ల పంపిణీలో లబ్ధిదారుల పట్ల గౌరవంగా వ్యవహరించాలని, వారిని ఇబ్బంది పెట్టకుండా, ఎస్‌వోపీని తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. మార్చి 1న ఉదయం 7నుంచి సాయంత్రం 5 గంటల వరకు పింఛన్లు పంపిణీ చేయాలని, మిగిలిన వాటిని 3న పంచాలని సీఎస్ పేర్కొన్నారు.

ప్రభుత్వ న్యాయవాదిగా శ్రీకాంత్‌రెడ్డి

» గూడపాటి లక్ష్మీనారాయణ సహా 9 మంది స్టాండింగ్ కౌన్సిళ్ల నియామకం

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టులో ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించేందుకు న్యాయవాది అంబటి శ్రీకాంత్‌రెడ్డిని ప్రభుత్వ న్యాయవాదిగా నియమిస్తూ శుక్రవారం న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే వివిధ ప్రభుత్వ సంస్థల తరఫున వాదనలు వినిపించేందుకు తొమ్మిది మంది న్యాయవాదులను స్టాండింగ్ కౌన్సిళ్లుగా నియమించింది. రాయలసీమతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని మున్సిపాలిటీలకు స్టాండింగ్ కౌన్సిల్‌గా ప్రముఖ న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. కనగాల రాధిక(ఉన్నత విద్యామండలి), చక్రవర్తుల గంగాకుమార్ (ఏయూ), మేడబలిమి చలపతి (ఏఎన్‌యూ), నందం బాలచంద్రశేఖర్(డాక్టర్ వైయస్ఆర్ హార్టికల్చరల్ యూనివర్సిటీ), బి.రమేష్ (ఇంటర్మీడియట్ బోర్డు), నిమ్మగడ్డ విజయశాంతి (రాయలసీమ యూనివర్సిటీ), సోమిశెట్టి గణేశ్‌బాబు (విశాఖ, మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ), చింతపల్లి శ్రీనివాస్ (ఉత్తరాంధ్రలోని దేవాలయాలు) స్టాండింగ్ కౌన్సిళ్లుగా నియమితులయ్యారు. వీరి నియామకానికి సంబంధించి న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు.

క్యూలైన్లు ఉంటే.. తొక్కిసలాట జరిగేది కాదు!

» బైరాగిపట్టెడ పార్కు వద్ద ఘటనపై బాధితులు

» న్యాయ విచారణకు దుకాణదారుల గైర్హాజరు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): బైరాగిపట్టెడ పార్కులోనూ క్యూలైన్లు ఏర్పాటు చేసుంటే తొక్కిసలాట జరిగేది కాదని పలువురు బాధితులు పేర్కొన్నారు. తిరుపతి తొక్కిసలాట ఘటనపై జస్టిస్ సత్యనారాయణమూర్తి శుక్రవారం విజయవాడ నుంచి వర్చువల్‌గా మరో ముగ్గురిని విచారించారు. తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టీటీడీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని రాజేశ్వరి, కర్ణాటకలోని బళ్లారి నుంచి శ్రీదేవి, వైజాగ్ నుంచి ఆదిలక్ష్మి నాటి ఘటనపై వివరించారు. 'వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీకి భక్తులను క్యూలైన్లలో పంపించకుండా బైరాగిపట్టెడ పెద్ద సంఖ్యలో పార్కులోకి వదిలేశారు. పోలీసులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా గేటు తీశారు. దీంతో తొక్కిసలాట జరిగింది. పార్కులోనూ క్యూలైన్లు ఏర్పాటు చేసి ఉంటే ఈ ఘటన జరిగేది కాదు' అని బాధితులు కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. కాగా, విచారణకు బైరాగిపట్టెడ పార్కు వద్ద ఉండే 13మంది దుకాణదారులు గైర్హాజరయ్యారు. కమిటీ ముందు హాజరై నాటి ఘటనలను వివరిస్తే.. భవిష్యత్తులో పోలీసుల నుంచి ఇబ్బందులు ఎదురుకావచ్చన్న ఆందోళనతో రాలేదన్న ప్రచారం సాగుతోంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.